RNI NO: APTEL/25/A0108

మహా న్యూస్

www.mahinewsindia.com

MAHI NEWS

Epaper: https://epaper.mahinewsindia.com

తెలుగు దినపత్రిక

ఆంధ్రప్రదేశ్,తెలంగాణ. | సంపుటి : 02 | సంచిక : 159 | ఎడిటర్ : నీలి రామసుబ్బయ్య | పేజీలు : 8 | వెల రూ. 2 | బుధవారం -09 - సెప్టెంబర్ - 2026

Published From :YSR Kadapa circulated by Kurnool I Anatapuram I Chittoor I East & West Godavari I Guntur I Krishna I Nellore I Srikakulam I Visakhapatnam I Vijayanagaram I Prakasham & Hyderabad & Telangana

ఇండోనేషియాలో బద్దలైన అగ్నిపర్వతం..

- ఇండోనేషియాలో అనక్ క్రాకటోవా అగ్నిపర్వతం బద్దలైన వైనం
- దట్టమైన బూడిద కారణంగా 8 విమానాశ్రయాలు మూసివేత, 2300 ఫ్లైట్లు రద్దు
- విమానాశ్రయాల్లో చిక్కుకున్న సుమారు 2.70 లక్షల మంది ప్రయాణికులు
- సునామీ ప్రమాదం లేదన్న అధికారులు, లెవెల్-3 హెచ్చరికలు జారీ

ఇరాన్‌తో యుద్ధంలో గెలిస్తే గ్యాలన్ పెట్రోల్ 2 డాలర్లకే: డొనాల్డ్ ట్రంప్

- ఇరాన్‌తో యుద్ధంలో అమెరికా గెలిస్తే చమురు ధరలు పడిపోతాయన్న ట్రంప్
- గ్యాలన్ పెట్రోల్ ధర 2 డాలర్ల కంటే తక్కువకు వస్తుందని జోస్యం
- ట్రూత్ సోషల్ వేదికగా తన అభిప్రాయాన్ని వెల్లడించిన అధ్యక్షుడు
- ఇరాన్ ఇంధన వనరులపై దాడి చేస్తే చూస్తూ ఊరుకోబోమని ఇరాన్ హెచ్చరిక

వచ్చే ఏడాదే బుల్లెట్ రైలు పరుగులు..

రైల్వే మంత్రి కీలక ప్రకటన

- వచ్చే ఏడాది మే, జూన్‌లో బుల్లెట్ రైలు ట్రయల్స్
- 2 నుంచి 4 నెలల తర్వాత అధికారికంగా ప్రారంభం
- తొలి బాడీ ఫ్రేమ్ ఇప్పటికే సిద్ధమైందన్న అశ్వినీ వైష్ణవ్
- సూరత్-వాపి మార్గం డిసెంబరులో పూర్తయ్యే అవకాశం
- గంటన్నరలో ముంబై నుంచి వడోదరకు

నన్నేమైనా అంటే నిజాలు బయటకు వస్తాయి: విజయసాయిరెడ్డి

- దసరా మరుసటి రోజే కొత్త పార్టీ ప్రకటిస్తానన్న మాజీ ఎంపీ
- టీడీపీ, వైసీపీ కుటుంబ పార్టీలంటూ విజయసాయిరెడ్డి విమర్శ
- నమ్మకద్రోహి అంటే నిజాలు బయటపెడతానంటూ వైసీపీకి హెచ్చరిక
- బొత్స, సత్యకుమార్ ఆరోపణలను తిప్పికొట్టిన సాయిరెడ్డి

వాట్సప్ గవర్నెన్స్, డిజిటల్ సేవలు.. పాలనలో బెస్ట్ ప్రాక్టీసెస్ పాటించాలి

ఉచిత ఇసుక విధానాన్ని పక్కాగా అమలు చేయాలని సీఎం ఆదేశం

- ★ ఎమ్మెల్యేలకు సీఎం చంద్రబాబు దిశానిర్దేశం
- ★ ఎమ్మార్పీ కంటే ఎక్కువకు మద్యం అమ్మితే కఠిన చర్యలని హెచ్చరిక
- ★ ఫేక్ ప్రచారాన్ని వాస్తవాలతో సమర్థంగా తిప్పికొట్టాలని నేతలకు సూచన
- ★ 175 నియోజకవర్గాల్లో రూ.20,400 కోట్ల విలువైన పనులకు ఆమోదం
- ★ టెక్నాలజీ సాయంతో ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

అమరావతి: ప్రభుత్వ పరిపాలన సేవలను ప్రజలకు మరింత సమర్థంగా అందించడంపై దృష్టి సారించాలని టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి చంద్రబాబు పార్టీ ఎమ్మెల్యేలు, మిగతా 2 లో

నా కొడుకుని చూసి చాలా గర్విస్తున్నా: సీఎం విజయ్ తండ్రి చంద్రశేఖర్

మహిళల గౌరవంపై విజయ్ తీసుకున్న నిర్ణయాలు సంతోషాన్ని ఇచ్చాయన్న చంద్రశేఖర్

ప్రత్యర్థి పార్టీల చవకబారు ఆరోపణలను ప్రజలు నమ్మరని వ్యాఖ్య

ప్రతిపక్షాల విమర్శలను విజయ్ తిప్పికొట్టిన తీరు సంతోషాన్ని ఇచ్చిందని వెల్లడి

ప్రతిపక్షాల తప్పుడు ప్రచారాన్ని సోషల్ మీడియాలో తిప్పికొట్టాలి

సోషల్ మీడియాను ఎంతమంది యాక్టివ్ గా వాడుతున్నారు?

- సోషల్ మీడియా వినియోగంపై టీడీపీ నేతలకు నారా లోకేశ్ దిశానిర్దేశం
- ప్రభుత్వ అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచన
- ప్రధాని మోదీని, తనను ఉదాహరణగా చూపుతూ నేతలకు దిశానిర్దేశం
- అమరావతి అభివృద్ధిని విస్తృతంగా ప్రచారం చేయాలని ఆదేశం



అమరావతి : తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో జరుగుతున్న లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో రెండో రోజు, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ నేతలను ఉద్దేశించి కీలక ప్రసంగం చేశారు. 'పొలిటికల్ కమ్యూనికేషన్ మిగతా 2 లో

'కేసీఆర్‌ను చంపే కుట్ర జరుగుతోంది'..

కాంగ్రెస్ చేపట్టిన ఎర్రవల్లి ఫాంహౌస్ ముట్టడి కార్యక్రమంపై కేటీఆర్ ధ్వజం

- కాంగ్రెస్ శ్రేణులు అరాచకానికి పాల్పడ్డాయని విమర్శ
- ప్రభుత్వంపై డైవర్షన్ రాజకీయాల ఆరోపణ
- అసెంబ్లీలో ప్రజా సమస్యలపై చర్చించాలని డిమాండ్
- దళిత, గిరిజన హామీలు అమలు చేయాలని డిమాండ్

హైదరాబాద్: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై కాంగ్రెస్ శ్రేణులు కుట్రపూరితంగా హత్యాయత్నం చేశాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన ఆరోపణలు చేశారు. ఎర్రవల్లి ఫాంహౌస్ ముట్టడి పేరుతో కాంగ్రెస్ శ్రేణులు అరాచకానికి పాల్పడ్డాయని మండిపడ్డారు. ఫాంహౌస్‌కు వెళుతున్న మిగతా 2 లో

తాతా మధు వ్యాఖ్యలపై కేసీఆర్ క్షమాపణ చెప్పి

ఆయనతో రాజీనామా చేయించాలి

శాసనసభకు, స్పీకర్ స్థానానికి, రాష్ట్ర ప్రజలకు అవమానం

- ఎమ్మెల్సీ తాతా మధుతో కేసీఆర్ రాజీనామా చేయించి, క్షమాపణ చెప్పాలి
- అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి డిమాండ్
- ఎమ్మెల్సీ వ్యాఖ్యలను ఖండించిన మంత్రులు, ఎమ్మెల్యేలు, భాజపా, మజ్లిస్, సీపీఐ సభ్యులు
- మండలి నుంచి ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్‌రెడ్డిలు సస్పెన్షన్



హైదరాబాద్: రెండో రోజు తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు రేపటికి వాయిదా పడ్డాయి. (మంగళవారం, సెప్టెంబర్ 8వ తేదీ) సభ ప్రారంభం కాగానే బీఆర్ఎస్ సభ్యుల నినాదాలతో హోరెత్తించారు. ఈ క్రమంలోనే ప్రతిపక్ష బీఆర్ఎస్- ప్రభుత్వ సభ్యుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. ప్రధానంగా స్పీకర్ గద్దం ప్రసాద్ అంశంపై సభ హోరెత్తిపోయింది. దీనిలో భాగంగా స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్‌రెడ్డిలపై చర్యలకు సభలో తీర్మానం పెట్టారు. మిగతా 2 లో



నా వడోదరా అద్భుతం.. ప్రధాని మోదీ భావోద్వేగం

- వడోదరా ప్రజలు చేపట్టిన స్వచ్ఛతా కార్యక్రమంపై ప్రధాని ప్రశంసలు
- స్వచ్ఛతను పండగల స్ఫూర్తితో కొనసాగించాలని ప్రజలకు పిలుపు
- వడోదరాను మళ్లీ అపరిశుభ్రం కానివ్వబోమని సంకల్పం తీసుకోవాలన్న మోదీ
- పర్యటనలో భాగంగా రూ.35,000 కోట్లకు పైగా విలువైన ప్రాజెక్టులకు శ్రీకారం
- మోదీ కార్యక్రమానికి బుక్‌మైషో ద్వారా రిజిస్ట్రేషన్లు.. గంటలోనే సీట్లు ఫుల్

మహిళల ముందు హరీశ్ రావు బట్టలు విప్పుతారా?: సీతక్క ఫైర్

- దళిత వర్గానికి చెందిన స్పీకర్‌కు గౌరవం ఇవ్వడం లేదన్న సీతక్క
- సబితను తోసింది ఎవరో విజువల్స్ చూస్తే తెలుస్తుందన్న మంత్రి
- మహిళా పోలీసు అధికారులపై బీఆర్ఎస్ నేతలు దుర్భాషలాడిన దృశ్యాలు రికార్డయ్యాయని వెల్లడి

RNI : APTEL/25/A0108
www.mahinewsindia.com
మహి న్యూస్
epaper: https://epaper.mahinewsindia.com
తెలుగు దినపత్రిక

ప్రతిపక్షాల తప్పుడు ప్రచారాన్ని

సోషల్ మీడియాలో తిప్పికొట్టాలి

అమరావతి : తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో జరుగుతున్న లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో రెండో రోజు, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ నేతలను ఉద్దేశించి కీలక ప్రసంగం చేశారు. 'పొలిటికల్ కమ్యూనికేషన్ అండ్ పబ్లిక్ ఓరియంటేషన్' అనే అంశంపై మాట్లాడుతూ, ఆయన నేరుగా సభికులను "మీలో ఎంతమంది సోషల్ మీడియాను చురుకుగా వినియోగిస్తున్నారు?" అని ప్రశ్నించారు. ఈ ప్రశ్నతోనే సాంకేతికతను రాజకీయ ప్రచారానికి వాడుకోవాల్సిన అవశ్యకతను ఆయన నొక్కిచెప్పారు. "సోషల్ మీడియానే కదా అని తేలిగ్గా తీసుకోవద్దు. దీనిపై చాలా సీరియస్‌గా ఉండాలి" అని లోకేశ్ నేతలకు స్పష్టం చేశారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సామాజిక మాధ్యమాల ద్వారా ప్రజలకు ఎప్పటికప్పుడు చేరవేయాలని ఆయన సూచించారు. చిన్న స్థాయి నాయకులైన ఏఎంసీ, కార్పొరేషన్ చైర్మన్లు కూడా తాము చేస్తున్న పనులను సోషల్ మీడియా ద్వారా ప్రజలకు వివరిస్తున్నారని గుర్తుచేశారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీని ఆయన ఉదాహరణగా చూపారు. ప్రధాని మోదీ సైతం తన సందేశాలను సెల్ఫీ వీడియోల ద్వారా ప్రజలకు చేరవేస్తున్నారని లోకేశ్ పేర్కొన్నారు. తాను కూడా సుజ్లాన్ విండ్ ప్రాజెక్టు శంకుస్థాపన, డీఎస్సీపై జరుగుతున్న దుష్ప్రచారం వంటి అంశాలపై సెల్ఫీ వీడియోలు తీసి వాస్తవాలను ప్రజల ముందు ఉంచానని తెలిపారు. విషయం చిన్నదైనా, పెద్దదైనా ప్రజలకు నిజాలు తెలియజేయాల్సిన బాధ్యత నేతలపై ఉందని అన్నారు. ప్రతిపక్షాల తీరుపై లోకేశ్ తీవ్రంగా స్పందించారు. ప్రతిపక్షం పని కేవలం ప్రభుత్వంపై బురదజల్లడమేనని, వారి దుష్ప్రచారాన్ని సోషల్ మీడియా వేదికగా ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. వైసీపీ నేతలు, కార్యకర్తలు తమ నాయకుడు 'జగన్ మావిగన్' అంటే గుడ్డిగా సమర్థిస్తున్నారని, కానీ టీడీపీ అలా కాకుండా వాస్తవాలతో ప్రజల్లోకి వెళ్లాలని చెప్పారు. అమరావతిని అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేస్తున్నామని, ఈ విషయాన్ని ప్రజల్లోకి మరింత బలంగా తీసుకెళ్లాలని ఆయన దిశానిర్దేశం చేశారు.

వచ్చే ఏడాదే బుల్లెట్ రైలు పరుగులు..

రైల్వే మంత్రి కీలక ప్రకటన

ఢిల్లీ: భారత్ సొంతంగా అభివృద్ధి చేస్తున్న తొలి బుల్లెట్ రైలు త్వరలో పట్టాలెక్కనుంది. వచ్చే ఏడాది మే లేదా జూన్‌లో ఈ రైలు ట్రయల్ రన్స్ ప్రారంభమవుతాయని కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. పరీక్షలు పూర్తైన రెండు నుంచి నాలుగు నెలల్లో వాణిజ్య సేవలు ప్రారంభించే అవకాశం ఉందన్నారు. వడోదరలో నిర్వహించిన 'నమో ఫర్ వికసిత్ భారత్' కార్యక్రమంలో మంత్రి ఈ వివరాలు వెల్లడించారు. దేశీయంగా తయారవుతున్న హైస్పీడ్ రైలు తొలి బాడీ ఫ్రేమ్ ఇటీవలే పూర్తయిందని చెప్పారు. ప్రస్తుతం దానిపై స్వీజ్ టెస్టింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. "వచ్చే ఏడాది మే లేదా జూన్ నాటికి మన సొంత బుల్లెట్ రైలు ట్రయల్స్ కోసం పట్టాలపైకి వస్తుంది. రెండు నుంచి నాలుగు నెలల పరీక్షల తర్వాత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ రైలును ప్రారంభిస్తారు" అని వైష్ణవ్ చెప్పారు. ముంబై-అహ్మదాబాద్ బుల్లెట్ రైలు కారిడార్ పనులు వేగంగా సాగుతున్నాయని తెలిపారు. సూరత్-వాపి మార్గం ఈ ఏడాది డిసెంబరు నాటికి పూర్తయ్యే అవకాశం ఉందన్నారు. ఈ రైలు అందుబాటులోకి వస్తే వడోదర నుంచి ముంబైకి ప్రయాణ సమయం కేవలం గంటన్నర మాత్రమే ఉంటుందని చెప్పారు. ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యానికి అనుగుణంగా దేశీయ బుల్లెట్ రైలు ప్రాజెక్టును అభివృద్ధి చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. రైల్వే రంగంలో ఆపరేటింగ్, రిజర్వేషన్ వ్యవస్థలతో పాటు నిర్మాణ విధానాలను ఆధునికీకరిస్తున్నామని చెప్పారు. దేశవ్యాప్తంగా 280 రైల్వే స్టేషన్లను పునరాభివృద్ధి చేసినట్లు వైష్ణవ్ తెలిపారు. కొత్తగా 36 వేల కిలోమీటర్ల రైల్వే ట్రాక్‌లు వేశామని చెప్పారు. వందే భారత్ సాంకేతికతతో కార్గో రైళ్లను కూడా అభివృద్ధి చేస్తున్నట్లు వెల్లడించారు. చినాబ్ వంతెన, మిజోరాంను జాతీయ రైల్వే నెట్‌వర్క్‌తో అనుసంధానించే ప్రాజెక్టు వంటి దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తయ్యాయని తెలిపారు. కొవిడ్ సవాళ్లు ఉన్నప్పటికీ రైల్వే మౌలిక వసతుల అభివృద్ధి వేగం పెరిగిందన్నారు.

'కేసీఆర్‌ను చంపే కుట్ర జరుగుతోంది'..

కేటీఆర్ సంచలన ఆరోపణలు

హైదరాబాద్: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై కాంగ్రెస్ శ్రేణులు కుట్రపూరితంగా హత్యాయత్నం చేశాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన ఆరోపణలు చేశారు. ఎర్రవల్లి ఫాంహౌస్ ముట్టడి పేరుతో కాంగ్రెస్ శ్రేణులు అరాచకానికి పాల్పడ్డాయని మండిపడ్డారు. ఫాంహౌస్‌కు వెళుతున్న తమను అరెస్ట్ చేసి బోయిన్‌పల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించిన సందర్భంగా కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. కేసీఆర్ నివాస ప్రాంగణం వరకు కాంగ్రెస్ కార్యకర్తలను పోలీసులు ఎలా అనుమతించారని కేటీఆర్ ప్రశ్నించారు. తమ సొంత ఇంటికి తాము వెళుతుంటే పోలీసులు ఎందుకు అడ్డుకుంటున్నారో డీజీపీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ శ్రేణుల దాడులను పట్టించుకోకుండా బీఆర్ఎస్ నేతలను మాత్రమే పోలీసులు లక్ష్యంగా చేసుకుంటున్నారని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోందని కేటీఆర్ విమర్శించారు. ప్రజల దృష్టిని ప్రభుత్వ వైఫల్యాల నుంచి మళ్లించేందుకే డైవర్షన్ రాజకీయాలకు తెరలేపారని అన్నారు. "డైవర్షన్, డిస్ట్రక్షన్, డిస్ట్రాక్షన్ తప్ప రేవంత్‌రెడ్డికి మరో విద్య తెలియదు" అని వ్యాఖ్యానించారు. అసెంబ్లీ సమావేశాల సమయాన్ని ప్రజా సమస్యలపై ఉపయోగించాలని కేటీఆర్ సూచించారు. కేసీఆర్, బీఆర్ఎస్ నేతలను విమర్శించేందుకు సభను ఉపయోగించుకోవడం సరికాదన్నారు. ఇందుకోసం ఒక రోజు కేటాయించి.. మిగిలిన రోజుల్లో ప్రజా సమస్యలపై చర్చించాలని డిమాండ్ చేశారు. దళితులపై ప్రభుత్వానికి నిజమైన ప్రేమ ఉంటే దళిత, గిరిజన డిక్లరేషన్ హామీలను వెంటనే అమలు చేయాలని కేటీఆర్ కోరారు. దళితబంధు కింద ఒక్కొక్కరికి రూ.12 లక్షలు ఇస్తామని చెప్పి.. కనీసం రూ.12 పైసలు కూడా ఇవ్వలేదని ఎద్దేవా చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రజలే అంతిమ నిర్ణేతలని.. సరైన సమయం వచ్చినప్పుడు ఈ ప్రభుత్వానికి ప్రజలే సమాధానం చెబుతారని కేటీఆర్ అన్నారు.

నా వడోదరా అద్భుతం.. ప్రధాని మోదీ భావోద్వేగం

ఢిల్లీ: గుజరాత్‌లోని వడోదరా నగరవాసులపై ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసల వర్షం కురిపించారు. తన పర్యటనకు స్వాగతంగా ప్రజలందరూ ఏకమై నగరాన్ని శుభ్రం చేయడానికి చేపట్టిన 'స్వచ్ఛతతో స్వాగతం' కార్యక్రమాన్ని చూసి తన హృదయం గర్వంతో ఉప్పొంగిపోయిందని ఆయన అన్నారు. నేడు మహారాజా సయాజీరావ్ యూనివర్సిటీలో జరిగిన 'నమో 4 వికసిత్ భారత్' కార్యక్రమంలో ప్రధాని మోదీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ.. "నిన్న నేను ఒక వీడియో చూశాను. నా వడోదరాను చూసి నా ఛాతీ గర్వంతో ఉప్పొంగిపోయింది. అద్భుతం!" అంటూ నగర ప్రజల భాగస్వామ్యాన్ని కొనియాడారు. తన పర్యటనకు ముందు నగరం మొత్తం ఒక ప్రజా ఉద్యమంలా మారి శుభ్రత కార్యక్రమాలు చేపట్టడంపై ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం వడోదరాలోని ప్రతి కుటుంబంలో స్వచ్ఛతపై సరికొత్త వాతావరణాన్ని సృష్టించిందని పేర్కొన్నారు. ఈ స్వచ్ఛతా స్ఫూర్తిని రాబోయే పండుగలైన గణేశ్ చతుర్థి, నవరాత్రి, దీపావళి వరకు కొనసాగించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. "ఈసారి గణపతి వచ్చినప్పుడు, ఆయన ఆశీస్సులన్నీ వడోదరాపైనే కురుస్తాయని నేను భావిస్తున్నాను" అని ఆయన వ్యాఖ్యానించారు. ఈ పరిశుభ్రతా కార్యక్రమాన్ని కేవలం తాత్కాలికంగా కాకుండా, శాశ్వత పౌర నిబద్ధతగా మార్చుకోవాలని సూచించారు. "ఇప్పుడు మనం ఒక సంకల్పం తీసుకుందాం. వడోదరాను మళ్లీ అపరిశుభ్రంగా మారకుండా చూసుకుందాం" అని గుజరాతీలో ప్రజలను కోరారు. ప్రధాని మోదీ తన పర్యటనలో భాగంగా రూ.35,000 కోట్లకు పైగా విలువైన అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఇందులో వెస్టర్న్ డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్ (డబ్ల్యూడీఎఫ్‌సీ), కొత్త రైల్వే సేవలు, జాతీయ రహదారుల ప్రాజెక్టులు, గృహ నిర్మాణం, నీటి సరఫరా వంటివి ఉన్నాయి. వడోదరా మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ స్వచ్ఛతా కార్యక్రమంలో పారిశుద్ధ్య కార్మికులు, పౌరులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యాసంస్థలు, ఎన్జీవోలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ మాట్లాడుతూ.. ఈ కార్యక్రమంలో భాగంగా 20 లక్షల మొక్కలను పంపిణీ చేసినట్లు తెలిపారు. కాగా, మోదీ కార్యక్రమానికి 'బుక్‌మైషో' ద్వారా ఉచిత రిజిస్ట్రేషన్లు నిర్వహించగా, గంటలోనే అందుబాటులో ఉన్న సీట్లన్నీ నిండిపోవడం, మరో 42,000 మందికి పైగా వెయిటింగ్ లిస్ట్‌లో ఉండటం విశేషం.

ఇండోనేషియాలో బద్దలైన అగ్నిపర్వతం..

ఢిల్లీ: ఇండోనేషియాలోని సుప్రసిద్ధ అనక్ క్రాకటోవా అగ్నిపర్వతం బద్దలవడం తెలిసిందే. సుమారు 25 గంటల పాటు నిరంతరాయంగా లావా, బూడిద వెదజల్లడంతో ఆ ప్రాంతంలో తీవ్ర భయాందోళనలు నెలకొన్నాయి. ఈ విస్ఫోటనం కారణంగా ఆకాశమంతా దట్టమైన బూడిద మేఘాలు అలుముకోవడంతో రవాణా వ్యవస్థ, ముఖ్యంగా విమాన సర్వీసులు పూర్తిగా స్తంభించిపోయాయి. ఈ అగ్నిపర్వతం 24 గంటల పాటు ఏకధాటిగా లావాను వెలిగక్కింది. ఈ విస్ఫోటానికి సంబంధించిన దృశ్యాలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఆకాశంలో దట్టమైన బూడిద వ్యాపించడంతో ముందుజాగ్రత్త చర్యగా జకార్తాలోని సోకర్నో-హట్టా, హలిమ్ పెర్దనకుసుమ అంతర్జాతీయ విమానాశ్రయాలతో సహా మొత్తం 8 ఎయిర్‌పోర్టులను తాత్కాలికంగా మూసివేశారు. ఈ నిర్ణయంతో సుమారు 2,300 విమాన సర్వీసులు రద్దు లేదా దారి మళ్లించారు. దీనివల్ల దాదాపు 2.70 లక్షల మంది ప్రయాణికులు విమానాశ్రయాల్లోనే చిక్కుకుపోయారు. ఇండోనేషియా జియోలాజికల్ ఏజెన్సీ లెవెల్-3 (హై అలర్ట్) హెచ్చరికను జారీ చేసింది. స్థానికంగా పాఠశాలలకు సెలవులు ప్రకటించారు. రాబోయే రోజుల్లో మరిన్ని విస్ఫోటనాలు సంభవించే అవకాశం ఉందని అధికారులు హెచ్చరిస్తున్నారు. అయితే, ఈ విస్ఫోటనం వల్ల సునామీ ప్రమాదం ఏమీ లేదని అధికారులు స్పష్టం చేయడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. 2018లో ఇదే అగ్నిపర్వతం బద్దలైనప్పుడు సంభవించిన సునామీ కారణంగా సుమారు 430 మంది మరణించిన విషయం తెలిసిందే. ప్రస్తుతానికి బూడిద, విష వాయువులు, వేడి రాళ్ల ముప్పు మాత్రమే ఉందని తెలిపారు. పరిస్థితి వేగంగా మారుతున్నందున విమానాశ్రయాల పునఃప్రారంభంపై ఇప్పుడే స్పష్టత ఇవ్వలేమని రవాణా శాఖ మంత్రి దుదీ పుర్వగంధీ పేర్కొన్నారు. ప్రయాణికులు ఎప్పటికప్పుడు తమ విమానయాన సంస్థలను సంప్రదించాలని సూచించారు. పసిఫిక్ 'రింగ్ ఆఫ్ ఫైర్' ప్రాంతంలో ఉండటంతో ఇండోనేషియాలో తరచూ ఇలాంటి ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తుంటాయి.

వాట్సప్ గవర్నెన్స్, డిజిటల్ సేవలు.. పాలనలో బెస్ట్ ప్రాక్టీసెస్ పాటించాలి

అమరావతి: ప్రభుత్వ, పరిపాలన సేవలను ప్రజలకు మరింత సమర్థంగా అందించడంపై దృష్టి సారించాలని టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి చంద్రబాబు పార్టీ ఎమ్మెల్యేలు, నేతలకు పిలుపునిచ్చారు. రెండోరోజు లీడర్‌షిప్ కాన్క్లేవ్‌లో ప్రసంగించిన ఆయన, కొన్ని నియోజకవర్గాలు పౌర సేవల్లో మంచి ఫలితాలు సాధిస్తున్నాయని, అన్ని నియోజకవర్గాలు ఆ ఉత్తమ పద్ధతులను (బెస్ట్ ప్రాక్టీసెస్) అమలు చేయాలని దిశానిర్దేశం చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ఉచిత ఇసుక విధానాన్ని పక్కాగా అమలు చేస్తున్నామని, దీనివల్ల ఏటా రూ.1000 కోట్ల ఆదాయం వదులుకుంటున్నామని చంద్రబాబు గుర్తుచేశారు. ఎక్కడైనా ఇసుక అక్రమంగా ఇతర రాష్ట్రాలకు తరలిపోతే కఠినంగా అడ్డుకోవాలని ఆదేశించారు. గత ప్రభుత్వ హయాంలో మద్యం విధానాన్ని అస్తవ్యస్తం చేసి, నకిలీ బ్రాండ్లతో ప్రజల ప్రాణాలతో చెలగాటమాడారని విమర్శించారు. ఇప్పుడు మద్యం విక్రయాల్లో పారదర్శకత తీసుకొచ్చామని, ఎమ్మార్పీ కంటే ఒక్క రూపాయి ఎక్కువకు విక్రయించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ విషయంలో అవకతవకలు జరగకుండా చూసుకోవాల్సిన బాధ్యత స్థానిక ఎమ్మెల్యేలదేనని స్పష్టం చేశారు.

ఫేక్ ప్రచారాన్ని వాస్తవాలతో తిప్పికొట్టండి..
ప్రభుత్వంపై జరుగుతున్న ఫేక్ ప్రచారాలను వాస్తవాలతో సమర్థంగా తిప్పికొట్టాలని నేతలకు సూచించారు. వాట్సప్ గవర్నెన్స్ ద్వారా అనేక సేవలను అన్‌లైన్‌లోనే అందిస్తున్నామని, క్యూఆర్ కోడ్, బ్లాక్ చెయిన్ టెక్నాలజీతో భద్రమైన పట్టాదారు పాస్ పుస్తకాలను జారీ చేస్తున్నామని వివరించారు. నియోజకవర్గాల్లోని దీర్ఘకాలిక సమస్యలను సుమోటోగా స్వీకరించి పరిష్కరించాలని, తద్వారా ఎమ్మెల్యేలకు ప్రజల్లో మంచి పేరు వస్తుందని అన్నారు. ప్రజల సమస్యల పట్ల మానవత్వంతో స్పందిస్తే సానుకూల దృక్పథం ఏర్పడుతుందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా భూ వివాదాల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తున్నామని, 2027 మార్చి నాటికి భూ రికార్డుల ప్రక్షాళన పూర్తి చేస్తామని చంద్రబాబు వెల్లడించారు. 'సంజీవని' ప్రాజెక్టు ద్వారా డిజిటల్ హెల్త్ రికార్డులు రూపొందిస్తున్నామని, గత మూడేళ్లుగా విద్యుత్ ఛార్జీలు పెంచలేదని గుర్తుచేశారు. గత సమావేశంలో ఎమ్మెల్యేలు లేవనెత్తిన అంశాలను సమీక్షించి, 175 నియోజకవర్గాల్లో రూ.20,400 కోట్ల విలువైన 616 అభివృద్ధి పనులను మంజూరు చేసినట్లు ఈ సందర్భంగా ఆయన ప్రకటించారు.

తాతా మధు వ్యాఖ్యలపై కేసీఆర్ క్షమాపణ చెప్పి ఆయనతో రాజీనామా చేయించాలి

మొదటి పేజీ తరువాయి

ఇందుకు సభలో ఆమోదం లభించింది.

స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై భారాస ఎమ్మెల్సీ తాతా మధు చేసిన అనుచిత వ్యాఖ్యలపై శాసనసభ మండిపడింది. ఆయన మాటలు సభాపతి స్థానానికే కాక.. మొత్తం అసెంబ్లీకి, నాలుగు కోట్ల మంది ప్రజలకు అవమానకరమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఇది తెలంగాణకు చీకటి రోజని వెల్లడించారు. స్పీకర్ మాతృమూర్తిని అవమానించడం బాధాకరమని మంత్రి సీతక్క ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో భావోద్వేగానికి గురైన స్పీకర్ ప్రసాద్‌కుమార్ కంటతడి పెట్టారు. అధికారపక్షానికి చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలతోపాటు భాజపా, ఎంఐఎం, సీపీఐ సభ్యులు సైతం భారాస ఎమ్మెల్సీ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించి, చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీ మధు స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడంతోపాటు దుర్భాషలాడారని తెలుసుకొన్న కాంగ్రెస్ ఎమ్మెల్యేలు తీవ్రంగా స్పందించారు. అయనపై చర్యలు తీసుకోవాలని కోరుతూ దళిత ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు స్పీకర్‌కు, శాసనమండలి ఛైర్మన్‌కు వినతిపత్రం సమర్పించారు. అనంతరం మధ్యాహ్నం సమయంలో ఈ అంశంపై శాసనసభలో ప్రత్యేకంగా చర్చించారు. మంత్రులు శ్రీధర్‌బాబు, లక్ష్మణ్‌కుమార్, పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, సీతక్కలు మాట్లాడుతూ.. తాతా మధు ఎమ్మెల్సీ సభ్యత్వం రద్దు చేయడంతోపాటు అయనపై ఎస్సీ, ఎస్టీ కేసు పెట్టాలని డిమాండ్ చేశారు. భారాస దళిత వ్యతిరేక పార్టీ అని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ధ్వజమెత్తారు. భాజపా, మజ్లిస్ నేతలు సైతం తాతా మధుతో రాజీనామా చేయించాలని కోరారు.

ఇది క్షమించరాని నేరం: సీఎం

స్వతంత్ర భారతంలో ఒక సభాపతికి ఇలాంటి అవమానం ఎప్పుడూ జరగలేదని, ఇంత అభ్యంతరకర భాషను వాడటం ఎప్పుడూ చూడలేదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ.. 'ఇలాంటి వ్యాఖ్యలను క్షమిస్తే చట్టసభలకు గౌరవం, మర్యాద ఉండవు. సభా సంప్రదాయాలను కాపాడాల్సిన బాధ్యత మనపై ఉంది. సభలో ముఖ్యమంత్రైనా, శాసనసభ్యుడైనా స్పీకర్‌కు ఒకటే. అలాంటి వ్యక్తి మనసు గాయపడేలా భారాస వ్యవహరించింది. ఈ ఘటన గడ్డం ప్రసాద్‌కుమార్ ఒక్కరికే సంబంధించినది కాదు. మొత్తం సభ్య సమాజానికే జరిగిన అవమానంగా భావించాలి. స్పీకర్ పదవి ఒక అత్యున్నత స్థానం. సభాపతిని గౌరవించడం మన సంప్రదాయం. అలాంటి స్థానంలో ఉన్న వ్యక్తిపైనా, అయన కుటుంబసభ్యులపైనా సభ్య సమాజం తలదించుకునేలా కొంతమంది మాట్లాడారు. నేను జడ్పీటీసీగా, ఎమ్మెల్సీగా, ఎమ్మెల్యేగా, ఎంపీగా అన్ని సభలనూ చూశాను. కానీ, ఇంత అభ్యంతరకర భాషను వాడటం ఎప్పుడూ చూడలేదు. ఇది అనాలోచితంగా జరిగిన చర్య కాదు. కేసీఆర్ తన ఎమ్మెల్యేలను నిన్న పిలిపించుకుని స్పీకర్‌పై పథకం ప్రకారమే ఉసిగొల్పారు. తెలంగాణ వస్తే దళితుడిని సీఎం చేస్తానని, మూడెకరాల చొప్పున ఇస్తానని, దళితబంధు ఇస్తామని నమ్మించి.. దళిత ఉపముఖ్యమంత్రిని బర్తరఫ్ చేశారు. నేరెళ్లలో ఇసుక అక్రమ రవాణాను అడ్డుకున్న దళితులను లారీలతో తొక్కించి చంపారు. ఒక దళితుడిని కాంగ్రెస్ సీఎల్పీ నాయకుడిని చేస్తే పార్టీ ఫిరాయింపులు ప్రోత్సహించి, ప్రతిపక్ష హోదా నుంచి తొలగించారు. భారాసది దళిత వ్యతిరేక ఆలోచన, వైఖరిని అందరం ముక్తకంఠంతో ఖండించాలి. ప్రభుత్వం సంయమనం పాటిస్తుంటే చేతకానితనంగా భావిస్తున్నారు. అదిరించి, బెదిరించి వ్యవస్థలను లొంగదీసుకుంటామంటే చూస్తూ ఊరుకోం. తాతా మధు వ్యాఖ్యలపై కేసీఆర్ క్షమాపణ చెప్పి, ఆయనతో రాజీనామా చేయించాలని సభా నాయకుడిగా నేను డిమాండ్ చేస్తున్నా" అని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ చర్చ సమయంలో భాజపా నేతలు 22ఏపై చర్చించాలని పోడియం వద్దకు వచ్చి నిరసన తెలిపారు. అనంతరం వారు అక్కడే బైఠాయించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. అత్యంత అవమానకరంగా స్పీకర్‌నుద్దేశించి మాట్లాడితే.. చర్చకు ఇంతకంటే ప్రాధాన్యమున్న అంశం ఏముంటుందని ప్రశ్నించారు. భారాస వేసిన అపవాదు, దుర్మార్గాలను భాజపా ఎందుకు కాపాడుతోందని నిలదీశారు. భారాస ఎమ్మెల్సీ తాతా మధును భాజపా సమర్థిస్తోందా అని ప్రశ్నించారు. అందరం ముక్తకంఠంతో ఖండించాల్సిన సమయమని, రాజకీయాలకు అతీతంగా వ్యవహరించి ఇలాంటి దుర్మార్గపు పోకడలను నియంత్రించాలని సూచించారు.

నా కొడుకుని చూసి చాలా గర్విస్తున్నా

సీఎం విజయ్ తండ్రి చంద్రశేఖర్

తమిళనాడు: తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ చుట్టూ తిరుగుతున్న రాజకీయ, వ్యక్తిగత వివాదాల వేళ విజయ్ తండ్రి, సీనియర్ దర్శకుడు ఎస్.ఏ. చంద్రశేఖర్ చేసిన తాజా వ్యాఖ్యలు సినీ, రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. ఇటీవల జరిగిన పలు రాజకీయ పరిణామాలు, అసెంబ్లీ వ్యాఖ్యల అనంతరం మాట్లాడిన ఆయన... తన కొడుకుని చూసి తాను ఎంతో గర్వపడుతున్నాను అంటూ కుమారుడికి పూర్తి మద్దతుగా సంచలన ప్రకటన చేశారు. గతంలో విజయ్‌తో ఉన్న విభేదాలు, వ్యక్తిగత వివాదాల వల్ల దూరంగా ఉంటున్నారనే ప్రచారానికి చెక్ పెడుతూ, ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో ఆయన విజయ్ వైఖరిని గట్టిగా సమర్థించారు. మహిళల గౌరవం, రాజకీయ మర్యాదలపై సభలో విజయ్ తీసుకున్న స్పష్టమైన నిర్ణయాలు, ప్రతిపక్ష విమర్శలను తిప్పికొట్టిన తీరు పట్ల ఒక తండ్రిగా తనకు ఎంతో సంతోషాన్ని ఇచ్చాయని పేర్కొన్నారు. తమ కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకుని ప్రత్యర్థి పార్టీలు చేస్తున్న నవకబారు ఆరోపణలను ప్రజలు నమ్మరని, కొడుకు విజయాన్ని, పట్టుదలను చూసి గర్విస్తున్నానని ఎస్.ఏ. చంద్రశేఖర్ స్పష్టం చేశారు. తండ్రి నుంచి వచ్చిన ఈ బహిరంగ మద్దతుతో టీవీకే వర్గాలు, విజయ్ అభిమానుల్లో సరికొత్త ఉత్సాహం నిండింది.

మహిళల ముందు హరీశ్ రావు బట్టలు విప్పుతారా?

హైదరాబాద్: శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు అత్యంత హేయమైన, అనుచిత వ్యాఖ్యలు చేసి, ఇప్పుడు ఏమీ ఎరుగనట్లు తప్పించుకోవాలని చూస్తున్నారని పంచాయతీరాజ్, మహిళా సంక్షేమ శాఖ మంత్రి సీతక్క తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అసెంబ్లీలో ఆమె మాట్లాడుతూ... బీఆర్ఎస్ నేతల తీరును ఎండగడుతూ తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. "సభలో దళిత వర్గానికి చెందిన స్పీకర్ స్థానానికి గౌరవం ఇవ్వకపోగా, గతంలో ఎప్పుడో మరణించిన అయన మాతృమూర్తిని ఉద్దేశించి అంత నికృష్టమైన భాష మాట్లాడటం ఏ రకమైన సంస్కారం?" అని నిలదీస్తూ కంటతడి పెట్టారు. సీతక్క ఆవేదన చూసి స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ కూడా సభలోనే కన్నీళ్లు పెట్టుకోవడంతో వాతావరణం అత్యంత గంభీరంగా మారింది. సభలో ప్రతిపక్ష నేతల తీరుపై మండిపడ్డ సీతక్క.. "సవితా ఇంద్రారెడ్డిని నిజంగా తోసింది ఎవరో విజువల్స్ చూస్తే తెలుస్తుంది. మహిళా ఎమ్మెల్యేలను ముందు పెట్టుకుని రావడం ఏంటి? హరీశ్ రావు మహిళల ముందు బట్టలు విప్పుతారా?" అని సంచలన వ్యాఖ్యలు చేశారు. "మహిళా ప్రజాప్రతినిధులను సురక్షిత ప్రాంతానికి పంపి, ఆ తర్వాత పురుష నేతలు నిరసనకు రావడం పద్ధతి. కానీ మహిళలను అడ్డుగా పెట్టుకుని రాజకీయం చేయడం దారుణం" అని ఆగ్రహం వ్యక్తం చేశారు. విధుల్లో ఉన్న మహిళా పోలీస్ అధికారులపై బీఆర్ఎస్ నేతలు చేయిచేసుకుని, దుర్భాషలాడిన దృశ్యాలు రికార్డయ్యాయని, చట్టాన్ని ఉల్లంఘించి పోలీసులను కొట్టిన ఎమ్మెల్యేలపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చట్టసభలు దేవాలయం లాంటివని, బీఆర్ఎస్ మహిళా నేతలు ఈ విషయంలో ఆత్మపరిశీలన చేసుకోవాలని హితవు పలికారు. "సొంత చెల్లెలు కవితను పార్టీ నుంచి బహిష్కరించినప్పుడు లేని బాధ, హరీశ్ రావును ఏదైనా అంటే ఎందుకు వస్తోంది?" అని సీతక్క బీఆర్ఎస్ నేతలను సూటిగా ప్రశ్నించారు.

ఇరాన్‌తో యుద్ధంలో గెలిస్తే గ్యాలన్ పెట్రోల్ 2 డాలర్లకే



ఢిల్లీ: ఇరాన్‌తో జరుగుతున్న యుద్ధంలో అమెరికా గెలిస్తే చమురు ధరలు భారీగా పడిపోతాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేశారు. గ్యాసోలిన్ ధర గ్యాలన్‌కు 2 డాలర్ల కంటే తక్కువకు చేరుకుంటుందని ఆయన జోస్యం చెప్పారు. తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ట్రూత్ సోషల్' వేదికగా ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. "ఇరాన్‌తో యుద్ధంలో మనం గెలిచినప్పుడు, మిగతావన్నీ పడిపోతున్నట్లే చమురు ధరలు కూడా వేగంగా పడిపోతాయి. మొదట గ్యాలన్ ధర మూడు డాలర్లకు, ఆ తర్వాత రెండు డాలర్ల కంటే తక్కువకు చేరుకుంటుంది. ఇదంతా చాలా వేగంగా జరిగిపోతుంది. ఇరాన్ ఎప్పటికీ అణ్వాయుధాన్ని తయారు చేయలేదు. మేక్ అమెరికా గ్రేట్ అగైన్ (ఎంఏజీఏ)!" అని ట్రంప్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. ప్రస్తుతం అమెరికాలో గ్యాసోలిన్ సగటు ధర గ్యాలన

RNI : APTEL/25/A0108
మహా న్యూస్
www.mahinewsindia.com
epaper: https://epaper.mahinewsindia.com
తెలుగు దినపత్రిక

స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ
పరిగిలో కాంగ్రెస్ నిరసన
తాతా మధు సభ్యత్వాన్ని వెంటనే రద్దు చేయాలి !

పరిగి మున్సిపల్ చైర్పర్సన్ కుడుముల రజిత వెంకటేష్, పిఎసిఎస్ వైస్ చైర్మన్ బద్రి గారి రాజ పుల్లారెడ్డి,జిల్లా ప్రధాన కార్యదర్శి (నస్కల్) దండు అశోక్, పరిగి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సయ్యద్ అయూబ్, మున్సిపల్ వైస్ చైర్మన్ కమల్ హనుమంతు, మండల పార్టీ అధ్యక్షుడు జి వెంకట్ రాములు, పరిగి పట్టణ అధ్యక్షుడు గుండెల రామకృష్ణారెడ్డి, పాలాది శ్రీనివాస్ గుప్తా, కార్యకర్తలతో కలిసి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు

వికారాబాద్ జిల్లా పరిగి (మహి న్యూస్): గౌరవ స్పీకర్ శ్రీ గడ్డం ప్రసాద్ కుమార్ పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ, అయన శాసనమండలి సభ్యత్వాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ పరిగి పట్టణ, మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ, గౌరవ స్పీకర్ పై, అయన కుటుంబ సభ్యులపై అనుచిత వ్యాఖ్యలు చేయడం అత్యంత ఆక్షేపణీయమని అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో కీలకమైన రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్న స్పీకర్ గౌరవాన్ని కించపరిచేలా మాట్లాడటాన్ని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందని తెలిపారు. ప్రజాస్వామ్య విలువలు, రాజ్యాంగ స్ఫూర్తి, ప్రజాప్రతినిధుల గౌరవాన్ని ప్రతి ఒక్కరూ కాపాడాల్సిన బాధ్యత ఉందని అన్నారు. ఇలాంటి అనుచిత వ్యాఖ్యలను ప్రోత్సహించడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదని పేర్కొన్నారు. తాతా మధు తన అనుచిత వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకుని గౌరవ స్పీకర్ శ్రీ గడ్డం ప్రసాద్ కుమార్కి బహిరంగంగా క్షమాపణలు చెప్పాలని, అయన శాసనమండలి సభ్యత్వాన్ని రద్దు చేయాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పరిగి పట్టణ, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు పిఎసిఎస్ డైరెక్టర్ చిన్న నర్సింలు, ఇందిరమ్మ గ్రామ కమిటీ అధ్యక్షుడు నస్కల్ శ్రీధర్, రాపోల్ వెంకట్, రంగంపల్లి సత్యనారాయణ, ఎర్రగడ్డ పల్లి కృష్ణ, కార్యకర్తలు, యువజన కాంగ్రెస్ నాయకులు, మహిళా కాంగ్రెస్ నాయకులు, పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

స్పీకర్ గారికి వెంటనే క్షమాపణలు చెప్పాలి..
బిఆర్ఎస్ పార్టీ వారి అనుచిత వ్యాఖ్యలను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తుంది..
స్పీకర్ తల్లిని దూషించడం అత్యంత ఆక్షేపణీయం: అసెంబ్లీలో పరిగి ఎమ్మెల్యే,టీపీసీసీ ట్రైనింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి

వికారాబాద్ జిల్లా పరిగి (మహి న్యూస్): శాసనసభ చరిత్రలోనే ఇలాంటి ప్రవర్తన ఎప్పుడూ చూడలేదు.స్పీకర్ స్థానాన్ని అవమానించడం అంటే ప్రజాస్వామ్య వ్యవస్థనే అవమానించినట్లేనని పరిగి ఎమ్మెల్యే,టీపీసీసీ ట్రైనింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ టి. రామ్మోహన్ రెడ్డి అన్నారు. అసెంబ్లీలో మాట్లాడుతూ, స్పీకర్ తల్లిని దూషిస్తూ మాట్లాడటం అత్యంత ఆక్షేపణీయమని అయన తీవ్రంగా ఖండించారు.బీఆర్ఎస్ పార్టీ దళితులను అడుగడుగునా అవమానించే ధోరణిని అవలంబిస్తోందని విమర్శించారు. అలాగే, భట్టి విక్రమార్క ప్రధాన ప్రతిపక్ష నేతగా కొనసాగడాన్ని ఓర్చుకోలేక బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను కొనుగోలు చేసి ఆ హోదాను లేకుండా చేసిందని ఆరోపించారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ప్రజాప్రతినిధిపై ఉందని, శాసనసభ గౌరవాన్ని కించపరిచే చర్యలు ఎట్టి పరిస్థితుల్లోనూ సమర్థనీయం కాదని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

తాతా మధును సస్పెండ్ చేయాలని
కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన
- మండల పార్టీ అధ్యక్షుడు చంద్రశేఖర్

వికారాబాద్ జిల్లా పరిగి మహి న్యూస్: మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద, తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పై తాతా మధు చేసినట్లు పేర్కొంటున్న అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా చౌడాపూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎం. చంద్రశేఖర్ మాట్లాడుతూ, రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న అసెంబ్లీ స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని, ప్రజాస్వామ్య విలువలు రాజ్యాంగ సంస్థల గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ప్రజాప్రతినిధిపై ఉందని అన్నారు. తాతా మధు చేసిన వ్యాఖ్యలపై పార్టీ అధిష్ఠానం తక్షణమే స్పందించి, ఆయనను ఎమ్మెల్సీ పదవి నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో వైస్ చైర్మన్ ఎలపాటి అశోక్ కుమార్,మండల ప్రధాన కార్యదర్శి రాము.చౌడాపూర్ సర్పంచ్లు. నర్సిహ్మ నాయక్ నవీన్ కుమార్.మధు.రవి, చెన్నయ్య.తుకారాం. శ్రీను., అలాగే కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్, బీసీ సెల్, సెల్ మైనార్టీ సెల్. అధ్యక్షులు.మన్యం. లాలు. నర్సిములు. ఇలియాస్. డైరెక్టర్స్. దామోదర్ రెడ్డి.వెంకటయ్య. చెన్నయ్య.మండల కాంగ్రెస్ నాయకులు,.సలీమ్.రాములు.గోపాల్.కృష్ణ రెడ్డి.ఆంజనేయులు రమేష్. బుచ్చయ్య. మాణికుమార్. మల్లేష్. రాజు. యాదయ్య కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆకస్మికంగా మైనార్టీ బాలికల పాఠశాలను పరిశీలించిన
- జిల్లా కలెక్టర్ దీపక్ తివారి

వికారాబాద్ జిల్లా పరిగి (మహి న్యూస్):: ఉన్నత లక్ష్యాలతో మంచి భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ విద్యార్థినిలకు సూచించారు. మంగళవారం వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని శివారెడ్డిపేట మైనార్టీ బాలికల గురుకుల పాఠశాల, రామయ్య గూడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో పదవ తరగతి సాంఘిక శాస్త్రం బోధిస్తున్న తరగతిని సందర్శించిన జిల్లా కలెక్టర్ ప్రాథమిక హక్కులు, విధులపై విద్యార్థినీలను అడిగి సమాధానము రాబట్టారు. విద్య ద్వారానే ఉజ్వల భవిష్యత్తును తీర్చిదిద్దుకోవచ్చని ఆదిశగా విద్య పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి విద్యనభ్యసించాలని కలెక్టర్ సూచించారు. ప్రతి ఒక్కరికి లక్ష్యం అనేది గొప్పగా ఉండాలని కలెక్టర్ తెలిపారు. విద్యతో పాటు శారీరక దృఢత్వాన్ని పెంచుకునే విధంగా వ్యాయామం చేపట్టాలని కలెక్టర్ తెలిపారు. ఆరోగ్యకరమైన శరీరంతో పాటు మానసిక ఆరోగ్యం కూడా చాలా అవసరమని అయన అన్నారు. విద్యార్థులకు గత సిలబస్ పై కూడా అప్పుడప్పుడు సమీక్షిస్తూ ఉండాలని కలెక్టర్ ఉపాధ్యాయులకు సూచించారు. ముందుగా భోజనశాల, స్టోర్, వంటగదులను లను సందర్శించి మధ్యాహ్న భోజనానికి సిద్ధం చేసిన వంటకాలను పరిశీలించారు. అనంతరం రామయ్య గూడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించిన క్రమంలో ఆసుపత్రిలో ప్రజలకు నాణ్యమైన వైద్యంతోపాటు మౌలిక సదుపాయాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ వైద్యాధికారులకు సూచించారు. ఆసుపత్రి మరమత్తు పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు అయన సూచించారు. ఆసుపత్రిలో త్రాగునీటి కోసం ఆర్.ఓ ప్లాంట్ ను ఏర్పాటు చేయాలని కలెక్టర్ అధికారులకు తెలిపారు. ఆసుపత్రి స్థలంలో కబ్జాలకు గురికాకుండా ఆవరణ చుట్టు ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ తెలిపారు. జిల్లా కలెక్టర్ పర్యటనలో అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ సచిన్ బస్వరాజ్ గుట్టూరు, జెడ్పి సీఈఓ సుధీర్, డిఎంహెచ్ఓ సుధాకర్ లాల్, తహసిల్దార్ లక్ష్మీనారాయణ, డాక్టర్ సౌమ్యలు ఉన్నారు.

రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అదనపు తరగతి గదుల నిర్మాణానికి భూమిపూజ
పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు రిలయన్స్ చేయూత.
అదనపు తరగతి గదుల ర్మాణానికి భూమిపూజ
సి.క్యాంప్ నగరపాలక ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి. మురళి

కర్నూలు సెప్టెంబర్, 8 (మహి న్యూస్) : ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులను మెరుగుపరిచేందుకు రిలయన్స్ ఫౌండేషన్ ముందుకు వచ్చింది. స్వస్థ కర్నూలు ప్రగతి మార్గం ప్రాజెక్టులో భాగంగా రిలయన్స్ ఫౌండేషన్, రిలయన్స్ కన్స్యూమర్ ప్రొడక్ట్స్ లిమిటెడ్, ఏపీఏఆర్డీ సంయుక్త ఆధ్వర్యంలో నగరంలోని ప్రభుత్వ పాఠశాలల్లో అదనపు తరగతి గదులు, ఇతర వసతుల కల్పనకు భూమిపూజ నిర్వహించారు. నగరంలోని 23వ వార్డులో ఉన్న సి.క్యాంప్ నగరపాలక ఉన్నత పాఠశాలలో నాలుగు అదనపు తరగతి గదుల నిర్మాణానికి, 3వ వార్డులోని బండిమెట్ట శ్రీ పొట్టి శ్రీరాములు నగరపాలక ఉన్నత పాఠశాలలో పది అదనపు తరగతి గదులతో పాటు బాలబాలికలకు మరుగుదొడ్ల నిర్మాణానికి భూమిపూజ చేపట్టారు. విద్యార్థుల సమగ్ర వికాసాన్ని దృష్టిలో ఉంచుకుని పాఠశాలల్లో విజ్ఞాన శాస్త్ర ప్రయోగశాల పరికరాలు, క్రీడా సామగ్రి, చేతులు కడుక్కునే కేంద్రాలను కూడా ఏర్పాటు చేయనున్నట్లు రిలయన్స్ ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా సి.క్యాంప్ నగరపాలక ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి. మురళి మాట్లాడుతూ.. తమ పాఠశాలలో నాలుగు అదనపు తరగతి గదుల నిర్మాణానికి రిలయన్స్ సంస్థలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. ప్రస్తుతం పాఠశాలలో 310 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని, భవిష్యత్తులో విద్యార్థుల సంఖ్య పెరిగే అవకాశం ఉందన్నారు. మొదటి అంతస్తులో నిర్మించనున్న నాలుగు అదనపు గదులు విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. విజ్ఞాన శాస్త్ర పరికరాలు, క్రీడా సామగ్రి, చేతులు కడుక్కునే కేంద్రం వంటి వసతులు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. అన్ని వసతులు అందుబాటులోకి వల్ల విద్యార్థులకు మరింత ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల తరపున రిలయన్స్ ఫౌండేషన్, రిలయన్స్ కన్స్యూమర్ ప్రొడక్ట్స్ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమానికి సహకరించిన మంత్రి టీజీ భరత్ గుప్తా, జిల్లా కలెక్టర్ ఎ. సిరి, జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్. సుధాకర్, ఎంఈఓ అబ్దుల్ రెహమాన్‌తో పాటు ఉన్నతాధికారులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో రిలయన్స్ ప్లాంట్ మేనేజర్ ఎం.వి. కార్తీక్, మానవ వనరుల విభాగం పీఆర్వో స్ఫూర్తి, ఆర్ఓపీఎల్ మేనేజర్ కౌశిక్, తిరుపతి రెడ్డి, ఏపీఏఆర్డీ ప్రతినిధులు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు జి. మురళి, కే. త్యాగరాజు, సీనియర్ ఉపాధ్యాయులు రామశాస్త్రి, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సైంటిఫిక్ ఇన్వెస్టిగేషన్‌లో కర్నూలు రేంజ్ పోలీసుల ప్రతిభ
ఏపీ పోలీస్ డ్యూటీ మీట్‌లో రన్నర్‌అప్ కప్ సాధించిన కర్నూలు రేంజ్ పోలీసులు

కర్నూలు, సెప్టెంబర్ 08: (మహి న్యూస్): గుంటూరులో నిర్వహించిన ఏపీ పోలీస్ డ్యూటీ మీట్‌లో సైంటిఫిక్ ఎయిడ్స్ ఆఫ్ ఇన్వెస్టిగేషన్ అండ్ క్రిమినాలజీ విభాగంలో కర్నూలు రేంజ్ పోలీసులు రన్నర్‌అప్ కప్ సాధించారు. ఈ సందర్భంగా మంగళవారం కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ శ్రీ కోయ ప్రవీణ్ ఐపీఎస్‌ను పోలీసు అధికారులు మర్యాదపూర్వకంగా కలిశారు. రన్నర్‌అప్ కప్ సాధించిన పోలీసు అధికారులను డీఐజీ అభినందించి, వారి ప్రతిభను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో కర్నూలు ట్రాఫిక్ సీఐ మన్సూరుద్దీన్, పులివెందుల ట్రాఫిక్ సీఐ ప్రసాదరావు, కర్నూలు త్రీటౌన్ ఎస్ఐ సామీర్ భాషా, కర్నూలు సీసీఎస్ ఎస్ఐ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మైనర్ డ్రైవింగ్‌పై కర్నూలు ట్రాఫిక్ పోలీసుల ప్రత్యేక చర్యలు
18 మంది మైనర్లకు తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సిలింగ్
నిబంధనలు ఉల్లంఘించిన వారికి జరిమానాలు

కర్నూలు, సెప్టెంబర్ 08: (మహి న్యూస్): కర్నూలు ఎస్పీ శ్రీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ గారి ఆదేశాల మేరకు మంగళవారం కర్నూలు ట్రాఫిక్ పోలీసులు రాజ్‌విహార్ ప్రాంతంలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో మోటార్‌సైకిళ్లను నడుపుతున్న 18 మంది మైనర్లను గుర్తించారు. అనంతరం మైనర్లను కర్నూలు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు పిలిపించి, వారి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సిలింగ్ నిర్వహించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారికి జరిమానాలు (చలాన్లు) విధించారు. మైనర్లకు తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వకుండా బాధ్యతగా వ్యవహరించాలని, మైనర్లు వాహనాలు నడిపితే చట్టప్రకారం చర్యలు తప్పవని కర్నూలు ట్రాఫిక్ సీఐ మన్సూరుద్దీన్ హెచ్చరించారు.మైనర్ డ్రైవింగ్‌ను అరికట్టేందుకు ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక తనిఖీలను కొనసాగిస్తారని తెలిపారు.





ప్రభుత్వ భూములు లంచాలకు అమ్ముడు!

నాయుడుపేట, సెప్టెంబర్ 8, మహి న్యూస్: తిరుపతి జిల్లా నాయుడుపేట పట్టణంలో విలువైన ప్రభుత్వ భూములు స్థానిక రెవెన్యూ అధికారుల చేతుల్లో నుండి అమ్ముడుపోతున్నాయని, లంచాలకు అలవాటు పడిన అధికారులు కొందరికి ఈ భూములను అక్రమంగా ఇచ్చేస్తున్నారని, అందులో ఎక్కువమంది అధికార పార్టీకి చెందిన వ్యక్తులేనని సమాచారం. సుమారు ఐదు సర్వే నంబర్లలో కోట్ల రూపాయల విలువైన రెండు ఎకరాల 40 సెంట్లు వరకు ఉన్న ప్రభుత్వ భూములు రెవెన్యూ రికార్డులను తారుమారు చేసి, కొంతమంది పేర్లు మీద అనుభవంలోకి ఎక్కించినట్లు, ఈ దందాలో రెవెన్యూ అధికారుల ప్రముఖ పాత్ర ఉన్నట్లు తెలుస్తోంది. ఇక సోమవారం రాత్రి జరిగిన మరో ఘటన మరింత చర్చకు దారి తీసింది. నాయుడుపేట ఎస్కెఎల్ఎస్ పెట్రోల్ బంక్ బైపాస్ సమీపంలో ఉన్న ఒక ప్రభుత్వ భూమిలో కొంత భాగాన్ని పెళ్లకూరు మండలానికి చెందిన అధికార పార్టీ కీలక నేతకు కేవలం ఐదు లక్షల రూపాయలకు బేరం పెట్టినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ లావాదేవీలో కూడా రెవెన్యూ అధికారులు ప్రముఖంగా పాల్గొన్నట్లు సమాచారం. ప్రజా అస్తులను లంచాలకు అమ్మి అధికార పార్టీ నాయకులకు అప్పగిస్తున్న ఈ దందా పై విపక్షాలు సైతం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. దీనితో రెవెన్యూ వ్యవస్థలో పారదర్శకత పూర్తిగా దెబ్బతిన్నట్లు తెలుస్తుంది.

ప్రధాని మోదీ పర్యటనకు ముందు కలకలం

ముంబై: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ముంబై పర్యటన సందర్భంగా తీవ్ర కలకలం చెలరేగింది. ప్రధాని పాల్గొనాల్సిన కార్యక్రమంలో ఇద్దరు అగంతకులు చొరబడ్డారు. పీఎంవో అధికారులమంటూ అనుమానాస్పదంగా వ్యవహరించిన ఇద్దరు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి తుపాకితో పాటు ఫేక్ ఐడీ కార్డులను స్వాధీనం చేసుకున్నారు. ముంబైలోని బాంద్రా కుర్లా కాంప్లెక్స్ నీతా ముకేష్ అంబానీ కల్చరల్ సెంటర్ వేదికగా 'గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్ 2026' సదస్సు జరగాల్సి ఉంది. ఈ సదస్సును ప్రారంభించేందుకు ప్రధాని మోదీ రావాల్సి ఉంది. అంతకంటే ముందే రోహన్ పరేఖ్ తాను ప్రధాన మంత్రి కార్యాలయ అధికారినంటూ ఆ ఈవెంట్‌కు వచ్చారు. తనిఖీల్లో భాగంగా అతని వద్ద నకిలీ పీఎంవో ఐడీ కార్డుతో పాటు తుపాకీ లభించడంతో భద్రతా బలగాలు ఒక్కసారిగా అప్రమత్తమయ్యాయి. అతనితో పాటు ఉన్న సెక్యూరిటీ గార్డును కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటన తీవ్రత దృష్ట్యా ముంబై క్రైమ్ బ్రాంచ్ పోలీసులు రంగంలోకి దిగి దర్యాప్తు ముమ్మరం చేశారు. నిందితుల మొబైల్ ఫోన్లు, గుర్తింపు పత్రాలను పరిశీలిస్తున్నారు.తుపాకులతో, నకిలీ ఐడీలతో నేరుగా ప్రధాని మోదీ హాజరు కావాల్సిన కార్యక్రమానికి ఎందుకు వచ్చారనే అంశంపై లోతుగా విచారణ జరుపుతున్నారు. అత్యంత ప్రతిష్టాత్మకమైన వార్షిక ఫిన్‌టెక్ సదస్సులలో ఒకటైన 'గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్ 2026'ను ముంబైలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించనున్నారు. ప్రధాని పర్యటన వేళ జరిగిన ఈ భద్రతా లోపం స్థానికంగా తీవ్ర సంచలనం సృష్టించింది.

'టెట్' లేకుండా టీచర్లను నియమించొద్దు: సుప్రీంకోర్టు

ఢిల్లీ: అర్హత లేని టీచర్లతో విద్యార్థుల భవిష్యత్తు నాశనం అవుతుందని, 'టెట్' లాంటి నిర్దేశిత అర్హతలు లేని ఉపాధ్యాయులను నియమించొద్దని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ధర్మాసనం పేర్కొంది. అర్హత లేని టీచర్ల నియామకంపై స్టే విధిస్తూ సుప్రీంకోర్టు మధ్యంతర ఆదేశాలిచ్చింది. అస్సాం టీచర్ రిక్రూట్‌మెంట్ కేసులో ఈ పరిణామాలు చోటుచేసుకున్నాయి. టీచర్ల రిక్రూట్‌మెంట్‌పై సమీక్ష చేయాలంటూ సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. సరైనటువంటి విద్యార్హతలు లేకుండా టీచర్ల నియామకం చేపట్టడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌లపై సుప్రీంకోర్టు ధర్మాసనం విచారణ చేపట్టింది.

అర్హత లేని టీచర్ల నియామకంపై సుప్రీంకోర్టు స్టే

విద్యాహక్కు చట్టం, ఎన్‌సీటీఈ, యూజీసీ చట్టం కింద నిర్దేశించిన అర్హతలు లేని వారిని పాఠశాలు, కళాశాలల్లో బోధకులుగా నియమించవద్దని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ధర్మాసనం మధ్యంతర ఆదేశాలు జారీ చేసింది. అర్హత లేని టీచర్లతో విద్యార్థుల భవిష్యత్తు నాశనం అవుతుందని, టెట్ లాంటి నిర్దేశిత అర్హతలు లేని ఉపాధ్యాయులను నియమించొద్దని సూచించింది. పోటీతో కూడిన నియామక ప్రక్రియ లేకుండా ఉపాధ్యాయ నియామకాలు జరగకూడదని వ్యాఖ్యానించింది. టీచర్ల ఎంపికలో న్యాయమైన, పారదర్శక విధానాలు పాటించాలని ఆదేశించింది. అస్సాం విద్యా చట్టంలోని ప్రావిజ్హైజేషన్ ప్రైవేటు పాఠశాలలను ప్రభుత్వ పాఠశాలలుగా మార్చడం.. రాజ్యాంగ విరుద్ధమని ప్రకటించాలని కోరుతూ దాఖలైన పిటిషన్లపై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. ఈ సంస్థల్లోకి అర్హత లేని టీచర్లను అనుమతించొద్దని కోరుతూ పిటిషనర్లు సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు.

అభివృద్ధి పనుల పురోగతి సంతృప్తికరం...!
ప్రభుత్వ హామీల కమిటీ చైర్మన్ ఇసాక్ బాషా
మైలవరం జలాశయాన్ని అద్భుత పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతాం
ఒంటిమిట్ట, రిమ్స్, బ్రౌన్ గ్రంథాలయం, టెక్స్‌టైల్ పార్క్ అభివృద్ధికి ప్రణాళికలు

కడప, మహి న్యూస్ సెప్టెంబర్ 8: వైఎస్సార్ కడప జిల్లాలో ప్రభుత్వ హామీల అమలు, వివిధ అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై సంతృప్తి వ్యక్తం చేసినట్లు ఏపీ శాసనమండలి ప్రభుత్వ హామీల కమిటీ చైర్మన్ ఎమ్మెల్సీ ఇసాక్ బాషా తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అధ్యక్షతన ప్రభుత్వ హామీల కమిటీ సమీక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఏపీ శాసనమండలి ప్రభుత్వ హామీల కమిటీ చైర్మన్ ఎమ్మెల్సీ ఇసాక్ బాషా, ఎమ్మెల్సీ ఎం.వి. రామచంద్రారెడ్డి, కమిటీ జాయింట్ సెక్రటరీ పి.వి. సుబ్బారెడ్డి హాజరయ్యారు. జిల్లా రెవెన్యూ అధికారి మల్లికార్జునుడు, సీపీవో హజరతయ్య, వైవీయూ వీసీ బెల్లంకొండ రాజశేఖర్‌తో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ శాఖల పరిధిలోని ప్రభుత్వ హామీలు, అభివృద్ధి పనుల పురోగతి, ప్రజలకు అందుతున్న సేవలపై అధికారులతో కమిటీ సమీక్షించింది. అనంతరం చైర్మన్ ఇసాక్ బాషా, ఎమ్మెల్సీ ఎం.వి. రామచంద్రారెడ్డి విలేకరులతో మాట్లాడారు. రెండు రోజుల పాటు జిల్లాలో పర్యటించి ఒంటిమిట్ట, రిమ్స్, బ్రౌన్ గ్రంథాలయం, జలాశయాలు, గాంధీనగర్ ప్రభుత్వ పాఠశాల, టెక్స్‌టైల్ పార్క్ తదితర ప్రాంతాల్లో పనులను పరిశీలించినట్లు చెప్పారు. మైలవరం జలాశయాన్ని మరింత అభివృద్ధి చేసి అద్భుతమైన పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు అవకాశం ఉందని ఇసాక్ బాషా తెలిపారు. జలాశయంలో పూర్తిస్థాయి నీటిమట్టం ఉన్న సమయంలో ఏర్పడే ద్వీపాన్ని రోప్‌వేతో అనుసంధానం చేసి పర్యాటకులకు అవసరమైన వసతి, ఆహార సదుపాయాలు కల్పిస్తే మంచి పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయవచ్చన్నారు. దీనిపై ప్రభుత్వానికి కమిటీ తరఫున సిఫారసు చేస్తామని తెలిపారు. మైలవరం జలాశయంలో నీటి ప్రవాహానికి ఆటంకంగా ఉన్న ప్రాంతాలను శుభ్రపరచడంతో పాటు నీటి నిల్వ, నిర్వహణను మెరుగుపరచాలని అధికారులకు సూచించినట్లు చెప్పారు. జలాశయ నిర్వహణకు అవసరమైన సిబ్బంది కొరతను కూడా పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. ఒంటిమిట్టలో శ్రీరామనవమి ఉత్సవాలకు లక్షలాది మంది భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున అందుకు అనుగుణంగా ముందస్తు ఏర్పాట్లు చేయాలని సూచించినట్లు తెలిపారు. భక్తుల కోసం అదనంగా వసతి గదులు ఏర్పాటు చేయడంతో పాటు రహదారులు, రాకపోకలు, ఇతర మౌలిక వసతులను మెరుగుపరచాలని పేర్కొన్నారు. రిమ్స్ ఆసుపత్రిలో వైద్య సేవలు, మౌలిక వసతులు, సిబ్బంది పరిస్థితిని పరిశీలించామని తెలిపారు. చిన్నచిన్న సమస్యలను వెంటనే పరిష్కరించి రోగులకు మరింత మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించినట్లు చెప్పారు. క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ పనుల పురోగతిని కూడా పరిశీలించి అవసరమైన సౌకర్యాలు సమకూర్చాలని సూచించామన్నారు. కడపలోని బ్రౌన్ గ్రంథాలయం విద్యార్థులు, పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే యువతకు ఎంతో ఉపయోగకరంగా ఉందని ఇసాక్ బాషా తెలిపారు. గ్రంథాలయాన్ని మరింత విస్తరించి ఆధునిక సౌకర్యాలు కల్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించినట్లు చెప్పారు. గాంధీనగర్ ప్రభుత్వ పాఠశాలను పరిశీలించిన సందర్భంగా విద్యార్థుల విద్యాభ్యాసంతో పాటు క్రీడా కార్యకలాపాలు కూడా బాగున్నాయని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి మరింత ప్రోత్సాహం అందించాలని సూచించినట్లు చెప్పారు. టెక్స్‌టైల్ పార్క్ పనులను కూడా పరిశీలించామని, మిగిలిన పనులను వేగవంతంగా పూర్తి చేసి స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరినట్లు తెలిపారు. ఎమ్మెల్సీ ఎం.వి. రామచంద్రారెడ్డి మాట్లాడుతూ జిల్లాలో పర్యటించిన సందర్భంగా వివిధ అభివృద్ధి పనులను పరిశీలించామని, ప్రజలకు మెరుగైన సేవలు అందేలా మౌలిక వసతులను బలోపేతం చేయాలని అధికారులకు సూచించినట్లు తెలిపారు. ఒంటిమిట్ట, రిమ్స్, బ్రౌన్ గ్రంథాలయం, జలాశయాలు, పాఠశాలలు, టెక్స్‌టైల్ పార్క్ తదితర ప్రాంతాల్లో గుర్తించిన అంశాలను సమీక్ష సమావేశంలో అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. అభివృద్ధి పనులను వేగవంతం చేసి నిర్దే

RNI : APTEL/25/A0108
మహి న్యూస్
www.mahinewsindia.com
epaper: https://epaper.mahinewsindia.com
తెలుగు దినపత్రిక

వైభవంగా శ్రీ వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరుని కళ్యాణం

పిల్లంక ఆలయానికి పూల మొక్కలు బహుకరణ

తాళ్లరేవు, మహి న్యూస్,సెప్టెంబరు 08: మండల పరిధిలోని పిల్లంక గ్రామంలో గౌతమి గోదావరి పుష్కర ఘాట్ వద్ద పునర్ నిర్మించిన శ్రీ వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరుని ఆలయంలో స్వామి వారి కళ్యాణ మహోత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. ఆలయ నిర్మాణ కర్త వేలూరి వెంకట కామేశ్వర శర్మ (కాశిబాబు) నేతృత్వంలో ఆలయ అర్చకులు కొండవీటి చందు, కొండవీటి సాయి స్వామివారి కళ్యాణాన్ని ఘనంగా జరిపించారు. మోడేకుర్తి లక్ష్మీ నాగరామ సోమయాజులు శర్మ, శ్రావణి దంపతులు, సాగి వెంకట రామచంద్రరావు, సంతోషి దంపతులచే స్వామివారికి విశేష పూజలు నిర్వహించి కళ్యాణం జరిపించారు. అనంతరం సంతాన గోపాల స్వామి పూజను భక్తిశ్రద్ధలతో జరిపించారు. ఈ సందర్భంగా ఆయా దంపతులు ఆలయానికి మామిడి, ఉసిరి, సీతాఫల, గులాబి, మందార తదితర రకాల మొక్కలను ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ ఆలయంలో నూతన దంపతులు ఎవరు కళ్యాణం చేయించుకున్నా ఆలయ ధర్మకర్తచే నూతన దంపతులకు స్వామివారి శేష వస్త్రశీ బహుకరణ, కళ్యాణం చూడడానికి వచ్చిన భక్తులకు ప్రసాద వితరణ కమిటీ వారు ఏర్పాటు చేస్తారని కాశి బాబు తెలిపారు. కళ్యాణోత్సవానంతరం భక్తులకు స్వామివారి తలంబ్రాల బియ్యం, తీర్థ ప్రసాద వితరణ చేసారు. ఈ కార్యక్రమంలో తోలేటి శ్రీనివాసరావు, సాగి శివరామరాజు తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు స్వయం ఉపాధే లక్ష్యం

22 మంది మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ.

తాళ్లరేవు, మహి న్యూస్, సెప్టెంబర్ 8: కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం పి.మల్లవరం పంచాయతీ పరిధిలోని పత్తిగొందిలో 22 మంది మహిళలకు ముమ్మిడివరం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, ప్రజాసేవకులు కుడిపూడి శివన్నారాయణ కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. పత్తిగొందిలోని ఆయన స్వగృహంలో మంగళవారం ఈ కార్యక్రమం నిర్వహించారు. మహిళలకు స్వయం ఉపాధి కల్పించి, వారు తమ కాళ్లపై తాము నిలబడేలా చేయాలనే ఉద్దేశంతో మొత్తం రూ.1.65 లక్షల వ్యయంతో కుట్టు మిషన్లను కొనుగోలు చేసినట్లు శివన్నారాయణ తెలిపారు. ఇందులో 70 శాతం నిధులను ఆయన స్వయంగా సమకూర్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలు కుట్టు మిషన్ల ద్వారా స్వయం శక్తితో ఉపాధి పొందుతూ కొంత ఆదాయాన్ని సమకూర్చుకోవాలని ఆకాంక్షించారు. తద్వారా కుటుంబ ఆర్థిక పరిస్థితికి అండగా నిలిచి, భర్తకు, పిల్లలకు చేదోడువాదోడుగా ఉండాలని సూచించారు. మహిళలకు ఆర్థిక స్వావలంబన కల్పించేందుకు తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని శివన్నారాయణ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కుడిపూడి శ్రీనివాస్, ఎర్ర కుటుంబరావు, దున్నా ఎల్లారావు, మురళీకృష్ణ, దంగేటి విఘ్నేశ్వరరావు, ఒళ్ళు శ్రీనివాస్, గుత్తుల రాము, కొప్పల అబ్బులు, ఉండ్రు కనకయ్య, దున్నా శ్రీనుబాబు తదితరులు పాల్గొన్నారు.

వికసిత్ భారత్ యువ నాయకుల సంభాషణకు
యానాం యువతకు ఆహ్వానం

15 నుంచి 29 ఏళ్ల యువత మై భారత్ వేదిక ద్వారా పాల్గొనాలి

యానాం, మహి న్యూస్, సెప్టెంబర్ 8: భారతదేశ అభివృద్ధిలో యువత భాగస్వామ్యాన్ని పెంపొందించడం, యువతలోని ఆలోచనలు, సృజనాత్మకత, నాయకత్వ లక్షణాలను ప్రోత్సహించే లక్ష్యంతో వికసిత్ భారత్ యువ నాయకుల సంభాషణ -- 2027 కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని జిల్లా యువజన అధికారి అబ్దుల్ ఫరూక్ ఖాన్ తెలిపారు. మంగళవారం మైభారత్ కార్యాలయంలో ఎంఎస్ఎస్ సమన్వయకర్త సిహెచ్ కృష్ణ సుధాకర్ తో కలిసి ఆయన మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యానాంలోని 15 నుంచి 29 సంవత్సరాల వయస్సు గల యువతకు మై భారత్ వేదిక ద్వారా పాల్గొనే అవకాశం కల్పించారు. అర్హులైన యువత మై భారత్ వేదికలో నమోదు చేసుకుని కార్యక్రమంలో పాల్గొనాలని అధికారులు కోరారు. ఈ కార్యక్రమంలో యువతకు పలు దశల్లో తమ ప్రతిభను ప్రదర్శించే అవకాశం ఉంటుందని,తొలుత వికసిత్ భారత్ ప్రశ్నావళి పోటీ, అనంతరం వ్యాసరచన పోటీ, ఆ తర్వాత జిల్లా స్థాయి దృశ్య ప్రదర్శన, రాష్ట్ర స్థాయి దృశ్య ప్రదర్శన నిర్వహిస్తారు. అయా దశల్లో ప్రతిభ కనబరిచిన వారిలో కొందరిని న్యూఢిల్లీలోని భారత్ మండపంలో జరిగే జాతీయ స్థాయి కార్యక్రమానికి ఎంపిక చేస్తారని తెలిపారు. ప్రతి దశలో యువతకు ఉన్న జ్ఞానం, సృజనాత్మకత, నాయకత్వ సామర్థ్యం, భారతదేశ అభివృద్ధిపై వారి ఆలోచనలు, దృక్పథం ఆధారంగా తదుపరి దశకు ఎంపిక చేస్తారని,జాతీయ స్థాయికి ఎంపికైన యువతకు న్యూఢిల్లీలోని భారత్ మండపం వేదికగా దేశవ్యాప్తంగా ఎంపికైన యువ ప్రతిభావంతులతో కలిసి తమ ఆలోచనలు, అభిప్రాయాలను పంచుకునే అరుదైన అవకాశం లభిస్తుంది అన్నారు. 2027 జనవరి 9 నుంచి 12వ తేదీ వరకు న్యూఢిల్లీలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. యానాంలోని అర్హులైన యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని మై భారత్ వేదికలో నమోదు చేసుకుని వికసిత్ భారత్ యువ నాయకుల సంభాషణ -- 2027లో ఉత్సాహంగా పాల్గొనాలని జిల్లా యువజన అధికారి కోరారు. "వికసిత్ భారత్ నిర్మాణంలో యువత ఆలోచనలు.. మార్పుకు యువతే నాయకత్వం" అనే స్ఫూర్తితో ప్రతి యువకుడు, యువతి ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

జిల్లాలో సెప్టెంబర్ 9 నుంచి అక్టోబర్ 8 వరకు
పోషణ్ మాసం 2026 కార్యక్రమాలు

- జిల్లా కలెక్టర్ రాజ కుమారి గణియా

నంద్యాల, మహి న్యూస్, సెప్టెంబర్ 08: రాష్ట్రవ్యాప్తంగా సెప్టెంబర్ 9 నుంచి అక్టోబర్ 8 వరకు నిర్వహిస్తున్న 9వ జాతీయ "పోషణ్ మాసం--2026" కార్యక్రమాలను జిల్లాలో విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేపట్టాలనీ జిల్లా కలెక్టర్ రాజ కుమారి గణియా తెలిపారు మంగళవారం కలెక్టరేట్ లోని కలెక్టర్ ఛాంబర్ నందు "మన అంగన్వాడీ -- మన బాధ్యత" అనే ప్రధాన థీమ్ పై జిల్లా కలెక్టర్ ఐసిడిఎస్ పి డి లీలావతి దేవి, సంబంధిత అధికారులతో కలిసి సమన్వయ సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.."మన అంగన్వాడీ -- మన బాధ్యత" అనే ప్రధాన థీమ్ కార్యక్రమాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారుల్లో పోషకాహార లోపాన్ని నివారించడం, ఆరోగ్య పరిరక్షణ, సమతుల్య ఆహారం, బాలల ఆరోగ్యకరమైన ఎదుగుదలపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు.

చిరుధాన్యాలు, పప్పుధాన్యాలు, స్థానికంగా లభించే పోషకాహార పదార్థాలతో వంటకాల ప్రదర్శనలు.

అంగన్వాడీ కేంద్రాల్లో తాజా, వేడి మరియు సమతుల్య ఆహారంపై అవగాహన.

కమ్యూనిటీ టేస్ట్ టెస్టింగ్ కార్యక్రమాలు.

అంగన్వాడీ మేనేజ్మెంట్ కమిటీలు, గ్రామసభలు, సోషల్ ఆడిట్ ద్వారా ప్రజల భాగస్వామ్యం.

0--3 సంవత్సరాల పిల్లల ఎదుగుదల, అభివృద్ధి పర్యవేక్షణ.

చిన్నారులకు ఆరోగ్య పరీక్షలు, ఈసీసీఈ కార్యక్రమాల నిర్వహణ. ప్రధానమంత్రి మాతృ వందన యోజన పై అవగాహన, అర్హులైన లబ్ధిదారుల నమోదు.

పోషణ వాటికల సందర్శనలు, పోషణ్ మేళాలు, ప్రజలకు ఆసరణాత్మక అవగాహన కార్యక్రమాలు.

ఆరోగ్య, పంచాయతీరాజ్, విద్య, వ్యవసాయం, ఉద్యానవన, సెర్ప్ తదితర శాఖల సమన్వయంతో కార్యక్రమాలను పటిష్టంగా అమలు చేయాలన్నారు. ప్రతిరోజూ నిర్వహించే కార్యక్రమాల వివరాలను జన్ అందోళన్ డ్యాష్‌బోర్డ్ మరియు పోషణ్ ట్రాకర్ ద్వారా నమోదు చేయనున్నారు. జిల్లాలోని ప్రజలు, తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, అంగన్వాడీ సిబ్బంది పెద్ద ఎత్తున పాల్గొని "మన అంగన్వాడీ -- మన బాధ్యత" అనే స్ఫూర్తితో పోషణ్ మాసం కార్యక్రమాలను విజయవంతం చేయాలని అన్నారు.

కోచింగ్ సంస్థల నియంత్రణకు జిల్లా స్థాయి పర్యవేక్షణ కమిటీ

నంద్యాల, సెప్టెంబర్ 08 (మహి న్యూస్): జిల్లాలో కోచింగ్ సంస్థల కార్యకలాపాలను నియంత్రిస్తూ, విద్యార్థుల సంక్షేమం మరియు భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ ఆంధ్రప్రదేశ్ కోచింగ్ సంస్థల (నియంత్రణ మరియు క్రమబద్ధీకరణ) నిబంధనలు--2026ను జిల్లాలో సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ రాజ కుమారి గణియా సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ లోని కలెక్టర్ ఛాంబర్ నందు జిల్లా స్థాయి పర్యవేక్షణ కమిటీ తొలి సమావేశంను కమిటీ మెంబర్-కన్వీనర్, పి.ఎస్.సి. & కె.వి.ఎస్.సి. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శశికళ సంబంధిత శాఖల అధికారులతో నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ..50 మందికి పైగా విద్యార్థులు ఉన్న అన్ని కోచింగ్ సంస్థలు 30 సెప్టెంబర్ 2026 లోగా సీఐఆర్ఎమ్ఎస్ లో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలన్నారు. విద్యార్థుల భద్రతకు తప్పనిసరి భద్రతా మౌలిక వసతులు కల్పించాలన్నారు. కోచింగ్ సంస్థల్లో క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించడశీ తప్పనిసరి అని సీసీటీవీ కెమెరాలు, పరిమిత ప్రవేశం కలిగిన పైకప్పులు, 24 గంటలూ భద్రతా సిబ్బంది ఏర్పాట్లు పగడ్బందీగా ఉండేలా చూడాలన్నారు. కోచింగ్ సమయాన్ని రోజుకు గరిష్టంగా ఐదు గంటలు పరిమితం చేయాలని పాఠశాల వేళల్లో కోచింగ్ తరగతులు నిర్వహించరాదు అన్నారు. విద్యార్థుల పరీక్ష ఫలితాలను ఆధారంగా చేసుకొని బహిరంగంగా అవమానించడం, ఫలితాలను ప్రదర్శించి విద్యార్థులను కించపరచడం వంటి చర్యలు ఉండకూడదు అన్నారు.

ప్రతి కోచింగ్ సెంటర్ నందు వెల్నెస్ సెల్ ఏర్పాటు చేయడంతో పాటు విద్యార్థుల మానసిక ఆరోగ్యానికి సంబంధించిన సమాచారాన్ని అజ్ఞాత పద్ధతిలో నివేదించే విధానం తప్పనిసరి చేయబడుతుందన్నారు. విద్యార్థులు కోర్సును మధ్యలో నిలిపివేసిన సందర్భంలో చెల్లించిన ఫీజును మిగిలిన కాలానికి అనుగుణంగా ప్రో-రేటా ప్రాతిపదికన తిరిగి చెల్లించడం తప్పనిసరి అని తెలిపారు. విద్యార్థుల సంక్షేమం, భద్రత మరియు వారికి కల్పిస్తున్న సౌకర్యాలను పర్యవేక్షించాలన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రుల నుంచి అందే ఫిర్యాదులను సమర్థవంతంగా పరిష్కరించేందుకు గ్రీవెన్స్ రెడ్రెసల్ వ్యవస్థను బలోపేతం చేయాలన్నారు. విద్యార్థుల ఫిర్యాదుల పరిష్కారం కోసం కలెక్టర్ కార్యాలయం నందు గ్రీవన్స్ డ్రాప్ బాక్స్ ఏర్పాటు చేయడంతో పాటు డిజిటల్ పోర్టల్ ద్వారా కూడా ఫిర్యాదులు స్వీకరించి 15 రోజుల్లోగా పరిష్కరించే విధానం అమలు చేయబడుతుందన్నారు. కోచింగ్ సంస్థల నియంత్రణలో విద్య, వైద్య ఆరోగ్యం, పోలీస్, మహిళా శిశు సంక్షేమం తదితర శాఖల మధ్య సమన్వయంతో భాగస్వామ్యం ఉండాలన్నారు. విద్యార్థులకు ఒత్తిడిలేని, సురక్షితమైన మరియు ఆరోగ్యకరమైన విద్యా వాతావరణం కల్పించడమే కోచింగ్ సంస్థల నియంత్రణ నిబంధనల ప్రధాన ఉద్దేశ్యమని అన్నారు. కోచింగ్ సంస్థలు నిర్దేశించిన నిబంధనలను తప్పనిసరిగా పాటించి విద్యార్థుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు.

అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం ఘనంగా నిర్వహణ

విద్యార్థులకు ప్రాథమిక, అటవీ, కార్మిక, వినియోగదారుల హక్కులపై అవగాహన పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని న్యాయమూర్తి పిలుపు విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం రుచి చూసిన న్యాయమూర్తి

కర్నూలు, సెప్టెంబర్ 08: (మహి న్యూస్): రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు కర్నూలు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, న్యాయమూర్తి బి. లీలా వెంకట శేషాద్రి ఆధ్వర్యంలో కల్లూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవాన్ని జాగృతి పథకం--2025 సభ్యులతో కలిసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ ప్రకృతి, పర్యావరణాన్ని ప్రతి ఒక్కరూ కాపాడాలని కోరారు. 2026 అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం 60వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని "ప్రజలు, భూగోళం, శ్రేయస్సు కోసం అక్షరాస్యత" అనే ఇతివృత్తంతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు ప్రాథమిక హక్కులు, అటవీ హక్కులు, కాలుష్య నివారణ, కార్మిక హక్కులు, కనీస వేతనాలు, వినియోగదారుల రక్షణ తదితర చట్టాలపై అవగాహన కల్పించారు. కళాశాల ప్రాంతీయ తనిఖీ అధికారి లాలప్ప మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చదవడం, రాయడం వంటి కనీస అక్షరాస్యతను కలిగి ఉండాలని అన్నారు. అనంతరం అక్షరాస్యతపై నిర్వహించిన పోటీల్లో విజేతలైన విద్యార్థులకు స్వచ్ఛంద సంస్థ లయన్స్ క్లబ్ ఆఫ్ మెల్విన్ జోన్స్ అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాసులు సహకారంతో బహుమతులను న్యాయమూర్తి చేతుల మీదుగా అందజేశారు. పర్యావరణ కాలుష్యాన్ని నివారించేందుకు మట్టి వినాయక విగ్రహాలనే ప్రతి ఒక్కరూ పూజించాలని సూచిస్తూ రూపొందించిన అవగాహన పోస్టర్లను న్యాయమూర్తి ఆవిష్కరించారు. అనంతరం పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని న్యాయమూర్తి స్వయంగా విద్యార్థులతో కలిసి రుచి చూసి, ఆహారం నాణ్యతపై వారిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ తనిఖీ అధికారి లాలప్ప, కర్నూలు నగరపాలక సంస్థ ఉప కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, కల్లూరు మండల విద్యాధికారి

శ్రీనివాసులు, జిల్లా బాలల సంక్షేమ అధికారి శారద, సంక్షేమ వసతి గృహ అధికారి మద్దిలేటి, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి రాయపాటి శ్రీనివాసులు, న్యాయవాదులు వెంకట్రావు, రాంపుల్లయ్య, ఉప న్యాయ సహాయ రక్షణ న్యాయవాది సులోచన, జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు హుస్సేన్, పారా లీగల్ వాలంటీర్ హేమంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మన అంగన్‌వాడీ - మన బాధ్యత

30 రోజుల పాటు పోషణ మాసోత్సవాల నిర్వహణ

సెప్టెంబర్ 9 నుంచి అక్టోబర్ 8 వరకు 9వ జాతీయ పోషణ మాసోత్సవాలు

ఐదు ప్రధాన అంశాలపై ప్రత్యేక దృష్టి

అంగన్‌వాడీ కేంద్రాల్లో భోజనం నాణ్యతపై నిరంతర పర్యవేక్షణ

పరిశుభ్రతతో కూడిన ఆహార తయారీపై అవగాహన కల్పించాలి

జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి

కర్నూలు, సెప్టెంబర్ 08: (మహి న్యూస్): జిల్లాలో సెప్టెంబర్ 9 నుంచి అక్టోబర్ 8 వరకు 30 రోజుల పాటు 9వ జాతీయ పోషణ మాసోత్సవాలను "మన అంగన్‌వాడీ -- మన బాధ్యత" ప్రధాన ఇతివృత్తంతో నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి తెలిపారు. ఈ నెల 9వ తేదీ నుంచి వచ్చే నెల 8వ తేదీ వరకు నిర్వహించనున్న 9వ జాతీయ పోషణ మాసం--2026 కార్యక్రమాలపై మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు తదితరులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు పోషణ మాసంలో ప్రధానంగా ఐదు అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఆహార వైవిధ్యం, తగినంత ప్రోటీన్, అంగన్‌వాడీ కేంద్రాల్లో తాజా వేడి భోజనం, సమాజ భాగస్వామ్యం--జవాబుదారీతనం, పోషణ--బాల్య వికాసానికి ప్రారంభ ప్రేరణ, ప్రధానమంత్రి మాతృ వందన యోజన అంశాలపై కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఐదు ఇతివృత్తాలకు ఆరు రోజుల చొప్పున కార్యక్రమాలు నిర్వహిస్తూ మొత్తం 30 రోజుల పాటు పోషణ మాసోత్సవాలను నిరంతరంగా నిర్వహించాలని ఐసీడీఎస్ పీడీ, సంబంధిత అధికారులను ఆదేశించారు. అక్టోబర్ 8 వరకు షెడ్యూల్ ప్రకారం అన్ని కార్యక్రమాలను నిర్వహించడంతో పాటు వాటికి విస్తృత ప్రచారం కల్పించాలని సూచించారు. గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు అందించే పోషకాహారాన్ని వారు మాత్రమే వినియోగించేలా కుటుంబ సభ్యుల్లో అవగాహన కల్పించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ప్రతిరోజూ అందించే తాజా వేడి భోజనం నాణ్యత, పంపిణీపై సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. గర్భిణీలు, బాలింతలకు అందుబాటులో ఉన్న ప్రధానమంత్రి మాతృ వందన యోజన ప్రయోజనాలు, అర్హతలు, ఆర్థిక సహాయం పొందే విధానం తదితర అంశాలపై విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. పిల్లల్లో పోషకాహార లోపాన్ని నివారించేందుకు పోషకాహారం తీసుకోవడంతో పాటు ఆహారాన్ని పరిశుభ్రంగా తయారు చేయడం కూడా అత్యంత ముఖ్యమని కలెక్టర్ స్పష్టం చేశారు. కుటుంబ సభ్యులు చేతులు, గోళ్ళు శుభ్రంగా ఉంచుకోవడం, వంట చేసే ప్రదేశాన్ని పరిశుభ్రంగా ఉంచడం, పాత్రలను శుభ్రంగా ఉపయోగించడం, ఆహారాన్ని బాగా వండి వేడిగా తీసుకోవడం, వండిన ఆహారాన్ని మూతపెట్టి భద్రపరచడం వంటి అంశాలపై శిక్షణ ఇవ్వాలన్నారు. పరిశుభ్రత పాటించకుండా తయారు చేసిన ఆహారం ఎంత పోషకమైనదైనా పిల్లల్లో ఇన్‌ఫెక్షన్లకు కారణమయ్యే అవకాశం ఉందని, దీర్ఘకాలిక ఇన్‌ఫెక్షన్లు పిల్లల్లో ఎదుగుదల లోపం, తక్కువ బరువు, తీవ్రమైన పోషకాహార లోపానికి దారితీసే ప్రమాదం ఉందన్నారు. సంబంధిత కార్యక్రమాల్లో "పరిశుభ్రతతో కూడిన ఆహార తయారీ--పోషకాహారం" అనే రెండు అంశాలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని సూచించారు. సెప్టెంబర్ 21న నిర్వహించే ఆహార భద్రత దినోత్సవం సందర్భంగా గ్రామీణ ప్రాంతాల్లో చిన్నారులకు కుర్‌కురే, చిప్స్ వంటి ప్యాకెట్ ఆహార పదార్థాలను అధికంగా అందిస్తున్న నేపథ్యంలో వాటి దుష్ప్రభావాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. సెప్టెంబర్ 25న పంచాయతీ అధికారుల భాగస్వామ్యంతో అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి, తాగునీరు, పరిశుభ్రత, పారిశుద్ధ్యం, మౌలిక వసతులకు సంబంధించిన సమస్యలను గుర్తించి పరిష్కరించాలని జిల్లా పంచాయతీ అధికారిని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఐసీడీఎస్ పీడీ విజయ, డీఎంహెచ్‌వో డా. కామేశ్వర ప్రసాద్, డీపీఓ భాస్కర్, ఉద్యాన శాఖ అధికారి రాజాకృష్ణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మణపల్లి, శకునాల గ్రామాల్లో రైతులకు అవగాహన కార్యక్రమం

ఓర్వకల్ సెప్టెంబర్ 8, (మహి న్యూస్) : ఓర్వకల్ మండలంలోని బ్రహ్మణపల్లి మరియు శకునాల గ్రామాల్లో రైతులకు వివిధ వ్యవసాయ పథకాలు, రైతు ఐడీ, రైతు పెన్షన్ పథకం మరియు సమగ్ర సస్యరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రైతులకు ప్రధానమంత్రి కిసాన్ మాన్‌ధన్ యోజన (గ్రావీ-ఖవీ) గురించి వివరించారు. 18 నుండి 40 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన అర్హత గల రైతులు సమీపంలోని జూజ కేంద్రాల ద్వారా ఆధార్ నంబర్ మరియు గ్రావీ-ఖఆూాఐకు అనుసంధానమైన బ్యాంకు ఖాతా వివరాలతో నమోదు చేసుకోవచ్చని తెలిపారు. రైతుల వయస్సును బట్టి నెలకు సుమారు రూ.55 నుండి రూ.200 వరకు ప్రీమియం చెల్లించాల్సి ఉంటుందని, 60 సంవత్సరాల వయస్సు పూర్తయిన తరువాత అర్హత మేరకు నెలకు రూ.3,000 పెన్షన్ పొందే అవకాశం ఉంటుందని వివరించారు. అలాగే, రైతులకు ఖీుతీఎవతీ ×ణ (రైతు ఐడీ) ప్రాధాన్యతను వివరించారు. రాబోయే కాలంలో ప్రభుత్వం అమలు చేసే వివిధ వ్యవసాయ సంక్షేమ పథకాలు, ఎరువుల కొనుగోలు, పంటల నమోదు, పంట బీమా మరియు ఇతర ప్రభుత్వ ప్రయోజనాలు పొందేందుకు రైతు ఐడీ ఎంతో ముఖ్యమని తెలిపారు. ప్రతి రైతు తప్పనిసరిగా రైతు ఐడీ నమోదు చేసుకోవాలని సూచించారు.ఈ సందర్భంగా =వత్రీఱుఅఎవ ఖీశీబఅఘ్ఘశీఅ ద్వారా రైతులకు అందిస్తున్న వేపనూనె, అమినో ఆమ్లాలు, ఫెరోమోన్ ట్రాప్స్, స్టిక్కీ ట్రాప్స్ వంటి వ్యవసాయ ఇన్‌పుట్స్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వీటి ద్వారా పంటలపై పురుగు ఉధృతిని గుర్తించడం, నియంత్రించడం, రసాయనిక పురుగుమందుల వినియోగాన్ని తగ్గించడం మరియు సమగ్ర సస్యరక్షణ పద్ధతులను అవలంబించడం వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు.రైతులు వ్యవసాయ శాఖ సూచనలు పాటిస్తూ, అందుబాటులో ఉన్న ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని, శాస్త్రీయ మరియు సమగ్ర పంట నిర్వహణ పద్ధతులను అవలంబించాలని మండల వ్యవసాయ అధికారి, ఓర్వకల్ కోరారు.

EDITOR and PUBLISHER and OWNED BY NEELI RAMASUBBAIAH, PUBLISHED AT.15-603/1, RAJU ROAD, KAMAL NAGAR, ANANTHAPURAMU, ANDHRA PRADESH - 515001.PRINTED AT VSAR PUBLICATIONS 91/4-31-3-1B, BALAJINAGAR, KURNOOL.. RNI NO : APTEL/26/A7631. Cell 90 59 58 58 98. Email : mahinewsindia@gmail.com, website : https//epaper.mahinewsindia.com

RNI : APTEL/25/A0108
మహి న్యూస్
www.mahinewsindia.com
epaper: https://epaper.mahinewsindia.com
తెలుగు దినపత్రిక

సరికొండ భ్రమరాంబకు విశిష్ట సేవారత్న పురస్కారం

బోటిక్ రంగంలో వినూత్న నమూనాలు..

పేద విద్యార్థులకు ఉచితంగా పాఠశాల యూనిఫారాలు

సత్తెనపల్లి, మహి న్యూస్, సెప్టెంబర్ 08: సత్తెనపల్లి పట్టణానికి చెందిన ప్రముఖ బోటిక్ ఆర్టిస్ట్ సరికొండ భ్రమరాంబకు విశిష్ట సేవారత్న పురస్కారం లభించింది. బోటిక్ రంగంలో నూతన మోడళ్లను రూపొందిస్తూ, పేద విద్యార్థులకు ఉచితంగా పాఠశాల యూనిఫారాలను కుట్టించి అందిస్తున్న సేవలను గుర్తించి ఈ పురస్కారాన్ని అందజేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మక భాషా సాంస్కృతిక శాఖ, కాసుల పురుషోత్తమ కవి ఫౌండేషన్ ఇండియా ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో సరికొండ భ్రమరాంబకు విశిష్ట సేవారత్న పురస్కారాన్ని ప్రదానం చేశారు. బోటిక్ రంగంలో తన ప్రతిభను చాటుకోవడంతో పాటు, ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు తనవంతు సహాయం అందిస్తూ ఉచితంగా పాఠశాల యూనిఫారాలను కుట్టించి ఇవ్వడం పట్ల నిర్వాహకులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా పట్టణానికి చెందిన పలువురు ప్రముఖులు సరికొండ భ్రమరాంబను అభినందించారు. పురస్కారం అందుకోవడం పట్ల ఆమె ఆనందం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో కూడా పేద విద్యార్థులకు తనవంతు సహకారం అందిస్తూ ఉచితంగా పాఠశాల యూనిఫారాలను అందజేస్తానని తెలిపారు.

10వ తేదీ నాటికి బహిరంగ విచారణ పూర్తి చేయాలి

ఎస్ఐఆర్ పెండింగ్ దరఖాస్తులపై వేగంగా చర్యలు

తహసీల్దార్లకు జిల్లా రెవెన్యూ అధికారి ఎన్.ఎస్.కె. ఖాజావలి ఆదేశాలు

గుంటూరు, మహి న్యూస్, సెప్టెంబర్ 08: ప్రత్యేక ఓటరు సవరణ ప్రక్రియ (ఎస్ఐఆర్)కు సంబంధించి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల బహిరంగ విచారణను ఈ నెల 10వ తేదీ నాటికి పూర్తి చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎన్.ఎస్.కె. ఖాజావలి స్పష్టం చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై తహసీల్దార్లతో మంగళవారం నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో ఆయన పలు సూచనలు చేశారు. పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. బుక్ ఏ కాల్ విధానంలో వచ్చిన అభ్యర్థనలను వేగంగా పరిష్కరించేందుకు సంబంధిత యాప్‌ను కనీసం గంటకు ఒకసారి పరిశీలించాలని సూచించారు. ఫారం-6, ఫారం-7, ఫారం-8 ద్వారా వచ్చిన క్లెయిమ్‌లపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. నిబంధనల ప్రకారం నిర్దిష్ట సమయంలో రాజకీయ పార్టీలకు అందించాల్సిన సమాచారాన్ని తప్పనిసరిగా అందించాలని సూచించారు. బూత్ స్థాయి అధికారులు తమ పరిధిలోని 1,200 మంది ఓటర్ల వివరాలు, ఫొటోలను విధిగా పరిశీలించాలని తెలిపారు. ఓటర్ల వివరాల్లో తప్పులు ఉన్నా, ఫొటోలు జత కాకపోయినా సంబంధిత అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ప్రతి విద్యాసంస్థలో ఓటరు అక్షరాస్యత క్లబ్‌లను ఏర్పాటు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి సూచించారు. జనగణనకు సంబంధించి విచారణ పూర్తి చేయాల్సిన అంశాలపై కూడా ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. ఖాళీగా ఉన్న ఇళ్ల వివరాలు, తాళాలు వేసి ఉన్న ఇళ్ల వివరాలను సంబంధిత పోర్టల్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. ప్రజలకు రెవెన్యూ సేవలను మరింత చేరువ చేయాలని సూచించారు. రీ-సర్వే వంటి ప్రక్రియలపై ఆయా గ్రామాల్లో ప్రజలకు స్పష్టమైన అవగాహన కల్పించాలని అన్నారు. రీ-సర్వే విధానంపై క్షేత్రస్థాయి సిబ్బంది ప్రతి ఒక్కరికీ వివరించే స్థాయిలో పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. క్షేత్రస్థాయి సిబ్బంది ప్రజలతో విస్తృతంగా మమేకమై వారి సమస్యలను తెలుసుకుని, ప్రభుత్వ సేవలను త్వరితగతిన అందించాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎన్.ఎస్.కె. ఖాజావలి ఆదేశించారు.

గణేష్ మండపాల్లో విద్యుత్ భద్రతే ప్రధానం!

500 వాట్లకు రూ.1,000.. 1,000 వాట్లకు రూ.2,250

ఈ నెల 26 వరకు తాత్కాలిక విద్యుత్ సరఫరా

విజయవాడ, మహి న్యూస్, సెప్టెంబర్ 08: వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసే గణేష్ మండపాల్లో విద్యుత్ భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పి. పుల్లారెడ్డి సూచించారు. భక్తితో పూజిద్దాం.. భద్రతతో పండుగ జరుపుకుందామని పిలుపునిచ్చారు. గణేష్ మండపాలను విద్యుత్ స్తంభాలు, విద్యుత్ తీగలకు తగినంత దూరంలో ఏర్పాటు చేయాలని, మండపాలపై నుంచి విద్యుత్ తీగలు వెళ్లకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నాణ్యమైన వైర్లు, స్విచ్‌లు, ప్లగ్‌లను మాత్రమే వినియోగించాలని, వైరింగ్ పనులను అర్హత కలిగిన ఎలక్ట్రీషియన్లతోనే చేయించుకోవాలని తెలిపారు. అనధికారిక విద్యుత్ కనెక్షన్లు తీసుకోవద్దని, అధిక లోడ్ వల్ల ప్రమాదాలు జరగకుండా తగిన సామర్థ్యం కలిగిన వైరింగ్, రక్షణ పరికరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. వర్షాల సమయంలో విద్యుత్ పరికరాలు, వైర్లు తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, తడిసిన విద్యుత్ పరికరాలను చేతితో తాకరాదని హెచ్చరించారు. విద్యుత్ తీగలు తెగిపడినా, వేలాడుతున్నా వాటికి దూరంగా ఉండి వెంటనే విద్యుత్ శాఖకు లేదా 1912 టోల్‌ఫ్రీ నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. వినాయక చవితిని పురస్కరించుకుని ఈ నెల 26వ తేదీ వరకు గణేష్ మండపాలకు తాత్కాలిక విద్యుత్ సరఫరా అందించనున్నట్లు సీఎండీ తెలిపారు. 500 వాట్లకు రూ.1,000, 1,000 వాట్లకు రూ.2,250 చొప్పున తాత్కాలిక విద్యుత్ సరఫరా రుసుము ఉంటుందని, దరఖాస్తు రుసుము రూ.100గా నిర్ణయించినట్లు వెల్లడించారు. తాత్కాలిక విద్యుత్ కనెక్షన్ కోసం స్వర్ణ గ్రామ/వార్డు సచివాలయాలు, ఏపీసీపీడీసీఎల్ వెబ్‌సైట్, మీ-సేవ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అనధికారికంగా విద్యుత్ వినియోగించినట్లు గుర్తిస్తే నిబంధనల ప్రకారం కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండపాల వద్ద భక్తులు, ప్రజల రాకపోకలకు, అత్యవసర వాహనాల రాకపోకలకు ఎలాంటి ఆటంకం కలగకుండా నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. వినాయక చవితి పండుగను భక్తిశ్రద్ధలతో పాటు విద్యుత్ భద్రతా ప్రమాణాలను పాటిస్తూ సురక్షితంగా జరుపుకోవాలని ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పి. పుల్లారెడ్డి ఆకాంక్షించారు.

జిల్లా కలెక్టర్ల సమావేశ ఏర్పాట్లను పరిశీలించిన గుంటూరు కలెక్టర్

అధికారులకు కీలక సూచనలు..

బాధ్యతల నిర్వహణలో ఎలాంటి లోపాలు ఉండకూడదని ఆదేశం



గుంటూరు, మహి న్యూస్ సెప్టెంబర్ 8: ఈ నెల 10, 11 తేదీల్లో వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయంలో జరగనున్న జిల్లా కలెక్టర్ల సమావేశ ఏర్పాట్లను గుంటూరు జిల్లా కలెక్టర్ సి.యం. సాయికాంత్ వర్మ మంగళవారం పరిశీలించారు. సమావేశానికి హాజరయ్యే అధికారులు, ప్రతినిధులకు అవసరమైన ఏర్పాట్లు, ప్రోటోకాల్, భద్రత తదితర అంశాలపై అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. సమావేశం విజయవంతంగా నిర్వహించేందుకు ప్రతి అధికారి తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని సూచించారు. ఏర్పాట్లలో ఎక్కడా లోపాలు లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రోటోకాల్ డైరెక్టర్ మోహన్ రావు, గుంటూరు రెవెన్యూ డివిజనల్ అధికారి కె. శ్రీనివాస రావు, తెనాలి రెవెన్యూ డివిజనల్ అధికారి కె. శ్రీరమణి, పోలీస్ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పల్నాడు జిల్లాలో వయోజనుల్లో 100% అక్షరాస్యతే లక్ష్యం

'అక్షర ఆంధ్ర'తో నిరక్షరాస్యులకు విద్యా వెలుగులు

అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం సందర్భంగా అవగాహన సదస్సు, ర్యాలీ

పల్నాడు జిల్లా/మహి న్యూస్ । సెప్టెంబర్ 08: పల్నాడు జిల్లాలోని వయోజనుల్లో 100 శాతం అక్షరాస్యత సాధించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని వయోజన విద్యాశాఖ గుంటూరు జిల్లా సహాయ సంచాలకులు వి. అజయ్ కుమార్ తెలిపారు. 60వ అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవాన్ని పురస్కరించుకుని నరసరావుపేటలోని మండల మహిళా సమాఖ్య కార్యాలయ ప్రాంగణంలో వయోజన విద్యాశాఖ ఆధ్వర్యంలో అక్షరాస్యత దినోత్సవ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న వి. అజయ్ కుమార్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్వహిస్తున్న 'ఉల్లాస్ అక్షర ఆంధ్ర' కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. స్వయం సహాయక సంఘాల్లోని నిరక్షరాస్య మహిళలు, వి.బి.జి. రాంజీ గ్రూపు సభ్యుల్లోని పురుషులు, సమాజంలోని 15 సంవత్సరాలు పైబడిన నిరక్షరాస్య వయోజనులు ఈ కార్యక్రమంలో చేరి విద్యను అభ్యసించాలని సూచించారు. 2026 సెప్టెంబర్ 8 నుంచి 2027 మార్చి వరకు 'అక్షర ఆంధ్ర' అభ్యసన తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇప్పటికే జిల్లాలో నిరక్షరాస్యులను గుర్తించి, ప్రతి పది మంది అభ్యాసకులకు ఒక స్వచ్ఛంద ఉపాధ్యాయుడిని ఎంపిక చేసినట్లు చెప్పారు. వీరు స్వచ్ఛందంగా వయోజనులకు విద్యాబోధన చేస్తారని తెలిపారు. అభ్యాసకులకు సమీపంలోని అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలు, కమ్యూనిటీ భవనాల్లో ప్రతిరోజూ సాయంత్రం 5 గంటల నుంచి 7 గంటల వరకు తరగతులు నిర్వహిస్తామని వివరించారు. 'అక్షర ఆంధ్ర' యాప్ ద్వారా వీడియో పాఠాలు, పాఠ్యపుస్తకాలను అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. అభ్యాసకులు మొత్తం 40 గంటల పాఠ్యపుస్తక అభ్యాసం, 45 గంటల వర్క్‌బుక్ వ్యాయామాలు, 15 గంటల వీడియో పాఠాలను పూర్తి చేయాల్సి ఉంటుందని తెలిపారు. అనంతరం మార్చి నెలలో ఎన్ఐఓఎస్ నిర్వహించే పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారిని అక్షరాస్యులుగా గుర్తిస్తారని పేర్కొన్నారు. అక్షరాస్యతతో పాటు డిజిటల్ అక్షరాస్యత, ఆర్థిక అక్షరాస్యత, కార్యాచరణాత్మక అక్షరాస్యతపై కూడా స్వయం సహాయక సంఘాల సభ్యులు అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ, ఏపీడీ, మెప్మా పీడీ, ఎంపీడీఓలు మాట్లాడుతూ 'అక్షర ఆంధ్ర' కార్యక్రమం ముఖ్యంగా స్వయం సహాయక సంఘాల సభ్యులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. అక్షరాస్యత అభివృద్ధి ద్వారా పేదరిక నిర్మూలనకు కూడా దోహదపడవచ్చన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు తమ పరిధిలో పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. చదువుకున్న విద్యార్థినీ, విద్యార్థుల సహకారంతో వయోజనుల్లో అక్షరాస్యతను మరింత అభివృద్ధి చేస్తామని అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీఎంలు, సీసీలు, వీఓలు, వయోజన విద్యాశాఖ సిబ్బంది, ఏపీవోలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు. అనంతరం అక్షరాస్యత అవశ్యకతపై ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నిరక్షరాస్యుల కోసం అక్షరాస్యత తరగతులను ప్రారంభించారు. పల్నాడు జిల్లాను సంపూర్ణ అక్షరాస్యత దిశగా తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు.

వయోజనుల్లో శత శాతం అక్షరాస్యతే లక్ష్యం

'అక్షర ఆంధ్ర'తో నిరక్షరాస్యులకు విద్యా వెలుగులు

అక్షరాస్యతతో పాటు డిజిటల్, ఆర్థిక, కార్యాచరణాత్మక అక్షరాస్యతపై అవగాహన అవసరం

గుంటూరు, మహి న్యూస్, సెప్టెంబర్ 08: వయోజనుల్లో శత శాతం అక్షరాస్యత సాధించడమే లక్ష్యమని వయోజన విద్యాశాఖ ఉపసంచాలకులు కె. అంజనేయులు అన్నారు. 60వ అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవాన్ని పురస్కరించుకుని గుంటూరు జిల్లా కాకుమాను మండల మహిళా సమాఖ్య కార్యాలయ ప్రాంగణంలో వయోజన విద్యాశాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ అక్షరాస్యత

దినోత్సవ సదస్సును మంగళవారం నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన వయోజన విద్యాశాఖ ఉపసంచాలకులు కె. అంజనేయులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న 'ఉల్లాస్ అక్షర ఆంధ్ర' కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. స్వయం సహాయక సంఘాల్లోని నిరక్షరాస్య మహిళలు, వి.బి.జి. రామ్‌జీ గ్రూపు సభ్యుల్లోని పురుషులు, సమాజంలో 15 సంవత్సరాలు పైబడిన నిరక్షరాస్య వయోజనులు ఈ కార్యక్రమంలో చేరవచ్చని తెలిపారు. సెప్టెంబర్ 8 నుంచి వచ్చే ఏడాది మార్చి వరకు నిర్వహించే 'అక్షర ఆంధ్ర' అభ్యసన తరగతులకు హాజరై చదువుకోవాలని కోరారు. 2026-27 ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో నిరక్షరాస్యులను ఇప్పటికే గుర్తించి, ప్రతి పది మంది అభ్యాసకులకు ఒక స్వచ్ఛంద ఉపాధ్యాయుడిని ఎంపిక చేసినట్లు తెలిపారు. స్వచ్ఛంద ఉపాధ్యాయులు ఎటువంటి ప్రతిఫలం ఆశించకుండా వయోజనులకు విద్యాబోధన చేస్తారని వివరించారు. అభ్యాసకులకు సమీపంలోని అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలు, కమ్యూనిటీ భవనాల్లో ప్రతిరోజూ సాయంత్రం 5 గంటల నుంచి 7 గంటల వరకు తరగతులు నిర్వహిస్తామని తెలిపారు. 'అక్షర ఆంధ్ర' యాప్ ద్వారా వీడియో పాఠాలు, పాఠ్యపుస్తకాలను అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు చెప్పారు. మొత్తం 40 గంటల పాఠ్యపుస్తక అభ్యాసం, 45 గంటల వర్క్‌బుక్ వ్యాయామాలు, 15 గంటల వీడియో పాఠాలను అభ్యాసకులు పూర్తి చేయాల్సి ఉంటుందని వివరించారు. మార్చి నెలలో జాతీయ ఓపెన్ స్కూలింగ్ సంస్థ నిర్వహించే పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారిని అక్షరాస్యులుగా గుర్తించడం జరుగుతుందని తెలిపారు. గుంటూరు జిల్లాలో అక్షరాస్యత అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చారు. మండల తహసిల్దార్ వెంకట స్వామి మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల సభ్యులు డిజిటల్ అక్షరాస్యత, ఆర్థిక అక్షరాస్యత, కార్యాచరణాత్మక అక్షరాస్యతపై మరింత అవగాహన పెంపొందించుకోవాలని కోరారు. మండల విద్యాశాఖ అధికారి మాట్లాడుతూ చదువుకున్న విద్యార్థినీ, విద్యార్థుల సహకారంతో కాకుమాను మండలంలోని వయోజనుల్లో అక్షరాస్యతను అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించి అక్షరాస్యత అవశ్యకతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కాకుమాను మండల సమాఖ్య ఏపీఎం సురేష్, వయోజన విద్య గుంటూరు డివిజన్ పర్యవేక్షకులు ఓ. నారాయణరావు, పర్యవేక్షకులు సి.హెచ్.వి. చలపతిరావు, దాసరి వెంకటస్వామి, వెలుగు కమ్యూనిటీ కోఆర్డినేటర్లు, విలేజ్ అర్గనైజేషన్ అసిస్టెంట్లు, స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

పల్నాడు జిల్లాలో ఘనంగా ఎంఎస్ఎంఈ గ్రోత్ వర్క్‌షాప్

"వన్ ఫ్యామిలీ--వన్ ఎంటర్‌ప్రెన్యూర్" నినాదంతో

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అవగాహన

పల్నాడు జిల్లా, మహి న్యూస్ సెప్టెంబర్ 8: జిల్లా పరిశ్రమల శాఖ, పల్నాడు జిల్లా ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన "వన్ ఫ్యామిలీ--వన్ ఎంటర్‌ప్రెన్యూర్" నినాదంతో ఎంఎస్ఎంఈ గ్రోత్ వర్క్‌షాప్‌ను నరసరావుపేటలోని కాసు సెంట్రల్‌లో మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ డాక్టర్ కృతిక శుక్ల ఐఏఎస్ పాల్గొని ముఖ్య సందేశాన్ని అందించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏపీ ఎంఎస్ఎంఈ కార్పొరేషన్ చైర్మన్ తమ్మిరెడ్డి శివశంకరరావు పాల్గొన్నారు. పల్నాడు జిల్లాలోని ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు అవసరమైన అన్ని సౌకర్యాలను అందుబాటులోకి తీసుకురావడమే ఈ వర్క్‌షాప్ ప్రధాన ఉద్దేశమని జిల్లా పరిశ్రమల అధికారి ఎస్. వెంకట సురేష్ తెలిపారు. ఉత్పత్తి, మార్కెటింగ్, రుణ సదుపాయాలు, డిజిటల్ ఆధారిత సేవల వినియోగం తదితర అంశాల మధ్య సమన్వయం సాధించడంతో పాటు, సులభతరంగా

వ్యాపారాలను ప్రారంభించేందుకు అవసరమైన సేవలను ఒకే వేదికపై అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. నూతన పరిశ్రమలను ప్రారంభించేందుకు అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరఫున పల్నాడు జిల్లా యంత్రాంగం అందిస్తుందని పేర్కొన్నారు. దేశ స్థూల జాతీయోత్పత్తిలో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఈలు) కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. నూతన ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు వివిధ అంశాలపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక సెమినార్లు, హెల్ప్‌డెస్క్‌లు, స్టాళ్లను ఏర్పాటు చేశారు. పరిశ్రమల స్థాపన, రుణ సదుపాయాలు, మార్కెటింగ్, ప్రభుత్వ ప్రోత్సాహకాలు, డిజిటల్ సేవల వినియోగంపై నిపుణులు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ఎంఈ డైరెక్టర్ డాక్టర్ గుడిపూడి చిన్నరాజు, ఎంఎస్ఎంఈ సీఈఓ విశ్వ మనోహర్, పరిశ్రమల శాఖ అధికారులు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు తదితరులు పాల్గొన్నారు.

పల్నాడు జిల్లాలో రుణాల పంపిణీ వేగవంతం చేయాలి

కౌలు, ఆర్ఓఎఫ్ఆర్ పట్టా రైతులకు అవగాహన కల్పించి బ్యాంకులు రుణాలు అందించాలి: కలెక్టర్ కృతిక శుక్లా



పల్నాడు జిల్లా, మహి న్యూస్ సెప్టెంబర్ 8: పల్నాడు జిల్లా కలెక్టరేట్‌లో జూన్ త్రైమాసికానికి సంబంధించిన జిల్లా సంప్రదింపుల కమిటీ (డీసీసీ), జిల్లా స్థాయి సమీక్షా కమిటీ (డీఎల్ఆర్సీ) సమావేశం కలెక్టర్ కృతిక శుక్లా అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. జూన్ 30, 2026 నాటికి ప్రాధాన్యత, ఇతర రంగాలకు బ్యాంకులు అందించిన రుణాల పంపిణీపై సమావేశంలో సమీక్షించారు.



వ్యవసాయ రంగానికి సంబంధించి వార్షికంగా రూ.17,761 కోట్ల రుణ లక్ష్యానికి గాను జూన్ త్రైమాసికం నాటికి రూ.5,927.84 కోట్ల రుణాలను పంపిణీ చేసినట్లు సమావేశంలో వెల్లడించారు. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) రంగంలో రూ.3,112 కోట్ల వార్షిక లక్ష్యానికి గాను రూ.1,445 కోట్ల రుణాలను అందించారు. ప్రాధాన్యత రంగానికి సంబంధించి రూ.21,490 కోట్ల వార్షిక లక్ష్యానికి గాను జూన్ త్రైమాసికం నాటికి రూ.7,445 కోట్ల రుణాలను పంపిణీ చేశారు. మొత్తం వార్షిక రుణ ప్రణాళిక (ఏసీపీ) రూ.25,879 కోట్ల లక్ష్యానికి గాను రూ.9,086 కోట్ల రుణాలను అందించినట్లు అధికారులు వివరించారు. కౌలు రైతులు, ఆర్ఓఎఫ్ఆర్ పట్టా రైతులకు సత్వరమే అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, అర్హులైన వారికి బ్యాంకుల ద్వారా రుణాలు అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ బ్యాంకర్లను ఆదేశించారు. ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన (పీఎంఎస్‌బీవై)పై జిల్లాలోని ప్రజలకు విస్తృత అవగాహన కల్పించేందుకు ప్రతి బ్యాంకు శాఖలో పోస్టర్లు ఏర్పాటు చేయాలని బ్యాంకర్లను కోరారు. వివిధ సబ్సిడీ పథకాల ద్వారా మరింత మంది లబ్ధిదారులకు రుణాలు అందేలా ప్రతి నెల కనీసం రెండు రుణ మేళాలు నిర్వహించాలని సూచించారు. పల్నాడు జిల్లాలో నిర్వహించిన క్రెడిట్ ఔట్‌రీచ్ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన బ్యాంకర్లను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అభినందించినట్లు కలెక్టర్ కృతిక శుక్లా ఈ సందర్భంగా తెలిపారు. సమావేశంలో ఎల్‌డీఎం కే.ఎస్. రామ్ ప్రసాద్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ హెడ్, డీసీసీ/డీఎల్ఆర్సీ కన్వీనర్ డి. లక్ష్మీనారాయణ, నాబార్డ్ డీడీఎం శరత్, ఆర్‌బీఐ ఎల్‌డీఓ రామకృష్ణ, వివిధ బ్యాంకుల అధికారులు, లైన్ డిపార్ట్‌మెంట్ అధికారులు పాల్గొన్నారు.

EDITOR and PUBLISHER and OWNED BY NEELI RAMASUBBAIAH, PUBLISHED AT 1/702, BEHIND BHARAT PETROL PUMP, GUNTUR, A.P - 522001.PRINTED AT VSAR PUBLICATIONS178/1, ANJANEYA VAGU, KOTHAPETA,VIJAYAWADA (URBAN), N T R, A.P -520001. RNI NO : APTEL/26/A7632. Cell 90 59 58 58 98. Email : mahinewsindia@gmail.com, website : https//epaper.mahinewsindia.com

ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా జిల్లా కలెక్టర్ ను ఆశ్రయించిన బాధిత కుటుంబాలకు పరిష్కారం చూపిన

– జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్

తిరుపతి, మహి న్యూస్, సెప్టెంబర్ 08: ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా జిల్లా కలెక్టర్ ను ఆశ్రయించిన బాధిత కుటుంబాలకు జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్ పరిష్కారం చూపారు. శేషాచలం అడవుల్లో ఎర్రచందనం అక్రమ రవాణాను అడ్డుకుంటూ విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన ఇద్దరు అటవీశాఖ ఉద్యోగుల కుటుంబాలకు 13 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఇంటి స్థలాల సమస్యను జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ పరిష్కరించారు. 2013 డిసెంబర్‌లో శేషాచలం కొండల్లో ఎర్రచందనం స్మగ్లర్ల దాడిలో ప్రాణత్యాగం చేసిన డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ స్వర్గీయ ఎన్. ఆర్. శ్రీధర్, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్ స్వర్గీయ ఎన్. డేవిడ్ కరుణాకరన్ కుటుంబాలకు గతంలో కేటాయించిన భూమి న్యాయపరమైన వివాదాల్లో చిక్కుకోవడంతో ఆ కేటాయింపులు నిలిచిపోయాయి. బాధిత కుటుంబాలు ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా జిల్లా కలెక్టర్‌ను ఆశ్రయించగా, స్పందించిన జిల్లా కలెక్టర్ సదరు కుటుంబాలకు వివాదరహిత భూమిని గుర్తించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం బాధిత కుటుంబాలకు తిరుపతి అర్బన్ మండలం, మంగళం గ్రామంలోని సర్వే నంబర్ 1/1లో మొత్తం 0.10 సెంట్ల వివాదరహిత ప్రభుత్వ భూమిని గుర్తించి స్వర్గీయ ఎన్.ఆర్. శ్రీధర్ సతీమణి ఎన్. ఇందిర కు – 0.05 సెంట్లు , స్వర్గీయ ఎన్. డేవిడ్ కరుణాకరన్ సతీమణి ఎన్. హెలెన్ మేరీ కు – 0.05 సెంట్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన సిబ్బంది త్యాగాలను స్మరిస్తూ, బాధిత కుటుంబాల సంక్షేమం పట్ల జిల్లా యంత్రాంగం నిబద్ధతతో వ్యవహరించి గౌరవప్రదమైన నివాస వసతి కల్పించిందని, ఇది ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో యంత్రాంగం యొక్క బాధ్యతాయుత స్పందనకు నిదర్శనమని కలెక్టర్ పేర్కొన్నారు.

భూసేకరణ, పరిహారం చెల్లింపు ప్రక్రియను

వారం రోజుల్లో పూర్తి చేయాలి

తిరుపతి, మహి న్యూస్, సెప్టెంబర్ 8 : భూసేకరణ, పరిహారం చెల్లింపు ప్రక్రియను వేగవంతం చేసి వారం రోజుల్లో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ ఆర్ డి ఓ లను, తహశీల్దార్ లను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ లోని మిని విసి హాల్ నందు జిల్లాలో జాతీయ రహదారులు, రైల్వే తదితర లీనియర్ ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ, పరిహారం చెల్లింపులు, ఆక్రమణల తొలగింపు, ప్రభుత్వ భూముల హ్యాండోవర్ తదితర అంశాలపై రెవెన్యూ, సాంకేతిక అధికారులతో జిల్లా కలెక్టర్ జిల్లా జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావు తో కలసి ఆర్ డి ఓ లు, తహశీల్దార్ లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పుల్లంపేట, ఓబులవారిపల్లి, కోడూరు తదితర ప్రాంతాల్లో పెండింగ్‌లో ఉన్న భూసేకరణ అంశాలను సమీక్షించి, పనుల్లో ఎలాంటి అనవసర జాప్యానికి తావులేకుండా నిర్దిష్ట ప్రణాళికతో ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. తహసీల్దార్లు, సర్వేయర్లు, సైట్ ఇంజనీర్లు క్షేత్రస్థాయిలో ఉమ్మడి తనిఖీలు నిర్వహించి భూ సరిహద్దులు, విస్తీర్ణం తదితర అంశాలపై స్పష్టత తీసుకురావాలని సూచించారు. బాధితులకు చెల్లించాల్సిన పరిహారం వారి ఖాతాల్లో జమ అయ్యే వరకు, అనంతరం భూమిని ప్రాజెక్టు నిర్మాణ సంస్థకు అప్పగించే వరకు రెవెన్యూ అధికారులు పూర్తి బాధ్యత వహించాలన్నారు. పరిహారం చెల్లింపుల వివరాలను క్షేత్రస్థాయి సిబ్బందితో సరిచూసుకోవాలని సూచించారు. ప్రాథమిక పరిహారం అందిన భూముల స్వాధీనం ప్రక్రియను, భూ యజమానులు అదనపు పరిహారం కోసం అర్బిట్రేషన్‌ను ఆశ్రయించినా, నిలిపివేయరాదన్నారు. ప్రాజెక్టు పనులకు అడ్డుగా ఉన్న కట్టడాలు, ఆక్రమణలను పోలీసుల సహకారంతో తొలగించి భూమిని ఎలాంటి అడ్డంకులు లేకుండా నిర్మాణ సంస్థకు అప్పగించాలని ఆదేశించారు. ప్రభుత్వ భూముల్లో ఉన్న ఆక్రమణలు, అక్రమ విక్రయాలపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. రిజిస్ట్రేషన్ రికార్డుల్లోని పేర్లు, క్షేత్రస్థాయిలో ఉన్న వాస్తవ భూ యజమానుల మధ్య తేడాలు ఉంటే విచారించి పరిష్కరించాలని, కోర్టు కేసులు, ఎల్ఏపీపి , బ్యాంక్ అటాచ్‌మెంట్లు, ఇతర వివాదాలను ప్రత్యేకంగా పర్యవేక్షించి త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. ఖరారు చేసిన షెడ్యూల్ ప్రకారం అవార్డు విచారణ ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని, భూ రికార్డులు, రిజిస్ట్రేషన్లకు సంబంధించిన న్యాయపరమైన లేదా సాంకేతిక సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి నిబంధనల మేరకు వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. భూసేకరణ, అడ్డంకుల తొలగింపు పనులను వారం రోజుల్లోగా పూర్తి చేసి, ప్రాజెక్టు నిర్మాణానికి అవసరమైన భూములను త్వరితగతిన అప్పగించాలని సంబంధిత తహసీల్దార్లకు స్పష్టం చేశారు.

లెప్రసీ కేసు డిటెక్షన్ క్యాంపెయిన్ విజయవంతానికి సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలి

చిత్తూరు, మహి న్యూస్, సెప్టెంబర్ 08 : లెప్రసీ కేసు డిటెక్షన్ క్యాంపెయిన్ విజయవంతానికి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని, జిల్లాలో లెప్రసీ కేసు డిటెక్షన్ క్యాంపెయిన్ (ఎల్సీడీసీ) కార్యక్రమాన్ని ఈ నెల 11 వ తేది నుండి 24 వ తేది వరకు 14 రోజుల పాటు విస్తృతంగా నిర్వహించనున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ అధ్యక్షతన జిల్లా సమన్వయ కమిటీ (డిస్ట్రిక్ట్ కోఆర్డినేషన్ కమిటీ – డీసీసీ) సమావేశం జిల్లా కలెక్టర్ ఛాంబర్లో నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి అధ్వర్యంలో ఎల్సీడీసీ కార్యక్రమానికి సంబంధించిన కార్యాచరణ, శాఖల వారీగా చేపట్టాల్సిన చర్యలు, ఇంటింటి సర్వే నిర్వహణ, అనుమానిత కేసుల గుర్తింపు, చికిత్స మరియు ప్రజల్లో అవగాహన కల్పించే అంశాలపై చర్చించడం జరిగింది. ఈ సంధర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, లెప్రసీ వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించి చికిత్స అందించడం ద్వారా అంగవైకల్యాన్ని నివారించవచ్చని తెలిపారు. జిల్లాలో లెప్రసీ కేసులను గుర్తించి, వ్యాధి వ్యాప్తిని నియంత్రించేందుకు అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. 2017 సంవత్సరం నుండి లెప్రసీ కేసు డిటెక్షన్ క్యాంపెయిస్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్, గ్రామీణ మరియు పట్టణాభివృద్ధి, మహిళా మరియు శిశు సంక్షేమం, సాంఘిక సంక్షేమం తదితర శాఖల సహకారంతో గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల్లో ఇంటింటి శోధన కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. విద్యాశాఖ అధికారులు జిల్లాలోని అన్ని పాఠశాలల్లో ప్రార్థనా సమయంలో విద్యార్థులకు లెప్రసీ వ్యాధి పై అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. లెప్రసీ వ్యాధి లక్షణాలు, వ్యాధి నివారణ, అందుబాటులో ఉన్న చికిత్సా విధానాలు మరియు ప్రభుత్వం అందించే ఉచిత మందుల గురించి విద్యార్థులకు తెలియజేయాలని, అవసరమైన కరపత్రాలను పంపిణీ చేయాలని ఆదేశించారు. వైద్య మరియు ఆరోగ్య శాఖకు చెందిన ఎఎన్ ఎం లు, ఆశా కార్యకర్తలు మరియు మేల్ వాలంటీర్స్ ఇంటింటి శోధన కార్యక్రమంలో చురుకుగా పాల్గొని ప్రజలకు లెప్రసీ వ్యాధిపై అవగాహన కల్పించాలని సూచించారు. చర్మంపై స్పర్శ లేని మచ్చలు, పొడిబారిన లేదా రాగి రంగు మచ్చలు, చర్మంపై స్పర్శ తగ్గడం, నరాలు మందంగా కావడం వంటి అనుమానాస్పద లక్షణాలు ఉన్న వ్యక్తులను గుర్తించి, వారిని సమీపంలోని ఆరోగ్య కేంద్రానికి తీసుకువెళ్లి వైద్య పరీక్షలు చేయించాలని తెలిపారు. అనుమానిత కేసులను నిర్ధారించిన అనంతరం అవసరమైన చికిత్సను వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలోని అన్ని గ్రామ సచివాలయాలు మరియు గ్రామ పంచాయతీల పరిధిలో స్పర్శ్ లెప్రసీ అవగాహన కార్యక్రమం నిర్వహించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఐఈసీ సామగ్రి, పోస్టర్లు మరియు కరపత్రాలను ఉపయోగించి ప్రజల్లో లెప్రసీ వ్యాధిపై అవగాహన పెంచాలని సూచించారు. సీడీపీఓలు మరియు ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు పరస్పర సమన్వయంతో ఇంటింటి శోధన కార్యక్రమాన్ని పర్యవేక్షించి విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. జిల్లా కుష్ఠు, ఎయిడ్స్ మరియు టీబీ అధికారి మాట్లాడుతూ ఈ నెల 11 వ తేది నుండి 24 వ తేది వరకు నిర్వహించే ఎల్సీడీసీ కార్యక్రమం ద్వారా జిల్లాలోని ప్రతి కుటుంబాన్ని సందర్శించి లెప్రసీ వ్యాధి లక్షణాల పై అవగాహన కల్పించడంతో పాటు, అనుమానిత కేసులను గుర్తించి, నిర్ధారణ మరియు చికిత్సకు అనుసంధానం చేస్తామని జిల్లా కలెక్టర్ కు వివరించారు. లెప్రసీ వ్యాధి గురించి సమాజంలో ఉన్న అపోహలు మరియు వివక్షను తొలగించాల్సిన అవసరం ఉందని తెలిపారు. లెప్రసీ పాపం లేదా శాపం వల్ల వచ్చే వ్యాధి కాదని, ప్రారంభ దశలో గుర్తించి సరైన బహుళ ఔషధ చికిత్స (ఎండిటీ) తీసుకుంటే పూర్తిగా నయం చేయవచ్చని ప్రజలకు తెలియజేయాలని సూచించారు. ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలలో లెప్రసీకి సంబంధించిన మందులు ఉచితంగా అందుబాటులో ఉన్నాయని, ప్రజలు ఎటువంటి భయం లేదా సంకోచం లేకుండా సమీపంలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని ఆయన కోరారు. ప్రారంభ దశలోనే లెప్రసీని గుర్తించి చికిత్స అందించడం ద్వారా వ్యాధి వల్ల కలిగే అంగవైకల్యాన్ని నివారించవచ్చని తెలిపారు. "చేతులు కలపండి -కుష్ఠు వ్యాధిని నిర్మూలించండి" అనే సందేశంతో ప్రతి ఒక్కరూ లెప్రసీ వ్యాధిపై అవగాహన పెంచుకోవాలని అధికారులు పిలుపునిచ్చారు. లెప్రసీ వ్యాధి ఉన్న వ్యక్తులను వివక్షకు గురిచేయకుండా, వారికి గౌరవం మరియు సహకారం అందించాలని, వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే సమీపంలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో వైద్య పరీక్షలు చేయించుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మహాత్మా గాంధీజీ కలలుగన్న కుష్ఠు వ్యాధి రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని అధికారులు కోరారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎస్.నాగ శశి భూషణ్ రెడ్డి, జిల్లా కుష్ఠు, ఎయిడ్స్ మరియు టీబీ అధికారి డా. జి. వెంకట ప్రసాద్, డి సి హెచ్ ఎస్ డా. పద్మాంజలి దేవి, ఎస్ సి/బి సి వెల్ఫేర్ అధికారి రబ్బాని బాషా, డి ఎల్ డి ఓ రెప్రెసెంటేటివ్ జి. వి. చలపతి రెడ్డి, డిఐ ఓ ఇంచార్జ్ డా. అనూష, జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ ఇంచార్జ్ డా.ప్రవీణ, డిప్యూటి విద్యా శాఖ అధికారి ఇందిరా, జిల్లా ఆశా కో ఆర్డినేటర్ మూర్తి, జిల్లా న్యూక్లియస్ టీం సభ్యులు, లెప్రసీ వార్డు వైద్యులు డా. సాయి షర్మిల, డా. జానకి రావ్, ఫిసియోథెరఫీస్ట్ డి. జాన్, డి పి ఎం ఓ తిరుజ్ఞానం, డి.కనికరాజు మరియు ఇతర సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములపై 'రెవెన్యూ ఆట'..!

5 సర్వే నంబర్లు.. 2 ఎకరాల 40 సెంట్లు.. కోట్ల విలువైన ప్రభుత్వ ఆస్తి రికార్డుల్లో 'అనుభవం'.. వెనుక అసలు వ్యవహారం ఏమిటి? పేదలకు దక్కాల్సిన భూములు పెద్దల చేతుల్లోకి వెళ్లాయా..? జిల్లా స్థాయి విచారణకు నాయుడుపేట ప్రజల డిమాండ్

నాయుడుపేట, సెప్టెంబర్ 08, 2026

మహి న్యూస్ – ప్రత్యేక దర్యాప్తు కథనం

నాయుడుపేట పట్టణంలో ప్రభుత్వ భూముల వ్యవహారం ఇప్పుడు తీవ్ర చర్చకు దారితీస్తోంది. ఒకటి కాదు.. రెండు కాదు.. 5 సర్వే నంబర్ల పరిధిలో సుమారు 2 ఎకరాల 40 సెంట్ల విలువైన ప్రభుత్వ భూములపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వానికి చెందిన కోట్ల రూపాయల విలువైన భూములు అసలు ఏ ప్రాతిపదికన వ్యక్తుల చేతుల్లోకి వెళ్లాయి? అర్హత ఉన్న పేదలకు కేటాయించాల్సిన భూములు ఆర్థికంగా బలమైన వ్యక్తులకు ఎలా చేరాయి? రెవెన్యూ రికార్డుల్లో మార్పులు జరిగాయా? అనుభవ ధ్రువీకరణ పత్రాలు ఏ ఆధారాలతో జారీ అయ్యాయి? అనే ప్రశ్నలు ఇప్పుడు నాయుడుపేటలో హాట్ టాపిక్‌గా మారాయి.

5 సర్వే నంబర్లు.. 2.40 ఎకరాలు.. ఎవరి కోసం?

అగ్రహారపేట, కోళ్లఫారం ప్రాంతం, విశాల్ మార్ట్ వెనుక, పుదూరు, తుమ్మూరు, పావని హోటల్ పరిసర ప్రాంతాల్లోని ప్రభుత్వ భూములకు సంబంధించి వివిధ ఆరోపణలు వెలుగులోకి వస్తున్నాయి. సుమారు 18 అంకణాల నుంచి 30 అంకణాల వరకు ఒక్కొక్కరికి స్థలాలు అందినట్లు స్థానికంగా ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఇక్కడే అసలు ప్రశ్న మొదలవుతోంది.

ఒక పేద కుటుంబానికి ప్రభుత్వ భూమి కావాలంటే అర్హతలు, దరఖాస్తులు, పరిశీలనలు.. మరి కొందరికి మాత్రం ప్రభుత్వ భూమిపై 'అనుభవం' ఎలా ఏర్పడింది?

ఈ ప్రశ్నకు రెవెన్యూ శాఖ రికార్డులే సమాధానం చెప్పాల్సి ఉంది.

'ఆటోగ్రాఫ్'లా రికార్డులు మారాయా?

ప్రభుత్వ భూములపై కొందరికి అనుభవ హక్కులు కల్పించే ప్రక్రియలో నిబంధనలు పాటించలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పాత రికార్డులు, అనుభవ ధ్రువీకరణ పత్రాలు, సర్వే వివరాలు, రెవెన్యూ నమోదు ప్రక్రియలను పూర్తిగా పరిశీలిస్తే అసలు విషయం బయటపడుతుందని ప్రజలు అంటున్నారు.

రికార్డుల్లో ఒకరి పేరు ఎలా వచ్చింది?

ఏ అధికారి సిఫారసు చేశారు?



ఎప్పుడు ధ్రువీకరణ జరిగింది?

భూమి ప్రభుత్వానిదే అయితే వ్యక్తిగత అనుభవం ఎలా ఏర్పడింది?

ఇలాంటి ప్రశ్నలకు అధికారిక సమాధానాలు రావాల్సిన అవసరం ఉంది.

లంచాల ఆరోపణలపై విచారణ ఎప్పుడు?

ప్రభుత్వ భూముల వ్యవహారంలో భారీ మొత్తాల్లో లంచాలు చేతులు మారాయనే ఆరోపణలు కూడా స్థానికంగా వినిపిస్తున్నాయి. అయితే ఈ ఆరోపణల్లో వాస్తవం ఎంత? ఎవరి వద్దకు డబ్బు వెళ్లింది? ఎవరు మధ్యవర్తులుగా వ్యవహరించారు? ఏ స్థాయిలో నిర్ణయాలు జరిగాయి? అన్నది స్వతంత్ర దర్యాప్తు ద్వారానే తేలాల్సిన విషయం. ఆరోపణలు నిజమైతే ప్రభుత్వ భూమిని వ్యక్తిగత ప్రయోజనాలకు ఉపయోగించిన వారితో పాటు, వారికి సహకరించిన అధికారులపై కూడా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

నిరుపేద గిరిజనులకు స్థలం లేదా?

నాయుడుపేట అమరావతి సెంటర్ వెనుక పెద్ద చెరువు కట్ట ప్రాంతంలో పలువురు నిరుపేద గిరిజన కుటుంబాలు కనీస వసతులు లేకుండా జీవిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. వర్షం వస్తే దేరాల్లోకి నీరు చేరే పరిస్థితి. చిన్న పిల్లలతో కలిసి ఇబ్బందులు పడుతున్న కుటుంబాలు. తలదాచుకోవడానికి శాశ్వత నివాసం లేని దుస్థితి.ఇలాంటి పరిస్థితుల్లో ఉన్న కుటుంబాలకు ప్రభుత్వ భూమి ఎందుకు దక్కడం లేదు?

పేదలకు భూమి లేదంటారు..

మరి కోట్ల విలువైన ప్రభుత్వ భూములు ఎవరికి వెళ్తున్నాయి?

ఈ ప్రశ్నకు జిల్లా యంత్రాంగం సమాధానం చెప్పాల్సిన సమయం ఆసన్నమైంది. పేదలు లంచం ఇవ్వలేరా..?

ప్రభుత్వ భూమి పేదల హక్కు కావాలి. కానీ ఆర్థికంగా బలహీనమైన కుటుంబాలు అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేకుండా, పలుకుబడి ఉన్నవారికి మాత్రం విలువైన స్థలాలు దక్కుతున్నాయనే ఆరోపణలు నిజమైతే అది అత్యంత తీవ్రమైన విషయం.ప్రభుత్వ ఆస్తులు వ్యక్తిగత ఆస్తులుగా మారకుండా కాపాడాల్సిన బాధ్యత రెవెన్యూ అధికారులపై ఉంది.

ఆర్డీఓ పాత్రపై కూడా స్పష్టత అవసరం

ఈ వ్యవహారాలకు సంబంధించి మండల స్థాయి అధికారులతో పాటు ఆర్డీఓ స్థాయిలో ఎలాంటి నిర్ణయాలు జరిగాయనే అంశంపైనా సమగ్ర విచారణ జరగాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు.ఎవరిపైనా ముందస్తుగా నేరారోపణ చేయకుండా, సంబంధిత రికార్డులను పరిశీలించి బాధ్యత ఎవరిదో నిర్ధారించాలని ప్రజలు కోరుతున్నారు.

కలెక్టర్ సార్.. ఒక్కసారి రికార్డులు చూడండి! జిల్లా కలెక్టర్‌కు అందుబాటులో ఉన్న అధికార యంత్రాంగం, రెవెన్యూ రికార్డులు, సర్వే శాఖ వివరాలు, భూముల ప్రస్తుత స్థితి, గతంలో జారీ చేసిన ధ్రువీకరణ పత్రాలను పరిశీలిస్తే వాస్తవాలు వెలుగులోకి వచ్చే

అవకాశం ఉంది.5 సర్వే నంబర్లు..

2 ఎకరాల 40 సెంట్లు..

కోట్ల విలువైన ప్రభుత్వ భూములు..

ఈ భూముల పూర్తి వివరాలను జిల్లా స్థాయిలో పునఃపరిశీలించి, అవకతవకలు జరిగి ఉంటే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.ఆరోపణలు నిజం కాకపోతే అధికారిక విచారణ ద్వారా వాస్తవాలను ప్రజలకు తెలియజేయాలి. నిజం ఉంటే ప్రభుత్వ భూమిని తిరిగి ప్రభుత్వ అధీనంలోకి తీసుకురావాలి.ప్రభుత్వ భూమి ఎవరి వ్యక్తిగత ఆస్తి కాదు.. అది ప్రజల ఆస్తి.ప్రజల ఆస్తిని కాపాడడంలో జిల్లా యంత్రాంగం విఫలమైతే.. భవిష్యత్ తరాలకు మిగిలేది ప్రభుత్వ భూములు కాదు.. కేవలం రికార్డుల్లో కనిపించే సర్వే నంబర్లే అనే ఆందోళన స్థానికుల్లో వ్యక్తమవుతోంది.

భక్తులందరికీ సులభ దర్శనం కల్పించడమే లక్ష్యంగా టీటీడీతో సమన్వయంతో

అన్ని చర్యలు చేపడుతున్నాం :జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్

తిరుపతి, మహి న్యూస్, సెప్టెంబర్ 08: తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు సెప్టెంబర్ 15 నుంచి 23 వరకు, నవరాత్రి బ్రహ్మోత్సవాలు అక్టోబర్ 13 నుంచి నిర్వహించనున్న నేపథ్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా టీటీడీతో సమన్వయంతో విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ తెలిపారు. మంగళవారం తిరుపతి అలిపిరి సమీపంలోని భూ దేవి కాంప్లెక్స్ నందు శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు మరియు నవరాత్రి బ్రహ్మోత్సవాల నిర్వహణ ఏర్పాట్ల పై జిల్లా ఎస్పి ఎల్.సుబ్బారాయుడు,టిటిడిఅడిషనల్ ఈఓ సి.హెచ్.వెంకయ్యచౌదరి, టిటిడి సివిఎస్ఓ కె.వి.మురళికృష్ణ, తిరుపతి మున్సిపల్ కమిషనర్ ఎం.జయకృష్ణ తో కలసి జిల్లా కలెక్టర్ పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ ఏడాది తిరుమల శ్రీవారి సాలకట్ల మరియు నవరాత్రి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై టీటీడీ ఈవో అధ్వర్యంలో సన్నాహక సమావేశాలు నిర్వహించడంతో పాటు క్షేత్రస్థాయి పరిశీలనలు పూర్తి చేసినట్లు తెలిపారు. బ్రహ్మోత్సవాల తొలిరోజు ముఖ్యమంత్రి తిరుమలలో శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పించనున్నారన్నారు. భక్తుల వాహన రద్దీని నియంత్రించేందుకు తిరుపతిలో అలిపిరి చెక్‌పాయింట్, జూ పార్క్ సమీపంలోని టీటీడీ స్థలాలు, నెహ్రూ మున్సిపల్ హైస్కూల్ తదితర ప్రాంతాల్లో పార్కింగ్, హోల్డింగ్ పాయింట్లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. తిరుమల రద్దీని కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా పర్యవేక్షిస్తూ, అవసరమైన సమయంలో భక్తులను హోల్డింగ్ పాయింట్లలో నిలిపి, అక్కడ ఏర్పాటు చేసే ఎల్ఈడీ స్క్రీన్ల ద్వారా వాహన సేవలను ప్రత్యక్ష ప్రసారం చేయడం జరిగిందన్నారు. భక్తులకు తాగునీరు, ఆహారం, ఉచిత భోజనం, టాయిలెట్ మరియు పారిశుధ్య సౌకర్యాలు కల్పించడం జరుగుతుందన్నారు. పెరటాసి మాసాన్ని దృష్టిలో ఉంచుకొని తమిళనాడు, బెంగళూరు, హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల కోసం తిరుపతి నగర శివార్లలో మరో మూడు ప్రత్యేక హోల్డింగ్ పాయింట్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. తిరుపతి నగరం, పరిసర పంచాయతీల్లో పారిశుధ్య కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టడంతో పాటు విద్యుత్ అలంకరణలు చేపడుతున్నామన్నారు. 5వ రోజు జరిగే గరుడ సేవకు సుమారు 3.5--4 లక్షల మంది భక్తులు, 12,000--13,000 వాహనాలు వచ్చే అవకాశం ఉన్నందున తిరుమల, తిరుపతిలో తగిన పార్కింగ్ ఏర్పాట్లు చేశారు. జిల్లా ఎస్పి మాట్లాడుతూ రాబోయే వినాయక చవితి ఉత్సవాలు మరియు శ్రీవారి బ్రహ్మోత్సవాలలో భాగంగా సెప్టెంబర్ 19న నిర్వహించనున్న గరుడ సేవ నేపథ్యంలో పోలీస్, రెవెన్యూ శాఖల అధికారులతో సమన్వయంగా ఏర్పాట్లు చేయడం జరుగుతుందన్నారు. ఉత్సవాలు ప్రశాంతంగా, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిర్వహించేందుకు అధికారులకు పలు సూచనలు చేసినట్లు పేర్కొన్నారు. వినాయక విగ్రహాల నిమజ్జన కార్యక్రమాలను పండగ ప్రారంభమైన మొదటి రోజు లేదా మూడో రోజు లోపు పూర్తి చేసుకునేలా ఉత్సవ కమిటీ నిర్వాహకులు చర్యలు తీసుకోవాలని సూచించారు. గరుడ సేవ రోజు రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున ట్రాఫిక్ రద్దీని దృష్టిలో ఉంచుకుని నిమజ్జనాలను ముందుగానే పూర్తి చేసుకోవాలని కోరారు. గరుడసేవ జరిగే ఐదో రోజున విగ్రహాల నిమజ్జన కార్యక్రమాలు చేపట్టకుండా, మిగతా రోజుల్లో నిమజ్జన ఏర్పాట్లు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వినాయక చవితి, శ్రీవారి బ్రహ్మోత్సవాలను భక్తులు ప్రశాంతమైన వాతావరణంలో ఆనందంగా గడిపేలా శాంతిభద్రతలు, ట్రాఫిక్ నియంత్రణకు అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నట్లు ఎస్.పి. సుబ్బరాయుడు తెలిపారు. టిటిడి సివిఎస్ఓ మాట్లాడుతూ తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో భక్తుల భద్రత, రవాణా, పార్కింగ్ సౌకర్యాలపై జిల్లా పోలీస్, రెవెన్యూ, టీటీడీ అధికారులు సమన్వయంతో ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. తిరుమలలో పరిమితంగా ఉన్న పార్కింగ్ సౌకర్యాలను దృష్టిలో ఉంచుకొని తిరుపతిలోని వివిధ ప్రాంతాల్లో విస్తృత పార్కింగ్ స్థలాలను సిద్ధం చేస్తున్నామన్నారు. తిరుపతిలో వాహనాలు నిలిపే భక్తులను తిరుమలకు తరలించేందుకు ఆర్టీసీతో సమన్వయంతో ప్రత్యేక రవాణా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. భక్తుల భద్రతను దృష్టిలో ఉంచుకొని అలిపిరి టోల్‌గేట్, అలిపిరి నడకదారి, శ్రీవారి మెట్టు మార్గాల్లో స్క్రీనింగ్ వ్యవస్థను మరింత కట్టుదిట్టం చేశామన్నారు. విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ, పోలీస్, ఎస్ఎస్ఎఫ్ సిబ్బందిని అదనంగా మోహరించామన్నారు. అలిపిరి వద్ద ూూఎ=, ఖీ=ూ కెమెరాలను ఏర్పాటు చేసి, తిరుమల ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం చేశామన్నారు. అనుమానితుల కదలికలను గుర్తించి వెంటనే అప్రమత్తం అయ్యేలా నిఘా వ్యవస్థను ఏర్పాటు చేశామన్నారు. తిరుమలతో పాటు తిరుపతిలో ప్రత్యేక సబ్-కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసి ప్రధాన కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం చేయడం జరిగిందన్నారు. తిరుమలకు వచ్చే వాహనాల సంఖ్యను ఖచ్చితంగా నమోదు చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామన్నారు.

పనులు 40 లక్షలకు-బిల్లులు కోటి 20 లక్షలకు

చెరువు పనుల్లో భారీ దోపిడీకి ఉమ్మడి స్కెచ్.

ఓజిలి, సెప్టెంబర్ 8, మహి న్యూస్: ప్రజాధనానికి రెక్కలు తొడుగుతూ, అధికారులతో కలిసి అధికార పార్టీ నాయకులు భారీ దోపిడీకి తెగబడ్డారు. తిరుపతి జిల్లా ఓజిలి మండలం సగటూరు చెరువు పనుల పేరిట నయా దోపిడీ పర్వానికి తెరలేపారు. కేవలం రూ. 40 లక్షల అంచనా వ్యయంతో పూర్తయ్యే చెరువు పనులకు ఏకంగా రూ. 1.20 కోట్ల ప్రభుత్వ ధనాన్ని కేటాయించి, ప్రజాధనాన్ని విచ్చలవిడిగా దోచుకునేందుకు పథకం రచించారు. నిజానికి రూ.

RNI : APTEL/25/A0108
మహా న్యూస్
www.mahinewsindia.com
epaper: https://epaper.mahinewsindia.com
తెలుగు దినపత్రిక

వినాయక నిమజ్జనానికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు

హంద్రీనీవాలో 3 ప్రాంతాల్లో నిమజ్జనానికి అవకాశాలు: మంత్రి టీజీ భరత్

ప్రస్తుత పరిస్థితిని ప్రజలకు వివరించిన మంత్రి

కర్నూలు, సెప్టెంబర్ 8: మహి న్యూస్: తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో కర్నూలులో వినాయక నిమజ్జనానికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నట్లు రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ తెలిపారు. సుంకేసులలో నీటి లభ్యత లేకపోవడంతో ప్రస్తుతం కే.సీ. కెనాల్‌కు నీటిని విడుదల చేసే పరిస్థితి లేదన్నారు. హంద్రీనీవాలో నన్నూరు టోలోగేట్, తడకనపల్లె, ఉలిందకొండ ప్రాంతాల్లో వినాయక నిమజ్జనానికి ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. ఈ మూడు ప్రాంతాల్లో ఒక ప్రాంతాన్ని వినాయక నిమజ్జన కమిటీ ఎంపిక చేస్తే, కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేస్తామని చెప్పారు. ప్రస్తుతం మరో 12 నుంచి 14 రోజుల వరకు హంద్రీనీవాకు నీటిని తీసుకునే అవకాశం ఉందని తెలిపారు. 5వ, 7వ, 9వ రోజుల్లో నిమజ్జనానికి అవకాశం ఉండగా, 5వ, 7వ రోజులు నీటి లభ్యత ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున అనుకూలంగా ఉంటాయని పేర్కొన్నారు. ప్రజలు ఒక అడుగు నుంచి అడుగున్నర పరిమాణంలో మట్టి విగ్రహాలను మాత్రమే ఏర్పాటు చేసుకోవాలని మంత్రి సూచించారు. చిన్న విగ్రహాలను ఇంటి వద్దే నిమజ్జనం చేసుకోవచ్చన్నారు. పెద్ద విగ్రహాలను కమిటీ, అధికారులు ఎంపిక చేసిన ప్రాంతాల్లో నిమజ్జనం చేయాలని తెలిపారు. వర్షాలు కురవాలని రాష్ట్రవ్యాప్తంగా వరుణ యాగం నిర్వహించడంపై కేబినెట్‌లో చర్చించినట్లు చెప్పారు. కర్నూలులో గాయత్రి గోసేవ సమితి ఆధ్వర్యంలో వరుణ యాగం నిర్వహించనున్నట్లు తెలిపారు. వర్షాలు కురిసి సుంకేసులకు నీరు చేరితే కే.సీ. కెనాల్‌కు నీటిని విడుదల చేసే అవకాశం ఉంటుందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో కే.సీ. కెనాల్‌లో నిమజ్జనానికి అవకాశం లేదని ప్రజలు అర్థం చేసుకుని ప్రత్యామ్నాయ ఏర్పాట్లకు సహకరించాలని మంత్రి టీజీ భరత్ కోరారు.

కొత్త పెన్షన్ దరఖాస్తుల స్వీకరణలో ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలి

అర్హులైన ప్రతి ఒక్కరూ పెన్షన్‌కు దరఖాస్తు చేసుకోవాలి

జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి

కర్నూలు, సెప్టెంబర్ 8: మహి న్యూస్ : పెన్షన్‌కు అర్హులైన ప్రతి ఒక్కరి నుంచి దరఖాస్తులు స్వీకరించి, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి కొత్త పెన్షన్ దరఖాస్తుల స్వీకరణపై మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, డీఆర్‌డీవే, స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు అధికారులు, సంబంధిత శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు. పెన్షన్ దరఖాస్తుల ప్రక్రియను రోజువారీగా పర్యవేక్షించి, ప్రతిరోజూ నివేదిక అందించాలని అధికారులను ఆదేశించారు. స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు కార్యాలయాల్లో డిజిటల్ అసిస్టెంట్లు తప్పనిసరిగా అందుబాటులో ఉండి దరఖాస్తుదారులకు మార్గనిర్దేశం చేయాలని సూచించారు. ప్రజలు క్యూ కట్టకుండా అవసరమైన చోట అదనపు సిబ్బందితో పాటు నాలుగు కంప్యూటర్లను ఏర్పాటు చేసి దరఖాస్తుల స్వీకరణను వేగవంతం చేయాలన్నారు.

మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో పెన్షన్ దరఖాస్తులకు అవసరమైన హౌస్ ట్యాక్స్ పత్రాల జారీలో ఎలాంటి జాప్యం జరగకుండా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. దరఖాస్తుల గడువు తక్కువగా ఉన్నందున వచ్చే వారం రోజులను అత్యంత ప్రాధాన్యతతో వినియోగించుకోవాలన్నారు. దరఖాస్తుదారుల అర్హతను పూర్తిస్థాయిలో పరిశీలించి, అవసరమైన ధ్రువపత్రాలు సక్రమంగా ఉన్నాయో లేదో తనిఖీ చేయాలని సూచించారు. అర్హత లేని వారికి పెన్షన్ మంజూరు చేయకూడదని స్పష్టం చేశారు. ముందస్తు పరిశీలన పూర్తి చేసి, వెరిఫికేషన్ అనంతరం అర్హుల జాబితాను వెంటనే ప్రచురించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పెన్షన్ దరఖాస్తుదారులకు అవసరమైన వైద్య ధ్రువపత్రాలను అదే రోజు జారీ చేసేలా చర్యలు తీసుకోవాలని జీజీహెచ్ సూపరింటెండెంట్, డీసీహెచ్ఎస్‌లను ఆదేశించారు. ఆన్‌లైన్‌లో సాంకేతిక సమస్యల కారణంగా జాప్యం జరిగే అవకాశం ఉంటే ముందుగా మాన్యువల్‌గా ధ్రువపత్రాలు జారీ చేసి, అనంతరం ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. దరఖాస్తుల స్వీకరణ, సర్టిఫికెట్ల జారీ, సాంకేతిక సమస్యలకు సంబంధించి ఏ ఇబ్బంది ఎదురైనా వెంటనే తన దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

నకిలీ ఇన్వెస్ట్‌మెంట్ యాప్స్‌తో సైబర్ మోసాలు

హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ పేరుతో నకిలీ యాప్స్, ఏపీకే ఫైల్స్ పట్ల జాగ్రత్త

తెలియని లింకులను క్లిక్ చేసి మోసపోవద్దు



కర్నూలు, సెప్టెంబర్ 8: మహి న్యూస్: సోషల్ మీడియా, వాట్సాప్, టెలిగ్రామ్‌లలో హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ పేరుతో లేదా ఆ సంస్థ లోగోను ఉపయోగించి ప్రచారం చేస్తున్న నకిలీ ఇన్వెస్ట్‌మెంట్ యాప్స్, ఏపీకే ఫైల్స్ లింకుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కర్నూలు ఎస్పీ శ్రీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ సూచించారు. సైబర్ నేరగాళ్లు తొలుత చిన్న మొత్తంలో పెట్టుబడి పెట్టించి, యాప్‌లో అధిక లాభాలు వచ్చినట్లు చూపిస్తూ బాధితుల్లో నమ్మకం కలిగిస్తారని తెలిపారు. అనంతరం పెద్ద మొత్తంలో పెట్టుబడి పెట్టించిన తర్వాత డబ్బు ఉపసంహరించుకోవాలంటే ట్యాక్స్, ఛార్జీలు తదితర కారణాలు చెబుతూ మరింత డబ్బు చెల్లించాలని చెప్పి మోసాలకు పాల్పడుతున్నారని వివరించారు. సోషల్ మీడియా, వాట్సాప్, టెలిగ్రామ్‌ల ద్వారా వచ్చే అనుమానాస్పద ఇన్వెస్ట్‌మెంట్ లింకులను క్లిక్ చేయవద్దని, తెలియని ఏపీకే ఫైల్స్, యాప్స్‌ను ఇన్‌స్టాల్ చేయవద్దని ఎస్పీ సూచించారు. యాప్ అధికారికమైనదో కాదో నిర్ధారించుకోవడంతో పాటు, సంబంధిత సంస్థ సెబీ రిజిస్ట్రేషన్ వివరాలను ధృవీకరించుకోవాలని తెలిపారు. అధిక లాభాలు, గ్యారంటీడ్ రిటర్న్స్ ఇస్తామని చెప్పేవారిని నమ్మవద్దని, పెట్టుబడి పెట్టే ముందు పూర్తి వివరాలను పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని ఎస్పీ సూచించారు. సైబర్ మోసానికి గురైన వెంటనే 1930కు కాల్ చేసి, సైబర్ క్రైమ్ వెబ్‌సైట్ ద్వారా ఫిర్యాదు చేయాలని జిల్లా ప్రజలకు సూచించారు.

శుభకార్యాలకు అనుమతి తప్పనిసరి

అధిక జనంతో కార్యక్రమాల నిర్వహణకు 48 గంటల ముందు అనుమతి తీసుకోవాలి

చెత్త సేకరణకు ప్రత్యేక ట్రాలీ ఏర్పాటు.. త్వరలో మరో 10 ఈ-ఆటోలు

నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు

కర్నూలు, సెప్టెంబర్ 8: మహి న్యూస్: నగరంలో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొనే పెళ్లిళ్లు, పుట్టినరోజులు, ఇతర శుభకార్యక్రమాలను నిర్వహించే ఫంక్షన్ హాళ్ల యాజమాన్యాలు, నిర్వాహకులు తప్పనిసరిగా 48 గంటల ముందు రూ.2,000 రుసుము చెల్లించి నగరపాలక సంస్థ నుంచి అనుమతి పొందాలని కమిషనర్ చల్లా ఓబులేసు తెలిపారు. కార్యక్రమాల సమయంలో పెద్ద మొత్తంలో ఉత్పత్తయ్యే చెత్తను సక్రమంగా సేకరించేందుకు ప్రత్యేక ట్రాలీ ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. వివరాలకు 9849908486 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. మంగళవారం వినాయక ఘాట్ వద్ద జరుగుతున్న పారిశుద్ధ్య పనులను కమిషనర్ పరిశీలించారు. అయ్యప్పస్వామి ఆలయం వెనుక టీ దుకాణం వద్ద వ్యర్థాలను కే.సీ. కెనాల్‌లో వేస్తుండటంపై ఆగ్రహం వ్యక్తం చేసి, కాలువలో చెత్త వేయకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం గ్రీన్ పార్క్ వద్ద బండ్‌పై నిర్మించిన సీసీ రహదారిని, ప్రభుత్వ ఆసుపత్రిలోని అన్న క్యాంటీన్‌ను పరిశీలించి పరిసరాల పరిశుభ్రతపై సిబ్బందికి సూచనలు చేశారు. వెంకటరమణ కాలనీలో విశాల్ మార్ట్ వెనుక ఏర్పాటు చేసిన విద్యుత్ చెత్త సేకరణ ఆటోల పార్కింగ్, చార్జింగ్, చెత్త బదిలీ ప్రదేశాలను పరిశీలించారు. ప్రస్తుతం 30 విద్యుత్ ఆటోలు వినియోగంలో ఉన్నాయని, త్వరలో మరో 10 ఈ-ఆటోలు అందుబాటులోకి రానున్నాయని తెలిపారు. వీటి ద్వారా చెత్త సేకరణను మరింత సమర్థవంతంగా నిర్వహిస్తామని చెప్పారు. శుభకార్యాలు, భారీ కార్యక్రమాల సమయంలో చెత్తను ఎక్కడపడితే అక్కడ పడవేస్తే సంబంధిత వారిపై చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు. నగర పరిశుభ్రతను కాపాడేందుకు ప్రజలు, ఫంక్షన్ హాళ్ల యాజమాన్యాలు నగరపాలక సంస్థకు సహకరించాలని కోరారు.



ప్రభుత్వ లక్ష్యాలను కచ్చితంగా సాధించాలి

అన్ని శాఖలు నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలి

వాటర్ సెక్యూరిటీ, సహజ వ్యవసాయంపై ప్రత్యేక దృష్టి

పరిశ్రమలు, పర్యాటక అభివృద్ధికి వేగంగా చర్యలు

10 రోజుల్లోగా యాక్షన్ టేకెన్ రిపోర్ట్ సమర్పించాలి

జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి

కర్నూలు, సెప్టెంబర్ 08 (మహి న్యూస్): ఆయా శాఖలు ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను కచ్చితంగా సాధించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ల కాన్ఫరెన్స్ సూచనల అమలు, కేంద్ర ప్రాయోజిత పథకాల అమలుపై జిల్లా కలెక్టర్ సమగ్ర సమీక్ష నిర్వహించారు. స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలకు స్పష్టమైన రోడ్‌మ్యాప్, ప్రత్యేక వ్యూహాలను రూపొందించాలని కలెక్టర్ ఆదేశించారు. కెపాసిటీ బిల్డింగ్ శిక్షణలను నిర్దిష్ట సమయంలో నిర్వహించడంతో పాటు పరిశ్రమలతో భాగస్వామ్యాన్ని బలోపేతం చేయాలని సూచించారు. జిల్లాలో భూగర్భ జలాల పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని వాటర్ సెక్యూరిటీకి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. అవసరమైన చోట కొత్త బోర్ల తవ్వకానికి బదులుగా అందుబాటులో ఉన్న నీటి వనరులను సంరక్షించడం, చెరువులను నింపడం, డీపెనింగ్, ఫ్లషింగ్ వంటి చర్యలు చేపట్టాలని సూచించారు. జలధార, జలహారతి కార్యక్రమాలను ఇతర శాఖల సమన్వయంతో అమలు చేయాలని, ఫామ్ పాండ్స్, పెర్కొలేషన్ ట్యాంక్స్, కంటిన్యూయస్ కాంటూర్ ట్రెంచెస్ వంటి నిర్మాణాల ద్వారా భూగర్భ జలాల రీచార్జ్‌ను పెంచాలని ఆదేశించారు. చేపట్టిన పనులకు సంబంధించి జియో ట్యాగింగ్, వినియోగ వివరాల నమోదు ప్రక్రియలను నూరు శాతం పూర్తి చేయాలని తెలిపారు. సహజ వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు వ్యవసాయం, పంచాయతీరాజ్, ఇరిగేషన్, మత్స్య, పశుసంవర్ధక తదితర శాఖల సమన్వయంతో కన్వర్జెన్స్ కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టాలని సూచించారు. ఫామ్ పాండ్స్, క్యాటిల్ షెడ్స్, సింకెన్ పిట్స్ వంటి పనులతో పాటు తక్కువ నీటితో సాగు చేసే పంటలు, తక్కువ వ్యవధి పంటలు, సేంద్రీయ విత్తనాల వినియోగం, సహజ వ్యవసాయ విధానాలపై రైతులకు శిక్షణ, అవగాహన కల్పించాలని ఆదేశించారు. ప్రీ-మాన్సూన్ డ్రై సోయింగ్ క్యాంపెయిన్‌తో పాటు వ్యవసాయం, ఉద్యానవనం, అటవీ శాఖలు చేపడుతున్న కార్యక్రమాల లక్ష్యాలను సాధించాలని తెలిపారు. వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో పశుసంపదకు అవసరమైన పశు గ్రాసం అందుబాటులో ఉండేలా కార్యక్రమాలను పటిష్టంగా అమలు చేయాలని ఆదేశించారు. పరిశ్రమలకు అవసరమైన రోడ్లు, నీటి సరఫరా వంటి మౌలిక వసతులను త్వరగా పూర్తి చేసి, సింగిల్ విండో క్లియరెన్సులను ఫాస్ట్‌ట్రాక్‌లో పరిష్కరించాలని సూచించారు. జాతీయ రహదారులు, బైపాస్‌లు, జంక్షన్లు, పారిశ్రామిక కారిడార్లకు సంబంధించిన భూసేకరణ సమస్యలను పరిష్కరించాలని, కాంపాక్ట్ బ్లాక్స్, ఎలియనేషన్ భూములు, పెండింగ్ ఫైళ్లను వెంటనే క్లియర్ చేయాలని ఆదేశించారు. 32 ఫుడ్ ప్రాసెసింగ్ ప్రాజెక్టులకు సంబంధించిన ఎంఓయూ, భూకేటాయింపు, క్లియరెన్స్ ప్రక్రియలను వేగవంతం చేయాలని, పీఎంఎఫ్ఎంఈ కింద మంజూరైన రుణాలు అర్హులైన లబ్ధిదారులకు త్వరగా అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. గార్గేయపురం బోటింగ్, ఓర్వకల్లు రాక్ గార్డెన్, పెద్దతుంబలం పర్యాటక ప్రాజెక్టులకు సంబంధించిన భూ ప్రతిపాదనలపై పూర్తి వివరాలు సేకరించి త్వరగా పరిష్కరించాలని అదేశించారు. అక్టోబర్‌లో జరగనున్న పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్‌ను దృష్టిలో ఉంచుకుని జిల్లాలో పరిశ్రమలు, పెట్టుబడులు, ఉపాధి అవకాశాల అభివృద్ధికి సంబంధించిన ప్రతిపాదనలను సిద్ధం చేసి వేగంగా చర్యలు చేపట్టాలని సూచించారు. సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ సైట్లకు భూసేకరణను త్వరగా పూర్తి చేయాలని, బల్క్ వేస్ట్ జనరేటర్లు నిబంధనల ప్రకారం సొంత వ్యర్థాల ప్రాసెసింగ్ వ్యవస్థలను ఏర్పాటు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్లాస్టిక్ వ్యర్థాల రీసైక్లింగ్, కూరగాయలు--పండ్ల వ్యర్థాలతో కంపోస్ట్ తయారీ, డ్రెయిన్ల శుభ్రత, గ్రీన్ కవర్ పెంపుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. హాస్టళ్లు, పాఠశాలల నిర్మాణాలు, ఆర్వో ప్లాంట్లు, సీసీ కెమెరాల ఏర్పాటుకు సంబంధించిన పనులను వేగంగా పూర్తి చేయాలని, పదో తరగతి ఉత్తీర్ణత శాతం పెంచేందుకు రెమిడియల్ క్లాసులు, బ్రిడ్జ్ కోర్సులు నిర్వహించాలని సూచించారు. 'అన్నదాత సుఖీభవ' పథకం ద్వారా అర్హులైన రైతులందరికీ ప్రయోజనం అందేలా ఆధార్ సీడింగ్, భూమి వివరాల పరిశీలనను వేగవంతం చేయాలని ఆదేశించారు. అంగన్‌వాడీలు, పోషణ్ ట్రాకర్ డేటా, పాఠశాలలు--అంగన్‌వాడీల మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. గ్రామ సభల్లో జనాభా నిర్వహణ, కుటుంబ సంక్షేమం తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించేలా ప్రత్యేక అజెండా అంశంగా చేర్చాలని, సంబంధిత శాఖలు సమన్వయంతో ప్రజలకు అవసరమైన సమాచారాన్ని అందించాలని సూచించారు. వక్ఫ్ భూములను ఆక్రమణల నుంచి రక్షించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఉమ్మీద్ పోర్టల్‌లో నమోదైన భూముల వివరాలు, రక్షణ చర్యలు, మిగిలిన భూముల గణాంకాలను స్పష్టంగా నమోదు చేయాలని సూచించారు. సమీక్షలో చర్చించిన అన్ని అంశాలపై 10 రోజుల్లోగా ఖచ్చితమైన యాక్షన్ టేకెన్ రిపోర్ట్ (ఏటీఆర్) సమర్పించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి అధికారులను ఆదేశించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి వెంకటనారాయణమ్మ, సీపీఓ భారతి, సంబంధిత జిల్లా అధికారులు పాల్గొన్నారు.

నిరుపేదల కల సాకారం అయ్యేవరకు సీపీఐ పోరాటం

ఇల్లు లేని పేదలకు మూడు సెంట్ల స్థలం.. ఇంటి నిర్మాణానికి రూ.4 లక్షలు ఇవ్వాలి

సీపీఐ బనగానపల్లె మండల కార్యదర్శి శివయ్య

పలుకూరు, మహి న్యూస్, సెప్టెంబర్ 08: ఇల్లు లేని నిరుపేదల సొంతింటి కల సాకారం అయ్యే వరకు సీపీఐ పోరాటం కొనసాగిస్తుందని సీపీఐ బనగానపల్లె మండల కార్యదర్శి శివయ్య అన్నారు. ఇల్లు లేని పేద కుటుంబాలకు మూడు సెంట్ల ఇంటి స్థలం మంజూరు చేసి, ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ.4 లక్షల ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం పలుకూరు గ్రామ సచివాలయం--1లో గ్రామ సచివాలయ కార్యనిర్వహణ అధికారికి వినతి పత్రం అందజేశారు. ఎన్నో సంవత్సరాలుగా సొంత ఇంటి కోసం ఎదురుచూస్తున్న పేద కుటుంబాలకు ప్రభుత్వం ప్రాధాన్యతనిచ్చి అర్హులైన ప్రతి కుటుంబానికి మూడు సెంట్ల స్థలం కేటాయించాలని కోరారు. ఇంటి నిర్మాణ సామగ్రి ధరలు పెరిగిన నేపథ్యంలో ప్రభుత్వం అందించే గృహ నిర్మాణ ఆర్థిక సహాయాన్ని రూ.4 లక్షలకు పెంచి, అర్హులైన లబ్ధిదారులకు త్వరితగతిన మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. నిరుపేదల నుంచి అర్జీలను స్వీకరించి, సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని గ్రామ సచివాలయ కార్యనిర్వహణ అధికారిని కోరారు. పలుకూరు గ్రామ నిరుపేదలకు న్యాయం జరిగేలా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ సీనియర్ నాయకులు లక్ష్మయ్య, చిన్నబాలి, సుబ్బరాజు, మహిళలు పాల్గొన్నారు.

ఎన్‌టీఆర్ భరోసా పెన్షన్ దరఖాస్తు నమోదు

అర్హులైన లబ్ధిదారులకు పారదర్శకంగా, సకాలంలో సేవలు అందించేందుకు చర్యలు

కర్నూలు, సెప్టెంబర్ 08: (మహి న్యూస్): కర్నూలు అర్బన్ పరిధిలోని స్వర్ణ రాఘవేంద్ర నగర్ 79వ సచివాలయం--31వ వార్డు, ఐటీసీ కంపెనీ 78వ సచివాలయంలో మంగళవారం ఎన్‌టీఆర్ భరోసా పెన్షన్ పథకానికి సంబంధించి ఒక లబ్ధిదారుడి వృద్ధాప్య పెన్షన్ దరఖాస్తును ఏపీ సేవా వెబ్ పోర్టల్‌లో విజయవంతంగా నమోదు చేశారు. దరఖాస్తు నమోదు ప్రక్రియ పూర్తయిన అనంతరం సంబంధిత దరఖాస్తుకు సంబంధించిన స్వీకరణ పత్రం కూడా వ్యవస్థ ద్వారా విజయవంతంగా జారీ అయింది. ఎన్‌టీఆర్ భరోసా పెన్షన్ పథకం కింద అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి పారదర్శకంగా, సకాలంలో సేవలు అందించేందుకు చర్యలు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు.

పీఎం-సేతు పథకంతో ఐటీఐల్లో మౌలిక వసతుల అభివృద్ధి

పరిశ్రమల భాగస్వామ్యంతో విద్యార్థులకు ఆధునిక సాంకేతిక శిక్షణ అందించాలి

కర్నూలు, సెప్టెంబర్ 8: (మహి న్యూస్): జిల్లాలో ప్రధాన మంత్రి నైపుణ్యాభివృద్ధి, ఉపాధి కల్పన కోసం అధునికీకరించిన పారిశ్రామిక శిక్షణా సంస్థల పథకం (పీఎం-సేతు) కింద పరిశ్రమల భాగస్వామ్యంతో పారిశ్రామిక శిక్షణా సంస్థల్లో (ఐటీఐలు) మౌలిక వసతులను అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో ప్రధాన మంత్రి జాతీయ శిష్యరిక ప్రోత్సాహక పథకం (పీఎం-ఎన్ఏపీఎస్), ప్రధాన మంత్రి నైపుణ్యాభివృద్ధి, ఉపాధి కల్పన కోసం అధునికీకరించిన ఐటీఐల పథకం (పీఎం-సేతు) అమలుపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పీఎం-సేతు ప్రాజెక్టు కింద తాండ్రపాడులోని ప్రభుత్వ బాలికల ఐటీఐ, ఆలూరు ప్రభుత్వ ఐటీఐ, కర్నూలు ఓల్డ్ టౌన్ ప్రభుత్వ ఐటీఐలు ఎంపికయ్యాయని తెలిపారు. పరిశ్రమల భాగస్వామ్యంతో ఆయా ఐటీఐల్లో విద్యార్థులకు అవసరమైన ఆధునిక సాంకేతిక శిక్షణకు అనుగుణంగా మౌలిక వసతులను పెంపొందించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ ప్రాజెక్టులో పరిశ్రమలను భాగస్వామ్యం చేసేలా సంబంధిత పరిశ్రమలను సంప్రదించాలని జిల్లా ఉపాధి కల్పన, నైపుణ్యాభివృద్ధి అధికారిని ఆదేశించారు. పరిశ్రమల నుంచి ముందుగానే శిష్యరిక ఖాళీలు, వారి అవసరాలను సేకరించి, వాటికి అనుగుణంగా పీఎం-ఎన్ఏపీఎస్ కార్యక్రమం ద్వారా శిష్యరిక మేళాలను నిర్వహించాలని సూచించారు. ఇప్పటివరకు ఎన్ని శిష్యరిక అవకాశాలు కల్పించారు, ఎంతమంది అభ్యర్థులు ఎంపికయ్యారు, ఇంకా ఎన్ని అవకాశాలు అందుబాటులోకి రానున్నాయనే వివరాలను సేకరించి, తదుపరి కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో జిల్లా ఉపాధి కల్పన, నైపుణ్యాభివృద్ధి అధికారి దీప్తి, జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ సంజీవ రాజు, ఆలూరు ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ నాగరాజు, కర్నూలు ఓల్డ్ టౌన్ ప్రభుత్వ ఐటీఐ ఏడి ఇన్‌చార్జి కృష్ణమోహన్, నైపుణ్యాభివృద్ధి అధికారి అనంద్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో 100 శాతం అక్షరాస్యత సాధించడమే లక్ష్యం

నంద్యాల, మహి న్యూస్, సెప్టెంబరు 08 :- జిల్లాలో 100 శాతం నిరక్షరాస్యతను నిర్మూలించి ప్రతి ఒక్కరినీ అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా అధికారులు, వాలంటీర్లు సమన్వయంతో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాలులో నిర్వహించిన 60వ అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 100 శాతం అక్షరాస్యత సాధించడమే లక్ష్యంగా అధికారులు, సిబ్బంది, వాలంటీర్లు సమిష్టి కృషితో పనిచేయాలని పిలుపునిచ్చారు. అక్షరజ్ఞానం కేవలం చదవడం, రాయడం నేర్చుకోవడం మాత్రమే కాదని, అది వ్యక్తిలో ఆత్మగౌరవం, ఆత్మవిశ్వాసం, సాధికారతను పెంపొందించి మెరుగైన జీవనానికి బాటలు వేస్తుందని పేర్కొన్నారు. ముఖ్యంగా మహిళలు ఎవరూ విద్యకు దూరంగా ఉండకుండా, చదువులో వెనుకబడిన ప్రతి ఒక్కరూ అక్షరజ్ఞానం పొందేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. సర్వే ద్వారా జిల్లాలో సుమారు 3.50 లక్షల మంది నిరక్షరాస్యులను గుర్తించామని, వారందరినీ మూడు సంవత్సరాల కాలంలో అక్షరాస్యులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో "ఉల్లాస్" (అక్షరాంధ్ర) కార్యక్రమాన్ని చేపట్టినట్లు కలెక్టర్ తెలిపారు. గత ఏడాది నిర్వహించిన ఫేజ్-1లో లక్ష మందికి పైగా అభ్యాసకులకు అక్షరాస్యత అందించే లక్ష్యాన్ని విజయవంతంగా సాధించామని పేర్కొన్నారు. అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవాన్ని పురస్కరించుకుని "అక్షరాంధ్ర ఫేజ్-2"ను ప్రారంభించినట్లు తెలిపారు. ఈ దశలో సుమారు 1.12 లక్షల మందిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దడం లక్ష్యంగా పెట్టుకున్నామని, మిగిలిన లక్ష్యాన్ని వచ్చే ఏడాది ఫేజ్-3లో పూర్తి చేసి జిల్లాను 100 శాతం అక్షరాస్యత సాధించిన జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రణాళిక రూపొందించినట్లు కలెక్టర్ వివరించారు. ముందుగా అక్షరాలను గుర్తించడం, బోర్డులు, బస్సుల పేర్లు చదవడం వంటి ప్రాథమిక నైపుణ్యాలను అలవర్చుకోవడంతో చదవడం, రాయడంపై ఆసక్తి పెరుగుతుందని అన్నారు. కేవలం సంతకం చేయడం వరకు పరిమితం కాకుండా అక్షరాలపై సంపూర్ణ అవగాహన కల్పించాలని సూచించారు. ప్రస్తుత డిజిటల్ యుగంలో బ్యాంకు ఫారాలు నింపడం, ఏటీఎం ద్వారా నగదు తీసుకోవడం, యూపీఐ చెల్లింపులు, మొబైల్ ద్వారా ఆర్థిక లావాదేవీలు నిర్వహించడం వంటి దైనందిన అవసరాలకు ప్రాథమిక అక్షరాస్యత ఎంతో అవసరమని తెలిపారు. అక్షరజ్ఞానం లేకపోవడం వల్ల ఎవరూ మోసపోకుండా ఉండేందుకు ప్రతి ఒక్కరికీ కనీస అక్షరాస్యత కల్పించాల్సిన బాధ్యత సమాజంపై ఉందన్నారు. అక్షరాంధ్ర కార్యక్రమంలో భాగంగా సంఘాల్లోని చదువుకున్న సభ్యులు, ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న చదువుకున్న వారిని వాలంటీర్లుగా ఎంపిక చేసి అభ్యాసకులకు బోధన అందిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. వాలంటీర్లకు 8 పాఠాలతో కూడిన పుస్తకాలను అందించడంతో పాటు అభ్యాసకుల కోసం 32 సాధన పత్రాలు, 4 మోడల్ ప్రశ్నపత

RNI : APTEL/25/A0108
మహి న్యూస్
www.mahinewsindia.com
epaper: https://epaper.mahinewsindia.com
తెలుగు దినపత్రిక

అక్షరాస్యతతోనే హక్కులపై అవగాహన

కడప టీడీపీ నేతలతో మంత్రి సవితమ్మ ఆత్మీయ సమావేశం

పార్టీ బలోపేతం.. అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారంపై చర్చ

స్థానిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి సమష్టిగా పనిచేయాలని దిశానిర్దేశం

విజయవాడ, మహి న్యూస్, సెప్టెంబర్ 08: కడప జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవితమ్మ ఆధ్వర్యంలో కడప జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, తెలుగుదేశం పార్టీ నాయకులతో విజయవాడలోని జయభేరి క్లబ్‌హౌస్‌లో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో పాల్గొన్న అనంతరం ఈ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి సవితమ్మ ప్రజాప్రతినిధులు, టీడీపీ నాయకులతో ఆత్మీయంగా ముచ్చటిస్తూ కడప జిల్లాలో తెలుగుదేశం పార్టీని మరింత బలోపేతం చేయడం, జిల్లాలో కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సమస్యల పరిష్కారం, భవిష్యత్ కార్యాచరణ తదితర అంశాలపై చర్చించారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ కడప జిల్లాను అభివృద్ధి పథంలో మరింత ముందుకు తీసుకెళ్లాలని మంత్రి సూచించారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో అన్ని స్థానాల్లో కూటమి అభ్యర్థులను ఘన మెజారిటీతో గెలిపించేందుకు ఇప్పటి నుంచే సమష్టిగా కృషి చేయాలని దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో టీడీపీ జోనల్ కో-ఆర్డినేటర్ రెడ్డప్పగారి శ్రీనివాసరెడ్డి, కడప జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు భూపేష్ సుబ్బరామిరెడ్డి, ప్రభుత్వ విప్, కడప ఎమ్మెల్యే రెడ్డెప్పగారి మాధవి, ఎమ్మెల్యే చైతన్య రెడ్డి, మైదుకూరు శాసనసభ్యుడు సుధాకర్ యాదవ్, బద్వేల్ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి సూర్యనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సెప్టెంబర్ 12న జాతీయ లోక్ అదాలత్

కడప జిల్లాలోని అన్ని కోర్టుల్లో నిర్వహణ

వివాదాలను రాజీ మార్గంలో పరిష్కరించుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సూచన

కడప, మహి న్యూస్, సెప్టెంబర్ 08: కడప జిల్లాలోని అన్ని కోర్టుల్లో సెప్టెంబర్ 12వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. రామ గోపాల్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రజలు జాతీయ లోక్ అదాలత్ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమకు సంబంధించిన వివాదాలను రాజీ మార్గంలో పరిష్కరించుకోవాలని సూచించారు. రాజీ ద్వారా కేసులను పరిష్కరించుకోవడం వల్ల సమయం, ఖర్చు ఆదా కావడంతో పాటు ఇరుపక్షాలకు ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న కేసులతో పాటు పరిష్కరించదగిన వివాదాలను లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకునేందుకు ప్రజలు ముందుకు రావాలని కోరారు. జాతీయ లోక్ అదాలత్‌పై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించేలా ప్రింట్, ప్రెస్, ఎలక్ట్రానిక్ మీడియా సహకరించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ, కడప కోరింది.


"as well under the aegis of NALSA"
District Legal Services Authority
Nyaya Seva Sadan, District Court Compound,
Kadapa-Pin.516001 Ph.08562-244622(0)
Email : dlsakdp@gmail.com
జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కడప.
తేది: 12-09-2026 (శనివారం)
District Court Kadapa web site : kadapa.dcourts.gov.in/dlsa.Email : dlsakdp@gmail.com
08562-258622, 244622
QR CODE
Download NALSA Legal Services Mobile APP for Legal Services

పెన్షన్ల నమోదును పరిశీలించిన అధికారులు

గాలివీడు:సెప్టెంబర్08(మహి న్యూస్): నూతన పెన్షన్ రిజిస్ట్రేషన్, అప్‌డేట్ ప్రక్రియను ఎంపీడీవో, డిప్యూటీ ఎంపీడీవో, జీఎస్‌డబ్ల్యూఎస్ అధికారులు అరవీడు గ్రామ సచివాలయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా సచివాలయంలో పెన్షన్లకు సంబంధించిన దరఖాస్తుల నమోదు, అప్‌డేట్ ప్రక్రియను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అధికారుల వివరాల ప్రకారం ఇప్పటివరకు 141 పెన్షన్లు అప్‌డేట్ అయ్యాయి. నూతన పెన్షన్ దరఖాస్తులను నిబంధనల ప్రకారం పరిశీలించి, అర్హులైన లబ్ధిదారుల వివరాలను సక్రమంగా నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. దరఖాస్తుల పరిశీలన, డేటా అప్‌డేట్‌లో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులు సూచించారు. సచివాలయ సిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

జ్ఞాననేత్ర అందుల స్వచ్ఛంద సేవా సంస్థకు 88 వేల విరాళం

రాయచోటి, మహిన్యూస్, సెప్టెంబర్ 8: జ్ఞాననేత్ర అందుల స్వచ్ఛంద సేవా సంస్థకు 88 వేల విరాళం అందజేసినట్లు దివ్య తేజ విద్యాసంస్థల కరస్పాండెంట్ నాగేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంద విద్యార్థులకు చేయూతను అందించాలని ఉద్దేశంతో తమ విద్యార్థులు, తమ సిబ్బంది, మేనేజ్మెంట్ అందరం కలిసి 88 వేల రూపాయలు విరాళం అందించినట్లు తెలిపారు. ఇలాంటి మంచి కార్యక్రమానికి సహకరించిన ఉపాధ్యాయులకు, విద్యార్థులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

జవహర్ నవోదయ విద్యాలయంలో

9, 11 తరగతుల్లో ప్రవేశాలకు లేటరల్ ఎంట్రీ సెలక్షన్ టెస్ట్-2027

మదనపల్లె, మహి న్యూస్, సెప్టెంబర్ 08: అన్నమయ్య జిల్లా వలసపల్లిలోని జవహర్ నవోదయ విద్యాలయంలో 2027--28 విద్యా సంవత్సరానికి 9వ తరగతి, 11వ తరగతిలో ఖాళీ సీట్ల భర్తీ కోసం లేటరల్ ఎంట్రీ సెలక్షన్ టెస్ట్ (లెట్స్--2027) నిర్వహించనున్నట్లు జవహర్ నవోదయ విద్యాలయ ప్రిన్సిపల్ ఎం. గీత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన ప్రతిభావంతులైన విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలనే లక్ష్యంతో నవోదయ విద్యాలయాలు పనిచేస్తున్నాయని, అర్హత కలిగిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ఆన్‌లైన్ దరఖాస్తుల చివరి తేదీ సెప్టెంబర్ 30, 2026 అని తెలిపారు. విద్యార్థులు ఎలాంటి రుసుము లేకుండా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

9వ తరగతి ప్రవేశాలకు: https://cbseitms.nic.in/2026/nvsix_9/

11వ తరగతి ప్రవేశాలకు: https://cbseitms.nic.in/2026/nvsxi_11/

లేటరల్ ఎంట్రీ సెలక్షన్ టెస్ట్ 2027 ఏప్రిల్ 10న నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ ఎం. గీత తెలిపారు. అర్హత కలిగిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు చివరి తేదీ వరకు వేచి ఉండకుండా దరఖాస్తు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు, తల్లిదండ్రులకు ప్రవేశ ప్రక్రియపై అవగాహన కల్పించేందుకు సంబంధిత విద్యాశాఖ అధికారులు, పాఠశాలలు విస్తృతంగా ప్రచారం చేయాలని నవోదయ విద్యాలయ సమితి కోరినట్లు ఆమె తెలిపారు.

విద్యతో ఆత్మవిశ్వాసం.. న్యాయ అవగాహనతో సమాజాభివృద్ధి

కడప ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు

కడప జిల్లా/మహి న్యూస్ । సెప్టెంబర్ 08: అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవాన్ని పురస్కరించుకుని కడప ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, అమరావతి ఆదేశాల

మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్-కం-జిల్లా ప్రధాన న్యాయాధికారి జి. రామ గోపాల్, సెక్రటరీ-కం-సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్ సూచనల మేరకు లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్, మీడియేటర్ న్యాయవాదుల ద్వారా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ అక్షరాస్యత ప్రతి వ్యక్తి జీవితంలో ఎంతో కీలకమైనదని పేర్కొన్నారు. విద్య ద్వారా

సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ముఖ్యంగా వయోజనులు కూడా విద్యను అభ్యసించేలా వయోజన అక్షరాస్యత కార్యక్రమాలను మరింత ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. అక్షరాస్యతతో పాటు ప్రజలకు ప్రాథమిక న్యాయ హక్కులు, ఉచిత న్యాయ సహాయం, లోక్ అదాలత్‌లు, మధ్యవర్తిత్వం, ఇతర న్యాయ సేవలపై అవగాహన కల్పించడం ద్వారా సమాజంలోని ప్రతి ఒక్కరికీ న్యాయం మరింత చేరువ చేయవచ్చని వివరించారు. ప్రజలు తమకు ఎదురయ్యే న్యాయపరమైన సమస్యలపై జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలని సూచించారు. న్యాయ సహాయం కోసం న్యాయ సేవల హెల్ప్‌లైన్ 15100, పిల్లల సహాయం కోసం చైల్డ్ హెల్ప్‌లైన్ 1098, అత్యవసర పోలీసు సహాయం కోసం 112 నంబర్లను వినియోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ యం. శాంత, మీడియేటర్ న్యాయవాదులు వేణుగోపాల్, రాజశేఖర్, కళాశాల ప్రిన్సిపాల్ టి. జ్ఞానేశ్వరి, అధ్యాపకులు శ్రీరాముల రెడ్డి, చంద్రమౌళి, రాజా రావు, నాగమహేశ్వర రెడ్డి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది, పారా లీగల్ వాలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

కడప "స్మార్ట్ కిచెన్"కు జైకా, నీతీ ఆయోగ్ ప్రశంసలు...!

కొండపేట జెడ్పిహెచ్ఎస్ లో స్మార్ట్ కిచెన్, చెన్నూరు గర్ల్స్ హైస్కూలు మధ్యాహ్న భోజన అమలు తీరు పరిశీలన. విద్యార్థులతో కలిసి భోజనం చేసిన జైకా ప్రతినిధీ యుమికో ఓనిషి, జిల్లా కలెక్టర్, జేసీ, అధికారులు

కడప, మహి న్యూస్ సెప్టెంబర్ 8: విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన, పోషకాహారాన్ని అందించడంతో పాటు వారిలో క్రమశిక్షణ, పరిశుభ్రత, బాధ్యత, సమైక్యతా భావం, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తున్న కడప జిల్లా స్మార్ట్ కిచెన్ వ్యవస్థకు జపాన్ అంతర్జాతీయ సహకార సంస్థ (జైకా) ప్రతినిధుల నుంచి ప్రశంసలు లభించాయి. మంగళవారం చెన్నూరు మండలంలో జైకా టీమ్ లీడర్ యుమికో ఓనిషి, నీతి ఆయోగ్ ఆరోగ్యం--పోషణ నిపుణుడు

మోహిత్ సూద్ తదితరులు పర్యటించారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి తోపాటు, జేసీ డా. నిధీమీనా హాజరయ్యారు. తొలుత కొండపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలోని స్మార్ట్ కిచెన్‌ను సందర్శించి అక్కడ ఆహార తయారీ, పరిశుభ్రత, నాణ్యత ప్రమాణాలు, భోజనం పాఠశాలలకు తరలింపు, సమయపాలన, ఉష్ణోగ్రత పర్యవేక్షణ తదితర అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి స్మార్ట్ కిచెన్ నిర్వహణ విధానాన్ని చక్కో విభాగం వారీగా వారికి వివరించారు. అనంతరం చెన్నూరు మండల కేంద్రంలోని పీఎం జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాలలో అమలవుతున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని జైకా ప్రతినిధులు పరిశీలించారు. స్మార్ట్ కిచెన్ నుంచి సరఫరా చేసిన మధ్యాహ్న భోజనాన్ని స్వయంగా రుచి చూసిన యుమికో ఓనిషి.. ఆహారం నాణ్యత, రుచి పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థినులతో కలిసి సహపంక్తి భోజనం చేస్తూ.. పాఠశాలలో మధ్యాహ్న భోజనం అందించే విధానం, విద్యార్థుల క్రమశిక్షణ, పరిశుభ్రతను ప్రత్యక్షంగా గమనించారు. అనంతరం యుమికో ఓనిషి, మోహిత్ సూద్‌లతో పాటు జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి, జాయింట్ కలెక్టర్ డా. నిధి మీనా, పలువురు అధికారులు విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు స్మార్ట్ కిచెన్, మధ్యాహ్న భోజనం, పరిశుభ్రత, పోషకాహారంపై రూపొందించిన పోస్టర్లను ప్రదర్శించగా.. వాటిని జిల్లా కలెక్టర్ స్వయంగా జైకా ప్రతినిధులకు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యార్థులకు కేవలం భోజనం అందించడమే కాకుండా.. భోజన సమయాన్ని ఒక అభ్యాస ప్రక్రియగా మార్చడమే ఏఎన్‌టీఎస్ కార్యక్రమం ఉద్దేశమని వివరించారు. భోజనానికి ముందు చేతులు శుభ్రం చేసుకోవడం, క్రమపద్ధతిలో భోజనం చేయడం, అవసరమైనంత మాత్రమే వడ్డించుకోవడం, ఆహారాన్ని వృథా చేయకుండా చూడటం, భోజనం అనంతరం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం వంటి అలవాట్లను విద్యార్థుల దైనందిన జీవితంలో భాగంగా చేస్తున్నట్లు తెలిపారు. జైకా ప్రతినిధి యుమికో ఓనిషి మాట్లాడుతూ.. స్మార్ట్ కిచెన్ వ్యవస్థ విద్యార్థుల ఆరోగ్యంతో పాటు వారి ప్రవర్తనలోనూ సానుకూల మార్పులకు దోహదపడుతోందని ప్రశంసించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేయడం, పాఠశాలలో అమలవుతున్న విధానాలను ప్రత్యక్షంగా పరిశీలించడం ద్వారా కార్యక్రమం యొక్క ప్రభావాన్ని తెలుసుకునే అవకాశం లభించిందన్నారు. కడప జిల్లా యంత్రాంగం అమలు చేస్తున్న ఈ విధానం ఇతర ప్రాంతాలకు కూడా ఆదర్శంగా నిలిచే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు. స్మార్ట్ కిచెన్ నిర్వహణ తీరును, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం అమలును ప్రత్యక్షంగా పరిశీలించిన జైకా బృందం.. జిల్లా యంత్రాంగం చేపట్టిన విధానంపై సంతృప్తి వ్యక్తం చేసింది. క్షేత్రస్థాయిలో పర్యటించి స్వయంగా పరిశీలించడం, విద్యార్థులతో కలిసి భోజనం చేయడం

ద్వారా కార్యక్రమంపై మరింత సానుకూల అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. జిల్లాలో ప్రస్తుతం అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో దాదాపు లక్ష మంది విద్యార్థులకు ప్రతిరోజూ వేడి, పరిశుభ్రమైన, పోషకాహార మధ్యాహ్న భోజనం అందుతోంది. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ ఆహార తయారీ నుంచి సరఫరా వరకు నాణ్యత, సమయపాలన వంటి అంశాలను పర్యవేక్షిస్తున్నారు. ఈ వ్యవస్థను విద్యార్థుల సమగ్ర వికాసానికి అనుసంధానిస్తూ జిల్లా యంత్రాంగం చేపడుతున్న చర్యలకు తాజాగా జైకా ప్రతినిధుల ప్రశంసలు మరింత ప్రోత్సాహాన్ని అందించాయి. ఈ కార్యక్రమంలో కడప ఆర్డీవో మురళీ, డీఈవో శంశుద్దీన్, సమగ్రశిక్ష ఏపిసి అనురాధ, డీఆర్డీఏ పీడి డా. రాజ్యలక్ష్మి, ఏపీసీఎన్ఎఫ్ డిపిఎం ప్రవీణ్ కుమార్, తదితరులు హాజరయ్యారు.

పారదర్శకంగా.. సజావుగా ఎన్టీఆర్ భరోసా కొత్త పింఛన్ల దరఖాస్తుల స్వీకరణ

మదనపల్లె, మహి న్యూస్, సెప్టెంబర్ 8: ఎన్టీఆర్ భరోసా పింఛను పథకం కింద కొత్త పింఛన్ల మంజూరుకు అర్హులైన వారి నుంచి సెప్టెంబర్ 7, సోమవారం నుంచి ప్రారంభమైన దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా పారదర్శకంగా, సజావుగా, ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనసాగుతోందని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్త పింఛన్ల కోసం అర్హులైన లబ్ధిదారులు దరఖాస్తు చేసుకునేందుకు స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు సచివాలయాల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు, సహాయ సహకారాలు అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. దరఖాస్తుదారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా దరఖాస్తుల స్వీకరణ, ఆన్‌లైన్ నమోదు, ఈ-కేవైసీ ప్రక్రియను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, గీత కార్మికులు, చేనేత కార్మికులు, మత్స్యకారులు, సంప్రదాయ వృత్తిదారులు తదితర అర్హులైన వారు ప్రభుత్వ నిబంధనల మేరకు ఎన్టీఆర్ భరోసా పింఛను కోసం దరఖాస్తు చేసుకోవచ్చని కలెక్టర్ తెలిపారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకం ప్రయోజనం అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

నియోజకవర్గాల వారీగా ప్రత్యేక పర్యవేక్షణ

దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను పర్యవేక్షించేందుకు కలెక్టర్ ప్రత్యేకంగా నియమించిన నియోజకవర్గ ప్రత్యేక అధికారులు మంగళవారం తమ పరిధిలోని స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు సచివాలయాలను తనిఖీ చేసి దరఖాస్తుల స్వీకరణ, పరిశీలన, ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను స్వయంగా పరిశీలించారు. మదనపల్లె సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి, మదనపల్లె మండలంలోని బసినికొండ--1, కొండమర్రిపల్లి స్వర్ణ వార్డు, స్వర్ణ గ్రామ సచివాలయాలను తనిఖీ చేసి దరఖాస్తుల స్వీకరణ తీరును పరిశీలించారు. దరఖాస్తుదారులు, పింఛను లబ్ధిదారులతో మాట్లాడి వారికి ఎదురవుతున్న సమస్యలు, ఇబ్బందులను తెలుసుకున్నారు. రాయచోటి ఆర్డీవో శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్ శ్రీ పి. రమణారెడ్డితో కలిసి సచివాలయం--6 పరిధిలోని బేతల కాలనీలో పర్యటించి దరఖాస్తుల స్వీకరణకు సంబంధించిన పరిస్థితులను పరిశీలించారు. పీలేరు ఆర్డీవో కే. విజయలక్ష్మి వాల్మీకిపురం మండలంలోని గండబోయినపల్లి స్వర్ణ గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేసి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను



పరిశీలించారు. పుంగనూరు నియోజకవర్గ ప్రత్యేక అధికారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎన్. చంద్రశేఖర్ రెడ్డి పుంగనూరు మండలం భీమగానిపల్లి స్వర్ణ గ్రామ సచివాలయంలో ఎంపీడీవోతో కలిసి పింఛను దరఖాస్తుల స్వీకరణ, పరిశీలన, వెరిఫికేషన్ ప్రక్రియను తనిఖీ చేశారు. తంబళ్లపల్లె నియోజకవర్గ ప్రత్యేక అధికారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె. మాధవ కృష్ణారెడ్డి నియోజకవర్గ పరిధిలోని అంగళ్లు, కురబలకోట స్వర్ణ గ్రామ సచివాలయాలను తనిఖీ చేసి దరఖాస్తుల స్వీకరణ తీరును పరిశీలించారు.

దరఖాస్తుదారుల సమస్యలను తెలుసుకుని పరిష్కరించాలి

తనిఖీల సందర్భంగా అధికారులు పింఛను లబ్ధిదారులు, దరఖాస్తుదారులతో నేరుగా మాట్లాడి పథకం ప్రయోజనాలు పొందడంలో ఎదురవుతున్న సమస్యలు, ఇబ్బందులు, ఫిర్యాదులను తెలుసుకున్నారు. సేవల అందజేత పరిస్థితి, ఫిర్యాదుల పరిష్కార విధానాలను కూడా సమీక్షించారు. సంబంధిత సచివాలయ సిబ్బంది స్వీకరించిన ప్రతి పింఛను దరఖాస్తును రిజిస్టర్‌లో నమోదు చేసి, దానిపై తీసుకున్న చర్యలు, సంబంధిత వ్యాఖ్యలను తప్పనిసరిగా నమోదు చేయాలని ఆదేశించారు. దరఖాస్తులను నిర్ణీత సమయంలో పరిష్కరించడంతో పాటు సంబంధిత రికార్డులను క్రమబద్ధంగా నిర్వహించాలని సూచించారు. దరఖాస్తుల స్వీకరణ నుంచి పరిశీలన, ఆన్‌లైన్ నమోదు, వెరిఫికేషన్, అర్హత నిర్ధారణ, తదుపరి ప్రభుత్వ అనుమతి వరకు ప్రతి దశలో పారదర్శకత, జవాబుదారీతనం, నిర్దేశిత కాలపరిమితి పాటించాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

పింఛను దరఖాస్తుల ప్రక్రియకు నిర్దేశిత టైమ్‌లైన్

కొత్త పింఛన్ల దరఖాస్తుల ప్రక్రియను ప్రభుత్వం నిర్దేశించిన టైమ్‌లైన్ ప్రకారం పూర్తి చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు.

సెప్టెంబర్ 7 నుంచి 16 వరకు -- 7 పని దినాలు: కొత్త పింఛను దరఖాస్తుల స్వీకరణ, ఆన్‌లైన్ నమోదు, e-KYC ధ్రువీకరణ.

కామన్ ఎలిజిబిలిటీ వాలిడేషన్: సంబంధిత శాఖలు, SGSW, RTGS, SERP విభాగాల ద్వారా అర్హతల ధ్రువీకరణ.

సెప్టెంబర్ 17 నుంచి 21 వరకు: భౌతిక ధ్రువీకరణతో పాటు చేనేత కార్మికులు, మత్స్యకారులు, డప్పు కళాకారులు, సంప్రదాయ చెప్పుల తయారీదారులు, ట్రాన్స్‌జెండర్లు తదితర వృత్తి ఆధారిత పింఛన్లకు సంబంధిత శాఖల ద్వారా ధ్రువీకరణ.

సెప్టెంబర్ 22 నుంచి 24 వరకు: ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, జిల్లా/రాష్ట్ర స్థాయి అధికారులు దరఖాస్తుల పరిశీలన, అర్హత నిర్ధారణ, అర్హులైన దరఖాస్తుల సిఫారసు.

సెప్టెంబర్ 25 నుంచి 26 వరకు: ఎస్ఈఆర్‌పి ద్వారా బడ్జెట్ ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వ అనుమతి ప్రక్రియ పూర్తి చేయడం.

ఈ నిర్దేశిత కాలపరిమితిలో ప్రతి దశను పూర్తి చేసి, అర్హులైన లబ్ధిదారులకు పింఛను ప్రయోజనం అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు.

అర్హులైన వారు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ఎన్టీఆర్ భరోసా కొత్త పింఛన్లకు అర్హత ఉన్న వారు తమ పరిధిలోని స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు సచివాలయాలను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించారు. దరఖాస్తుదారులకు అవసరమైన సహాయాన్ని సచివాలయ సిబ్బంది అందించాలని, అర్హులైన ఏ ఒక్కరూ ప్రభుత్వ ప్రయోజనానికి దూరం కాకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ స్పష్టం చేశారు.

EDITOR and PUBLISHER and OWNED BY NEELI RAMASUBBAIAH, PUBLISHED AT #1/704, PARK STREET, NEAR OLD BUSTAND, JAMMALAMADUGU-516434,YSR KADAPA DIST, A.P PRINTED AT VSAR PRINTERS,YSR KADAPA DIST, 516004.RNI NO : APTEL/25/A0108.APTEL/26/A5325.APTEL/26/A3560.APTEL/26/A7631.APTEL/26/A7632. Cell 90 59 58 58 98.Email : mahinewsindia@gmail.com, website : https//epaper.mahinewsindia.com